www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



అమెరికా ఆర్మీ డే అతిథిగా పాక్ సైన్యాధిపతి మునీర్

వాషింగ్టన్‌లో రేపు జరగనున్న పరేడ్ 14

దౌత్యపరంగా భారత్‌కు ఎదురుదెబ్బ: కాంగ్రెస్

శుక్రవారం | 13-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 75 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం తిథి: విదియ మ.3.19 తదుపరి తదియ, నక్షత్రం: పూర్వాషాఢ రా.11.21 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: ఉ.8.06-9.48, దుర్ముహూర్తం: ఉ.8.20-9.12, మ.12.41-1.33, అమృతఘడియలు: సా.6.16-7.57, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 5.44, సూర్యాస్తమయం: 6.46 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మరణ విహంగం

గుజరాత్‌లో ఘోర విమాన ప్రమాదం 290 మంది దుర్మరణం

- మృతుల్లో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ
- టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కూలిన ఎయిరిండియా విమానం.. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో ఘటన
- లండన్‌కు వెళ్తున్న క్రమంలో ఘోర ప్రమాదం
- పైలట్లు సహా విమానంలోని 240 మంది దుర్మరణం
- మృత్యుంజయులుగా బయటపడింది ఇద్దరే
- జనావాసాలపైకి దూసుకుపోయిన విమానం
- మెడికల్ కాలేజీ హాస్టల్‌పై పడ్డ బోయింగ్-787
- హాస్టల్‌లోని 50 మంది మెడికల్ విద్యార్థుల మృతి!
- గుర్తుపట్టలేని విధంగా కాలిపోయిన మృతదేహాలు
- మృతుల గుర్తింపునకు కొనసాగుతున్న డీఎన్ఏ సేకరణ
- అహ్మదాబాద్‌కు రామ్మోహన్‌నాయుడు, అమిత్‌షా

పూర్తి కథనాలు 11, 12, 13 పేజీల్లో







అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపట్లోనే ప్రమాదానికి గురై కిందపడి పేలిపోయిన ఎయిరిండియా విమానం



మెడికోల హాస్టల్లోకి దూసుకెళ్లిన విమాన శకలం



ప్రమాదంలో తెగి పడిన విమానం రెక్క

మధ్యాహ్నం ఒకటిన్నర! అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లేందుకు సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ విమానాశ్రయం నుంచి బోయింగ్ 787 గాల్లోకి లేచింది! కేవలం 59 సెకన్లలోనే ఎలా పైకి లేచిందో అలాగే కిందకు కూలిపోయింది! చుట్టుపక్కల జనావాసాల్లోకి దూసుకుపోయింది! విమానం అప్పుడే బయలు దేరడంతో ట్యాంకు నిండా ఇంధనమే! అది కూడా.. ఏకంగా 1.25 లక్షల లీటర్లు! దాంతో, భారీ విస్ఫోటం. పెద్దఎత్తున మంటలు! కరి మబ్బులు నేలకు దిగాయా అన్నట్లు చుట్టూ దట్టంగా కమ్మేసిన పొగ! ఈ ఘోర ప్రమాదంలో విమానంలోని 240 మంది మరణించారు! వారిలో అత్యధికుల మృతదేహాలు గుర్తు కూడా పట్టలేనంత దారుణంగా కాలిపోయాయి! కొందరికి తల, మరికొందరికి కాళ్లు, చేతులు తెగి రోడ్డుపైన పడ్డాయి! ఈ ఘోరం కారణంగానే మరో దారుణమైన విషాదమూ చోటుచేసుకుంది! కూలుతూనే జనావాసాల్లో దిగిన విమానం అక్కడి మెడికల్ కాలేజీ హాస్టల్లోకి దూసుకెళ్లింది! మధ్యాహ్న భోజన విరామం కావడంతో అప్పుడే అక్కడ మెడికోలు, డాక్టర్లు, సిబ్బంది భోజనాలు చేస్తున్నారు! పేలిన విమానం, దాని శకలాలు హాస్టల్లోకి చొచ్చుకురావడంతో వారిలో దాదాపు 50 మంది వరకూ దుర్మరణం చెందారని దైనిక్ భాస్కర్ గుజరాతీ ఎడిషన్ దివ్య భాస్కర్ పేర్కొంది! ప్రమాదంలో పెద్దఎత్తున స్థానికులు గాయపడ్డారని తెలిపింది! ఇంతటి ఘోర ప్రమాదం నుంచి ఇద్దరు మృత్యుంజయులుగా బయటపడడం నిజంగా అద్భుతమే! ప్రమాదం ఎందుకు.. ఎలా జరిగిందన్నది నిపుణులకూ అంతుచిక్కడం లేదు! ఇంజన్లు విఫలం కావడమే ప్రమాదానికి కారణమని చెబుతున్నా.. దానిపైనా భిన్నాభిప్రాయాలే!!

కాబోయే డాక్టర్లు.. కలచెదిరి..

- హాస్టల్ మెస్‌పై విమానం కూలడంతో పెద్ద సంఖ్యలో వైద్య విద్యార్థుల మృతి!
- భోజనం చేస్తూనే కన్నుమూసిన కొందరు
- మరికొందరికి తీవ్ర గాయాలు
- భవనంలో ఎటు చూసినా విధ్వంసమే
- 50 మంది వైద్య విద్యార్థులు మరణించినట్టు పేర్కొన్న దైనిక్ భాస్కర్ వార్తా సంస్థ



విమానం కూలడంతో దగ్ధమైన మెడికల్ కాలేజీ హాస్టల్ భవనం



కార్పొరేటర్ స్థాయి నుంచి.. రాష్ట్రానికి రెండు సార్లు సీఎంగా

ముగిసిన విజయ్ రూపానీ ప్రస్థానం

అసలేం జరిగింది..!?

- ల్యాండింగ్ గేర్ కిందికి ఎందుకు ఉంది?
- 2 ఇంజన్లు విఫలమయ్యే అవకాశాలు తక్కువ
- అసలు విమానం.. ప్రయాణానికి సిద్ధంగా ఉందా?
- ఇంజన్ల విఫలం లేదా పక్షి ఢీకొట్టడం వల్లే కూలింది!
- విమాన ప్రమాదంపై నిపుణుల విశ్లేషణలు

మాటలకందని విషాదం

విమాన ప్రమాదంపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ సీఎం రేవంత్, కేసీఆర్ తదితరుల దిగ్భ్రాంతి

డ్రీమ్‌లైనర్.. డిజాస్టర్!

- బోయింగ్ 787 అత్యాధునికం.. సమస్యలూ అత్యధికం
- హైడ్రాలిక్ లీక్, బ్యాటరీ సమస్యలతో పలుమార్లు అత్యవసర ల్యాండింగ్.. తయారీ, భద్రతలో లోపాలు
- పలు విమానయాన సంస్థల ఫిర్యాదులు
- కుప్పకూలడం మాత్రం ఇదే తొలిసారి!



రమేశ్ విశ్వాస్

మృత్యుంజయుడు

ప్రాణాలతో బయటపడ్డ రమేశ్ విశ్వాస్

ట్రాఫిక్‌జామ్ ఆమెకు వరమైంది

మృతుల కుటుంబాలకు కోటి చొప్పున పరిహారం

వైద్య కాలేజీ హాస్టల్‌ను పునర్నిర్మించి ఇస్తాం

టాటా గ్రూప్ ప్రకటన

పిడుగుపాటుకు ఆరుగురు రైతుల బలి

పొలాల్లోనే ప్రాణాలు విడిచిన అన్నదాతలు.. 12 మందికి గాయాలు..ఇద్దరి పరిస్థితి విషమం

ఆదిలాబాద్ జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు.. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు

హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లిలో అధికంగా 14 సెం.మీ వర్షపాతం నమోదు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



ఆదిలాబాద్ జిల్లాలో పిడుగుపాటుకు గురై మరణించిన రైతులు

వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన అన్నదాతలను పిడుగులు బలిగొన్నాయి. ఒక్కరు.. ఇద్దరు కాదు.. ఏకంగా ఆరుగురు పిడుగుపాటుకు పొలంలోనే ప్రాణాలొదలగా.. మరో 12 మంది రైతులు తీవ్రంగా గాయపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాలోని బేల, గాదిగూడ మండలాల్లో గురువారం జరిగిన ఘటనలు విషాదాన్ని నింపాయి. ఆదిలాబాద్ జిల్లాలోని గాదిగూడ మండలం పిప్రి గ్రామానికి చెందిన 13మంది రైతులు పంట చేనులో విత్తనాలు విత్తుతుండగా.. అకస్మాత్తుగా భారీ వర్షం కురిసింది. దీంతో వీరంతా సమీపంలోని గుడిసెలోకి వెళ్లి తలదాచుకున్నారు. అదే సమయంలో గుడిసెపై పిడుగు పడడంతో నలుగురు రైతులు పెందూరు మాదవరావు (43), పెందూరు సుజాత (17), సిడాం రాంబాయి (40), మంగం భీంబాయి (30) అక్కడికక్కడే మృతి చెందారు. పెందూరు జంగు, పెందూరు శేఖు, సిడాం శంకర్, హిరాకుమ్రె ఈశ్వర్, మర్సుకోల అంజలి, మాగంలింగు, మర్సుకోల సోము, మంగం నందిని, గేడం శంభు(తొమ్మిది మంది) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని తోటి రైతులు చికిత్స నిమిత్తం

మిగతా 3వ పేజీలో...



శశాంక్ గోయల్



నవీన్ మిత్తల్



ప్రియాంక ఆల

భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

- ఢిల్లీలోని తెలంగాణ భవన్ ఆర్‌సీగా శశాంక్ గోయల్
- విద్యుత్తు శాఖకు నవీన్ మిత్తల్, టీజీపీఎస్సీకి ప్రియాంక ఆల
- వెయిటింగ్‌లో ఉన్న శివశంకర్, చిట్టెం లక్ష్మికి పోస్టింగులు
- సీఎం సీపీఆర్వోగా రిటైర్డు అధికారి మల్సూర్ నియామకం
- మరో ముగ్గురు నాన్ క్యాడర్ అధికారులకూ బాధ్యతలు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. కొంత మందిని బదిలీ చేసిన ప్రభుత్వం... మరికొంత మందికి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు సీఎస్ కె.రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్ గురువారం సమావేశమై ఐఏఎస్ అధికారుల బదిలీలపై చర్చించారు. చాలా సేపు మంతనాలు జరిపిన తర్వాత... బదిలీల ప్రక్రియ చేపట్టారు. గత నెల 31న సహకార శాఖ నుంచి రిటైర్ అయి, పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా కొనసాగుతున్న నాన్‌కేడర్ అధికారి జి.మల్సూర్... సీఎం సీపీఆర్వోగా నియమితులయ్యారు. ఆయనను

మిగతా 14వ పేజీలో...

మహిళలకు కోటా రెడీ!

2029 ఎన్నికల్లో 33% సీట్లు

- లోక్‌సభ, అసెంబ్లీల్లో అమలుకు కేంద్ర ప్రభుత్వ ప్రణాళిక
- కొత్త జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన
- ఆ ప్రక్రియలోనే అతివలకు రిజర్వేషన్

2



రోడ్డు నిర్మించకుండానే బిల్లుల మంజూరు!

ఈఈని సస్పెండ్ చేసిన జీహెచ్‌ఎంసీ కమిషనర్



- విధుల నుంచి ఔట్ సోర్సింగ్ ఏఈ తొలగింపు
- ఐఎస్ సదన్ కార్పొరేటర్ ఫిర్యాదుతో విచారణ
- బోగస్ బిల్లులకు నిధులిచ్చినట్లు తేలడంతో చర్యలు

2

మహిళలకు కోటా రెడీ!

- 2029 ఎన్నికల్లో 33శాతం సీట్లు
- లోక్‌సభ, అసెంబ్లీల్లో అమలుకు కేంద్రం ప్రణాళిక

న్యూఢిల్లీ, జూన్ 12: దేశమంతా ఎదురుచూస్తున్న మహిళా రిజర్వేషన్‌ను 2029 లోక్‌సభ ఎన్నికల నుంచి అమల్లోకి తెచ్చే ప్రణాళికను కేంద్రం సిద్ధం చేస్తోంది. 2023లోనే చేపట్టిన 128వ రాజ్యాంగ సవరణ ప్రకారం.. వనితలకు లోక్‌సభ, అసెంబ్లీల్లో 33 శాతం సీట్లను ఖరారు చేయనుందని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో ఓ కథనం ప్రచురితమైంది. 2027లో చేపట్టనున్న జనగణన ఆధారంగా దేశవ్యాప్తంగా లోక్‌సభ, శాసనసభల నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని అందులో పేర్కొన్నారు. ఆ ప్రక్రియలో భాగంగానే 'నారీశక్తి వందన్ అధినియమ్' పేరిట మహిళలకు 33% కోటా కల్పిస్తారని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ చట్టం అమల్లోకి వచ్చాక జరిగే తొలి జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని చట్టంలో పేర్కొన్నారు. జనగణన తర్వాత పునర్విభజన ప్రక్రియ చేపట్టాలంటే పార్లమెంటు జనగణన చట్టాన్ని ఆమోదించాలి.

9 నెలల్లోనే జనాభా లెక్కలు రెడీ!

న్యూఢిల్లీ, జూన్ 12: జనాభా లెక్కల ప్రక్రియ 2027 మార్చి 1న మొదలవుతుందని కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. అధునాతన టెక్నాలజీ సాయంతో డిసెంబరుకల్లా కొత్త లెక్కలు అందుబాటులోకి వచ్చేస్తాయని కేంద్రం ధీమా వ్యక్తం చేస్తోంది. గత ప్రక్రియల కంటే నవీన రీతిలో జరగబోతోందని.. డేటా సేకరణకు మొబైల్ యాప్స్, రియల్‌టైం ప్రాసెసింగ్‌కు నిఘా వ్యవస్థలను వినియోగించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. జనాభా లెక్కలు మొదలైన తేదీ నుంచి జాతీయ, రాష్ట్ర, జిల్లా, తాలూకా/మండల స్థాయుల్లో లింగాలవారీ జనగణన వివరాల ప్రచురణకు 9 నెలల సమయం తీసుకునే అవకాశముందని తెలిపాయి. 2011లో చేపట్టిన జనగణనలో సదరు వివరాలు ప్రచురించేందుకు రెండేళ్లకు పైనే పట్టిందని పేర్కొన్నాయి.

రేపు అమెరికా ఆర్మీ డే..
అతిథిగా పాక్ ఫీల్డ్ మార్షల్ మునీర్

న్యూఢిల్లీ, జూన్ 12: వాషింగ్టన్‌లో శనివారం జరగనున్న 250వ అమెరికా ఆర్మీ డే ఉత్సవాలకు పాకిస్థాన్ సైన్యాధిపతి ఫీల్డ్ మార్షల్ అసీం మునీర్‌కు ఆహ్వానం అందడం భారత రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అదేరోజు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జన్మదినం కూడా. పహల్గాం ఉగ్రవాద దాడి వెనుక మునీర్ పాత్ర ఉందన్న ఆరోపణలు రావడం, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాక్‌కు వ్యతిరేకంగా ఆపరేషన్ సిందూర్‌ను ఎందుకు నిర్వహించాల్సి వచ్చిందో భారత బృందాలు ప్రపంచవ్యాప్తంగా వివరించి తిరిగి వచ్చిన నేపథ్యంలో అమెరికా చర్య ప్రాధాన్యం సంతరించుకొంది. ఆర్మీ డేను చాలా ఘనంగా నిర్వహించేందుకు అమెరికా ఏర్పాట్లు చేస్తోంది. పరేడ్‌కు హాజరయ్యే మునీర్ ఈ సందర్భంగా అమెరికా రక్షణ శాఖ కార్యాలయం పెంటగాన్‌లో ఉన్నతాధికారులతో, అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కాం) అధికారులతో భేటీ కానున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాక్ ఆర్మీ చీఫ్‌కు అతిథిగా రావాలంటూ ఆహ్వానం అందడం భారత్‌కు దౌత్యపరంగా దెబ్బ అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేష్ అన్నారు. ఇప్పటికైనా ప్రధాని మోదీ మొండిపట్టుదల వీడి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరపాలన్నారు.

'రుద్రాస్త్ర' పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ, జూన్ 12: ఎక్కువసేపు గగనతలంలో ఎగురుతూ లక్ష్యాలపై కచ్చితత్వంతో దాడిచేసే సత్తా ఉన్న 'రుద్రాస్త్ర' త్వరలోనే భారత సైన్యానికి అందుబాటులోకిరానుంది. సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (ఎస్‌డీఏఎల్) రూపొందించిన మానవరహిత వైమానిక వాహనం (యూఏవీ) రుద్రాస్త్రను పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో విజయవంతంగా పరీక్షించారు. ఇది హైబ్రీడ్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ శ్రేణిలోకి వస్తుంది. పరీక్ష సందర్భంగా ఇది 50 కిలోమీటర్ల పరిధిలో అద్భుతంగా పనిచేసింది. రియల్‌టైమ్‌లో వీడియో అందించడంతోపాటు లాంచింగ్ పాయింట్‌కు సురక్షితంగా తిరిగొచ్చింది. లక్ష్యం ఉన్న ప్రాంతంలో సంచరించడాన్ని కూడా కలుపుకొంటే దీని రేంజ్ 170 కిలోమీటర్లు. ఇది గాలిలో 1.5గంటలపాటు నిరంతరాయంగా ప్రయాణించింది. ఈ పరీక్ష సందర్భంగా ప్రెసిషన్ గైడెడ్ యాంటీ పర్సనల్ వార్‌హెడ్‌ను మోహరించగా.. భూమికి అత్యంత తక్కువ ఎత్తులోకివచ్చాక రుద్రాస్త్ర దాన్ని పేల్చివేసింది.

త్వరలో అందుబాటులోకి శత్రునాశ్, అగ్ని అస్త్ర..!

న్యూఢిల్లీ, జూన్ 12: భారత సాయుధ దళాల కోసం దేశీయంగా అభివృద్ధి చేసిన 'శత్రునాశ్', 'అగ్నిఅస్త్ర' అనే రెండు అస్త్రాలు త్వరలోనే సైన్యానికి అందుబాటులోకి రానున్నాయి. అగ్నిఅస్త్ర.. బహుళ లక్ష్యాలను ఛేదించేందుకు ఉపయోగపడుతుంది. దీని సాయంతో శత్రువు బంకర్లు, వంతెనలు, బలమైన నిర్మాణాలను కూల్చివేయవచ్చు. అలాగే సుదూర ప్రాంతాలకు వెళ్లి సైనిక లక్ష్యాలపై ఇది స్వతంత్రంగా కాల్పులు జరపగలదు. మానవ సహిత వైమానిక విమానాలు, మానవ రహిత వైమానిక వాహనాల ద్వారా వీటిని మోహరించవచ్చు. ఇక శత్రునాశ్ అనేది ఒక విద్యుదయస్కాంత పల్స్ (ఈఎంపీ) గన్. దీనిలోని సెన్సర్లు ఈఐడీలు, డ్రోన్లు, వాహనాలు, ఏదైనా ఎలక్ట్రానిక్ ఆధారిత లక్ష్యాలను అడ్డుకుంటాయి. ఈ రెండు అస్త్రాలు భారత సైన్యంలో చేరేందుకు సిద్ధంగా ఉన్నాయి.

ప్రపంచ లింగ వ్యత్యాస సూచీలో
భారత్‌కు 131వ స్థానం

న్యూఢిల్లీ, జూన్ 12: లింగ సమానత్వం సాధించడంలో మనదేశం ఏటేటా వెనకబడుతూనే ఉంది. మహిళలు, పురుషుల మధ్య అవకాశాల్లో అంతరాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆర్థిక భాగస్వామ్యం నుంచి రాజకీయ సాధికారత వరకు ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ విషయం ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) గురువారం విడుదల చేసిన ప్రపంచ లింగ వ్యత్యాస నివేదిక-2025లో స్పష్టమైంది. 148 దేశాలకు సంబంధించి ప్రకటించిన లింగ వ్యత్యాస సూచీ ర్యాంకుల్లో భారత్ 131వ స్థానంలో నిలిచింది. గతేడాది 129వ స్థానంలో ఉంది. రాజకీయ సాధికారత, ఆర్థిక భాగస్వామ్యం విషయంలో గణనీయమైన మార్పులతో బంగ్లాదేశ్ తన ర్యాంకును 75 స్థానాలు మెరుగుపరుచుకుని 25వ ర్యాంకుని దక్కించుకుంది. మాల్దీవులకు 138వ ర్యాంకు దక్కగా, సూచీలో అట్టడుగున 148వ స్థానంలో పాకిస్థాన్ నిలిచింది. ఇక వరుసగా 16వ ఏడాది కూడా ఐస్‌ల్యాండ్ అగ్రస్థానంలో కొనసాగుతోంది.

ఐఐటీ, ఐఐఎంలు సహా
89 సంస్థలకు యూజీసీ షోకాజ్ నోటీసులు

న్యూఢిల్లీ, జూన్ 12: యాంటీ ర్యాగింగ్ నిబంధనలు-2009 పాటించని ఒక ఐఐటీ, రెండు ఐఐఎంలు, పలు సెంట్రల్, స్టేట్ యూనివర్సిటీలు సహా 89 సంస్థలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసుల్లో తాము చేసిన ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే నిధులు నిలిపివేస్తామని కూడా యూజీసీ హెచ్చరించింది. నిబంధనలు పాటించని సంస్థల జాబితాలో వాటిని చేర్చి యూజీసీ వెబ్‌సైట్‌లో ఆ జాబితాను ఉంచుతామని, వాటి గుర్తింపు, అనుబంధం రద్దు చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తామని స్పష్టంచేసింది. 30 రోజుల్లోగా విద్యార్థులందరి నుంచి ఆన్‌లైన్‌లో సమ్మతి పత్రాలు స్వీకరించాలని, ర్యాగింగ్ నివారణకు తీసుకున్న చర్యలను తెలియజేస్తూ సమగ్ర నివేదికను తమకు సమర్పించాలని ఆయా సంస్థలను ఆదేశించింది. నోటీసులు అందుకున్న సంస్థల్లో ఏపీకి చెందిన ది నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్, ఐఐటీ-పలక్కడ్, ఐఐఎం-బెంగళూరు, ఐఐఎం-రోహ్‌తక్, నలందా యూనివర్సిటీ(రాజ్‌గిర్), ఇగ్నో(ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ), ఏఎంయూ(అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ) తదితరాలు ఉన్నాయి.

పంజాబీ ఇన్‌ఫ్లుయెన్సర్ కమల్ కౌర్ హత్య?

లూధియానా, జూన్ 12: పంజాబ్‌కు చెందిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ కాంచన్ కుమారి అలియాస్ కమల్ కౌర్ అనుమానాస్పద స్థితిలో మరణించారు. పోలీసులు ఆమె మృతదేహాన్ని బఠిండాలోని ఆదేశ్ యూనివర్సిటీ పార్కింగ్ ప్రాంతంలోని ఒక కారులో బుధవారం సాయంత్రం గుర్తించారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం కమల్ కౌర్ హత్యకు గురైనట్లు అనుమానిస్తున్నట్లు పోలీసులు గురువారం వెల్లడించారు. పార్కింగ్ చేసిన కారులో నుంచి దుర్వాసన వస్తుందన్న స్థానికుల సమాచారంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రోడ్డు నిర్మించకుండానే బిల్లుల మంజూరు!

ఈఈని సస్పెండ్ చేసిన జీహెచ్‌ఎంసీ కమిషనర్.. విధుల నుంచి ఔట్ సోర్సింగ్ ఏఈ తొలగింపు

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు నిర్మించకున్నా కాంట్రాక్టు సంస్థకు బిల్లులు చెల్లించిన చార్మినార్ జోన్ పరిధిలోని సంతోష్‌నగర్ (ఇంజనీరింగ్ డివిజన్-7) ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పూర్తి అదనపు బాధ్యతల్లో కొనసాగుతోన్న ఏకాంబరంపై సస్పెన్షన్ వేటు పడింది. ఐఎస్ సదన్ డివిజన్‌లో రోడ్డు నిర్మించకుండా బిల్లులు చెల్లించారన్న ఫిర్యాదుపై విజిలెన్స్ విచారణ జరిపించిన కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ గురువారం ఈఈపై చర్యలు తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈఈ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో అసిస్టెంట్ ఇంజనీర్ (ఎస్ఎంఆర్)గా పని చేస్తున్న ఎస్ఎంఆర్ అన్సారీని విధుల నుంచి తొలగించాలని పాలనా విభాగం అదనపు కమిషనర్‌ను ఆదేశించారు. ఐఎస్ సదన్‌లోని సింగరేణి కాలనీ వాంబే ఇళ్ల వద్ద సీసీ రోడ్డు నిర్మించకుండా రూ.9లక్షలు చెల్లించారని డివిజన్ కార్పొరేటర్ శ్వేత గత నెల 21న కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కర్ణన్ విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. విజిలెన్స్ అధికారుల విచారణలో ఈఈ నిర్లక్ష్యంగా వ్యవహరించారని, సీసీ రోడ్డు నిర్మించకున్నా పనులు చేసినట్టు బోగస్ బిల్లులు పెట్టినా ఆమోదించారని తేలింది. కమిషనర్‌కు కార్పొరేటర్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిన కాంట్రాక్టు ఏజెన్సీ, స్థానిక ఇంజనీరింగ్ అధికారులు అదే రోజు రాత్రి ఆ ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రయత్నించగా, స్థానికులు అడ్డుకున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే ఈఈ ఏకాంబరంను సస్పెండ్ చేసిన కమిషనర్.. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా నగరం విడిచి వెళ్లవద్దని ఆదేశాల్లో స్పష్టంచేశారు. రోడ్డు నిర్మించకుండానే.. బిల్లులు సమర్పించిన కాంట్రాక్టు సంస్థను ఇప్పటికే బ్లాక్ లిస్టులో పెట్టారు.

లోకం తీరు



గోదావరి-కావేరీ అనుసంధానం సాధ్యమేనా?

- 24న హైదరాబాద్‌లో నదుల అనుసంధాన సంప్రదింపుల కమిటీ భేటీ

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గోదావరి - కావేరి అనుసంధాన (జీసీ లింక్) ప్రాజెక్టుపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు లేవనెత్తిన అభ్యంతరాలపై ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 11:30 గంటలకు హైదరాబాద్‌లో జాతీయ నీటిఅభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) సంప్రదింపుల కమిటీ జరగనున్నది. ఈ కమిటీకి కేంద్ర జల వనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఛైర్మన్ అధ్యక్షత వహిస్తారు. కేంద్రం ఇప్పటి వరకూ పోలవరం నుంచి గోదావరి-కావేరీ అనుసంధాన ప్రాజెక్టును ఒప్పుకోమని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. కాగా, గురువారం న్యూఢిల్లీలో జరిగిన నదుల అనుసంధాన టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో గోదావరి-కావేరీ నదుల అనుసంధాన ప్రక్రియ ఎంతవరకొచ్చిందని ఆరా తీసినట్లు సమాచారం. ఇప్పటి వరకూ పోలవరం ప్రాజెక్టు నుంచే గోదావరి-కావేరీ అనుసంధానం చేపట్టాలని పట్టుబట్టిన ఏపీ.. తాజాగా రూట్ మార్చి గోదావరి-బనకచర్ల అనుసంధానంలో భాగంగా పల్నాడు జిల్లా బొల్లాపల్లిలో నిర్మించే 173 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నుంచే 'బొల్లాపల్లి-కావేరీ అనుసంధానం' చేపట్టాలని కేంద్రాన్ని కోరింది. పోలవరం విస్తరణలో భాగంగా రూ.80,112 కోట్ల అంచనా వ్యయంతో ఏపీ సర్కారు కొత్తగా గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును తెర మీదకు తెచ్చింది. అంతటితో ఆగక ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 లోని 46(2), 46(3) సెక్షన్ల కింద వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పేరిట గోదావరి-బనకచర్ల అనుసంధానానికి నిధులు కేటాయించాలని కేంద్రాన్ని ఏపీ సర్కారు కోరుతున్నది. బొల్లాపల్లి-కావేరీ అనుసంధానానికి ఒప్పుకుంటే మాత్రం.. గోదావరి- బనకచర్ల ప్రాజెక్టుకయ్యే ఖర్చులో 90 శాతం కేంద్రమే భరించాల్సి ఉంటుంది.

ఏకకాలంలో ఆర్ఆర్ఆర్

ఉత్తర, దక్షిణ భాగాల నిర్మాణం?

దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం.. రీజినల్ రింగు రోడ్డుపై సీఎం సమీక్ష

- దక్షిణభాగం అలైన్‌మెంట్‌పై కీలక సూచనలు
- త్వరలో కేంద్రానికి నివేదిక
- కేంద్రం ఆలస్యం చేస్తే హెచ్ఎండీఏతో నిర్మాణంపై ఫోకస్..!




హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర, దక్షిణ మార్గాలు ఒకేసారి నిర్మించే అవకాశాలపై రాష్ట్ర సర్కారు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గురువారం ఆర్ఆర్ఆర్ ఉత్తర/ దక్షిణ మార్గాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. దక్షిణ భాగంలో అలైన్‌మెంట్ ప్రాథమికంగా ఖరారైందని ఆయనకు అధికారులు తెలిపారు. దీనిపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సిద్ధం చేసి కేంద్రానికి నివేదించాలని అధికారులను సీఎం ఆదేశించినట్లు సమాచారం. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంతోపాటు దక్షిణ భాగం నిర్మించాలని కోరుతూ పలుమార్లు ప్రధాని మోదీ, కేంద్ర రవాణశాఖ మంత్రి నితిన్ గడ్కరీలకు సీఎం రేవంత్‌రెడ్డి వినతి పత్రాలు సమర్పించారు. ఒకవేళ ఉత్తర భాగంతోపాటు దక్షిణ భాగం ఆర్ఆర్ఆర్ నిర్మాణంపై కేంద్రం ఆలస్యం చేస్తే రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాల్సిన అంశాలపై కీలకంగా సీఎం సమీక్షించారు. దక్షిణ భాగ నిర్మాణానికి ఎప్పుడు ఆమోదం తెలుపుతారన్న విషయమై కేంద్రం నుంచి స్పష్టత తీసుకోనున్నారు. ఈ విషయంలో జాప్యం చేస్తే.. హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ), హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) పరిధిలో నిర్మాణానికి గల అవకాశాలను పరిశీలించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అలా నిర్మాణం చేపడితే తీసుకోవాల్సిన చర్యలు, ఆర్థికాంశాలపై అధికారులకు సీఎం రేవంత్ పలు కీలక సూచనలు చేసినట్లు వినికిడి. వాస్తవంగా ఉత్తర భాగం కంటే దక్షిణ భాగం ఆర్ఆర్ఆర్ నిర్మాణంతో వేగంగా అభివృద్ధి జరుగుతుందనే చర్చ తొలి నుంచీ ఉంది. కానీ గత రాష్ట్ర ప్రభుత్వ హయాంలో ఆర్ఆర్ఆర్ మంజూరైంది. దీంతో కేంద్రంతో చర్చించిన గత ప్రభుత్వం తొలుత ఉత్తరభాగం నిర్మాణానికి ఆమోదం లభించేలా చర్యలు తీసుకోవడంతో దక్షిణ భాగం మార్గానికి ఆమోదం ఆలస్యమవుతూ వచ్చింది. రాష్ట్రంలో 2023లో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్ఆర్ఆర్‌పై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు ఉత్తర భాగంలో ఆటంకాలన్నీ పరిష్కరించింది. కేంద్ర క్యాబినెట్ ఆమోదం లభించగానే ఉత్తరభాగం నిర్మాణం నిర్మాణానికి మార్గం సుగమమవుతుంది. రెండు భాగాలు ఒకేసారి నిర్మిస్తే నిర్మాణ వ్యయంతోపాటు దక్షిణ భాగ భూముల సేకరణకు పరిహారం ధరలు తక్కువగా ఉండే అవకాశం ఉందని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వివరించినా కేంద్రం సమాధానమూ చెప్పలేదు.. నిర్ణయమూ తీసుకోలేదు. కేంద్ర నిర్ణయానికనుగుణంగా ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం నిర్మాణానికి పూర్తిస్థాయిలో నిర్ణయానికి రావాలని సమీక్షలో ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. అయినా, దక్షిణ భాగం విషయమై మరోమారు కేంద్ర మంత్రులను కలిసి వివరించాలనుకుంటున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఆర్ఆర్ఆర్ వరకూ నిర్మించే రేడియల్ రోడ్లు, హైబ్రీడ్ యాన్యుటీ మోడల్‌లో అభివృద్ధి చేసే రోడ్లపైనా సమీక్షించారు.

హైకోర్టులో సీఎం రేవంత్‌రెడ్డికి ఊరట

'కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ఎత్తేస్తారు' అని వ్యాఖ్యానించడంతోపాటు కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా మార్ఫింగ్ వీడియో వైరల్ చేసిన అంశంలో నిందితుడిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. నాంపల్లి మేజిస్ట్రేటు కోర్టులో ఉన్న ఈ కేసుపై ఈ నెల 23 వరకు ఎలాంటి విచారణ జరగకుండా స్టే విధించింది. బీజేపీ, అమిత్ షాపై తప్పుడు ప్రచారం చేసిన రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు దిగువ కోర్టులో ప్రయివేటు కంప్లైంట్ దాఖలు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ రేవంత్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈనెల 23 వరకు దిగువ కోర్టులో విచారణలో ఉన్న అన్ని రకాల ప్రొసీడింగ్స్‌పై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది.

మెట్రో కారిడార్-6 పనులపై హైకోర్టు స్టే

- వారసత్వ కట్టడాలపై సమీక్ష చేయకుండా చేపట్టకూడదని ఆదేశం



హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వారసత్వ కట్టడాలపై ప్రభావం ఎంత ఉంటుందో సమీక్షించే హెరిటేజ్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ జరపకుండా మెట్రో రెండో దశ కారిడార్- 6 పనులు చేపట్టకూడదంటూ హైకోర్టు స్టే ఉత్తర్వులు జారీచేసింది. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు చేపడుతున్న ఈ మార్గంలో చార్మినార్, ఫలక్‌నుమా వంటి వారసత్వ కట్టడాలపై పడే ప్రభావాన్ని అంచనా వేయకుండా పనులు జరపకూడదని తెలిపింది. దీనిపై కౌంటర్ దాఖలు చేసేందుకు మూడు వారాల సమయం ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం కోరడంతో అప్పటివరకు స్టే ఉత్తర్వులు కొనసాగుతాయని పేర్కొంది. యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్(ఏపీడబ్ల్యూఎఫ్) సంస్థ అధ్యక్షుడు మహమ్మద్ రహీమ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ హెరిటేజ్ యాక్ట్, ఇతర హెరిటేజ్ చట్టాల ప్ర కారం స్వతంత్ర నిపుణుల కమిటీతో వారసత్వ కట్టడాలపై పడే ప్రభావాన్ని మదింపు వేయాల్సి ఉం టుందని, కానీ దాన్ని అమలు చేయలేదని తెలిపారు. దీనిపై గురువారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. ఈ ఏడా ది జనవరి 31న పిటిషన్ దాఖలు కాగా తొమ్మిది వాయిదాలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదని గుర్తించింది. మరోసారి మూడు వారాల సమయం ఇచ్చి విచారణను వాయిదా వేసింది.

సంస్కృతం, వేదశాస్త్రాల పరిశోధనలకు సీఎస్‌యూతో ఐఐటీహెచ్ ఒప్పందం

కంది, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సంస్కృతం, భాషాశాస్త్రం, కంప్యూటేషనల్ సంస్కృతం, వేద శాస్త్రాలు, తత్వశాస్త్రం తదితర అనుబంధ విభాగాల్లో విద్యా సహకారం కోసం సెంట్రల్ సంస్కృత విశ్వవిద్యాలయం(సీఎస్‌యూ)తో సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, సీఎస్‌యూ వైస్‌చాన్స్‌లర్ శ్రీనివాస వరాఖేడిలు గురువారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం బీఎస్ మూర్తి మాట్లాడుతూ.. ఈ ఒప్పందంతో ఐఐటీహెచ్‌లోని హెరిటేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం, సీఎస్‌యూ కలిసి సంప్రదాయ పురాతన జ్ఞానాన్ని ఆధునిక శాస్త్రంతోపాటు సాంకేతిక పరిశోధన, విద్యలో కొత్త కోణాలను ఆవిష్కరించే అవకాశం ఉందన్నారు. సంస్కృత భాషలో లోతైన జ్ఞానాన్ని పొందినట్లయితే సంప్రదాయ పురాతన జ్ఞానాన్ని పూర్తిగా తెలుసుకోవచ్చని ఆకాంక్షించారు.

కేటీఆర్ అవినీతి బయటపెడ్తాం

సీఎం రేవంత్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పకుంటే తీవ్ర పరిణామాలు: బల్మూరి

- కేటీఆర్‌ది అవినీతి డబ్బు బలుపు: నాయిని
- అలా మాట్లాడితే నాలుక కోస్తా: రమేశ్‌రెడ్డి
- చెంప దెబ్బలు ఖాయం: చనగాని

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ అవినీతి, అక్రమాలను బయటకు తీస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. త్వరలో అంబులెన్స్‌ల స్కాం వెలుగులోకి రాబోతోందని చెప్పారు. గురువారం సీఎల్పీ కార్యాలయంలో బల్మూరి మీడియాతో మాట్లాడారు. సీఎం కుర్చీని గౌరవించాలంటూ గతంలో సత్యహరిశ్చంద్రుడిలా మాట్లాడిన కేటీఆర్ నేడు ఆ సంస్కారాన్ని వదిలివేశారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పకపోతే జరిగే పరిణామాలకు తమది బాధ్యత కాదని హెచ్చరించారు. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్‌తో పాటు ఎక్స్‌లో అడ్డగోలుగా పోస్టు పెట్టిన కౌశిక్‌రెడ్డిపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వివరించారు. అక్రమంగా సంపాదించిన అవినీతి డబ్బు బలుపుతో కేటీఆర్ మాట్లాడుతున్నాడని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్‌ను తిట్టాలంటే సంస్కారం అడ్డు వస్తోందన్నారు. ఏ శాఖను వదిలిపెట్టకుండా కల్వకుంట్ల కుటుంబం అడ్డదిడ్డంగా దోచుకుందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిమయమని ఆరోపణలు చేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సిగ్గులేకుండా కేసీఆర్ వెంట తిరుగుతున్నారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబాన్ని చూసి అమరవీరుల ఆత్మలు ఘోషిస్తున్నాయన్నారు. ఏనాటికైనా కల్వకుంట్ల కుటుంబం ఊచలు లెక్క పెట్టాల్సిందేనని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌పై అవాకులు చెవాకులు పేలితే నాలుకలు కోస్తామని టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి హెచ్చరించారు. అధికారం పోయిందనే అక్కసుతో కేటీఆర్ వీధి రౌడీల కన్నా హీనంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గాంధీభవన్‌లో రహదారుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డితో కలిసి రమేశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ పద్ధతి మార్చుకోని పక్షంలో ప్రజలే తిరగబడతారన్నారు. మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుస్తామని బీఆర్ఎస్ దింపుడు కల్లం ఆశలు పెట్టుకుందని.. ఆ ఎన్నికల్లోనూ ప్రజలు గులాబీ పార్టీకి తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే కేటీఆర్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మత్స్య సహకార సంఘాల సమాఖ్య ఛైర్మన్ మెట్టు సాయికుమార్ హెచ్చరించారు. కేటీఆర్ రేవంత్ కాలి గోటికి కూడా సరితూగరని.. చిల్లర గాళ్లను వెంటేసుకుని చిల్లర మాటలు మాట్లాడితే గొప్పోళ్లు కారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలు రోజు రోజుకు హద్దు మీరుతున్నాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ అన్నారు. సీఎంపై చిల్లర వ్యాఖ్యలు చేస్తే చెంప దెబ్బలు ఖాయమన్నారు. కేటీఆర్ వ్యవహారం చూస్తే ఉద్దేశపూర్వకంగా అరెస్ట్ కావాలనే చేస్తున్నట్లుగా కనిపిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. కేటీఆర్ తీరు మారకపోతే కాంగ్రెస్ కార్యకర్తల నుంచి చెంపదెబ్బలు తప్పవని హెచ్చరించారు.

మా నేతలకూ మంత్రివర్గంలో స్థానం కల్పించండి

- నామినేటెడ్, పార్టీ పదవుల్లో అవకాశమివ్వండి
- మహేశ్ గౌడ్‌ను కోరిన వివిధ కుల సంఘాలు



టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తమ వర్గం నేతలకు క్యాబినెట్‌లో స్థానం కల్పించడంతో పాటు నామినేటెడ్, పార్టీ కీలక పదవుల్లో అవకాశం కల్పించాలంటూ వివిధ కుల సంఘాల నేతలు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గురువారం గాంధీభవన్‌లో మహేశ్ గౌడ్‌తో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నేతృత్వంలో కురుమ, గొల్ల కులాల ప్రతినిధులు భేటీ అయ్యారు. ప్రభుత్వంలో తమ వర్గానికి ప్రాతినిధ్యం లభించలేదంటూ గొల్ల, కురుమ ప్రతినిధులు ఈ సందర్భంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో గొల్ల, కురుమలు లేకుండా క్యాబినెట్ ఏర్పడలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో గొల్లలు 22 లక్షలు, కురుమలు 6 లక్షలకు పైగా ఉన్నారన్నారు. కురుమ, గొల్లలకు ఓ మంత్రి పదవి, ప్రభుత్వ సలహాదారు, ఒక ఎమ్మెల్సీతో పాటు కార్పొరేషన్ ఛైర్మన్లు, కమిషన్ సభ్యుల పదవులతో పాటు పార్టీ ముఖ్య పదవులను ఇవ్వాలని బీర్ల కోరారు. గొల్ల, కురుమల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని.. పార్టీ పదవుల్లో ప్రాధాన్యత కల్పిస్తామని మహేశ్ గౌడ్ హామీనిచ్చారు. తమ సామాజిక వర్గం నేత, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు మహేశ్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. 33 జిల్లాలకు చెందిన మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు మహేశ్ గౌడ్‌తో భేటీ అయ్యారు. పీసీసీ కార్యవర్గంలోనూ తమ వర్గం నేతలను అధిక సంఖ్యలో నియమించాలని కోరారు.

బీసీలకు మరింత ప్రాధాన్యత కల్పించాలి..

పార్టీ పదవులతో పాటు ప్రభుత్వ సంస్థల్లో.. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు మరింత ప్రాధాన్యత కల్పించాలని బీసీ సంఘాల ప్రతినిధులు మహేశ్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో వారు మహేశ్ గౌడ్‌తో భేటీ అయ్యారు. ఇటీవల ఎమ్మెల్సీ పదవులు, మంత్రివర్గ విస్తరణలోనూ బీసీ, ఎస్సీలకు ప్రాధాన్యత పెంచడానికి మహేశ్ గౌడ్ చేసిన కృషిని ప్రశంసిస్తూ సన్మానించారు. అలాగే పార్టీ కమిటీల్లో 70 శాతం పదవులు బడుగులకు ఇచ్చారని బీసీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. అయితే సమాచార కమిషనర్ల నియామకంలో బీసీలకు అన్యాయం జరిగిందని.. దాన్ని సరి చేయాలని కోరారు. భేటీలో బీసీ కుల సంఘాల జేఏసీ ఛైర్మన్ కుందారం గణేశ్ చారి, కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల కొండపై ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

- తొలి దశలో అందుబాటులోకి 150 బస్సులు
- టీటీడీ ఈవో శ్యామలరావు



తిరుమల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ప్రయాణించేందుకు అన్ని ఆర్టీసీ బస్సుల్లో ఉచితం చేయనున్నట్టు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం తిరుమలలో ప్రైవేట్ వాహనదారులు అధిక మొత్తంలో భక్తుల నుంచి ఛార్జీలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. తిరుపతి-తిరుమల మధ్య తిరిగే బస్సులు బస్టాండుకే పరిమితం కాకుండా తిరుమలలోని ముఖ్య ప్రాంతాలకూ నడపాలని ఆర్టీసీ అధికారులను కోరామన్నారు. ఈ సర్వీసును ఉచితంగా ఇచ్చేందుకు ఆర్టీసీ అధికారులు అంగీకరించారని తెలిపారు. ఇప్పటికే టీటీడీ కొన్ని ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తోందని, ఈ ఆర్టీసీ బస్సులు కూడా అందుబాటులోకి వస్తే ట్యాక్సీల మీద ఆధారపడే అవకాశం ఉండదని ఈవో అభిప్రాయపడ్డారు. దాదాపు 150 బస్సులు తొలిదశలో అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కాగా, కాగా దేశవ్యాప్తంగా టీటీడీకి చెందిన 61 ఆలయాలు, ఆస్తులు ఉన్నాయని, వాటి నిర్వహణ కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి అధికారులను నియమిస్తామన్నారు.

త్వరలో కాళేశ్వరంపై సర్కారుకు నివేదిక

- తుది దశకు బ్యారేజీల విచారణ
- నేడు కోల్‌కతాకు పీసీ ఘోష్

హైదరాబాద్, వెంకటాపూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. గతేడాది మార్చిలో ప్రభుత్వం కమిషన్ వేయగా... దాదాపు 115 మంది సాక్షులను కమిషన్ విచారించింది. బ్యారేజీల నిర్మాణంలో కీలకమైన మాజీ సీఎం కేసీఆర్‌ను విచారించడంతో సాక్షుల విచారణ ప్రక్రియ ముగిసినట్లయింది. నివేదిక ముసాయిదాను సిద్ధం చేసుకున్నాకే... కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లను విచారించారు. దీంతో నివేదికకు తుది రూపు ఇవ్వనున్నారు. ఈనెల 4న విచారణ నిమిత్తం హైదరాబాద్ వచ్చిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ శుక్రవారం కోల్‌కతాకు తిరిగి వెళ్లనున్నారు. త్వరలోనే ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నారు. కాగా, కమిషన్ గడువు జూలై 31వ తేదీతో ముగియనుంది.

రామప్ప ఆలయ సందర్శన, పూజలు

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప దేవాలయాన్ని జస్టిస్ పినాకి చంద్రఘోష్ గురువారం సందర్శించారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు.



పోచంపల్లిలో మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడితో మాట్లాడుతున్న గవర్నర్

చేనేత వారసత్వంగా ఇక్కత్ కళ

- పోచంపల్లి కళాకారులను అభినందించిన గవర్నర్

యాదాద్రి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఇక్కత్ చేనేత వారసత్వంగా వస్తున్న ఒక కళ అని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో పర్యటించిన ఆయన టూరిజం టెక్స్‌టైల్ పార్కులో ఇక్కత్ ఉత్పత్తులను పరిశీలించారు. చేనేత కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కత్ ఉత్పత్తులు కళ మాత్రమే కాదని, చేనేత కళాకారుల ప్రతిభకు చిహ్నమని తెలిపారు. పోచంపల్లి ఉత్పత్తులకు మరింత ప్రాచుర్యంతో పాటు మార్కెటింగ్ తీసుకువచ్చేందుకు అహ్మదాబాద్‌లోని ఎన్ఐటీ, ఐఐటీ సహకారంతో స్థానిక నేత కార్మికులు కలిసి అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కత్ నకిలీలను గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ నేత కార్మికులకు నేతన్న రుణాల కింద రూ.5లక్షల చెక్కులను అందజేశారు. నేతన్న పొదుపు పథకం కింద జిల్లాకు రూ.2.15కోట్ల చెక్కును నేత కార్మికులకు అందజేశారు.

గుట్ట ప్రధాన కూడళ్లలో దేవుళ్ల విగ్రహాలు

- ఫిర్యాదులకు అందుబాటులో పెట్టె: ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట ప్రధాన కూడళ్లలో దేవుళ్ల విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో వెంకట్రావు తెలిపారు. యాదగిరికొండపై ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈవో మాట్లాడారు. నిత్యం స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ప్రసాద వితరణ చేస్తామని తెలిపారు. భక్తుల కోసం ఘాట్ రోడ్డు వెంట రెండువైపులా సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. భక్తుల సలహాలు, సూచనల కోసం ఫిర్యాదు పెట్టెలను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ప్రధానార్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

43రోజుల్లో రూ.4.47కోట్ల హుండీ ఆదాయం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఖజానాకు ఏప్రిల్ 30నుంచి ఈ నెల 11 వరకు 43రోజుల్లో రూ.4.47కోట్ల హుండీ ఆదాయం సమకూరింది. హుండీల్లో కానుకలను గురువారం లెక్కించారు. 115 గ్రాముల మిశ్రమ బంగారం, 6.50కిలోల మిశ్రమ వెండి కూడా సమకూరింది.

ఆదర్శంగా నిలుస్తోన్న ప్రభుత్వోపాధ్యాయుడు

- వారి పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు



ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన తన ఇద్దరు పిల్లలతో ఉపాధ్యాయుడు రమేశ్

మోమిన్‌పేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలోని మోమిన్‌పేట్ మండలం ఎంకతల లోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు రమేశ్ ఆయన విద్యాబోధన చేస్తున్న పాఠశాలలోనే వారి ఇద్దరు పిల్లలను చేర్పించి తోటి ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. గురువారం ఎంకతల ప్రభుత్వ పాఠశాలలో కూతురు అశ్వితను ఐదో తరగతిలో, కుమారుడు సాయి నిహాంత్‌ను రెండో తరగతిలో చేర్పించారు. అంతకు ముందు కూడా ఆయన పనిచేసిన చంద్రయాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలోనే వారి పిల్లలను చదివించారు. ఈ సందర్భంగా ఎంఈవో మల్లేశం.. రమేశ్‌ను అభినందించారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు చెల్లిస్తూ ఆర్థికంగా నష్టపోతున్న తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని రమేశ్ కోరారు.

లగచర్ల రైతులకు రూ.1.15 కోట్ల పరిహారం

తాండూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో చేపడుతున్న మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు భూమి ఇచ్చిన 44 మంది లగచర్ల రైతులకు రూ.1.15 కోట్ల పరిహారం చెక్కులను గురువారం తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అందజేశారు. తాండూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈ చెక్కులను రైతులకు అందించారు. త్వరలో పార్కు భూసేకరణను పూర్తి చేస్తామని సబ్‌కలెక్టర్ తెలిపారు.

కీలక ఖనిజాల ఉత్పత్తిలో సింగరేణి

- సీఎస్ఐఆర్-ఐఎంఎంటీతో ఒప్పందం: సీఎండీ బలరాం

కొత్తగూడెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ కీలక ఖనిజాల ఉత్పత్తి రంగంలోకి అడుగు పెట్టింది. గురువారం ఒడిసా రాజధాని భువనేశ్వర్‌లో ప్రముఖ పరిశోధన సంస్థ సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) అనుబంధ సంస్థ అయిన ఐఎంఎంటీ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ)తో ఉమ్మడి ప్రయోజన అవగాన ఒప్పందం కుదుర్చుకుంది.ఈ ఒప్పందం వివరాలను సీఎండీ బలరాం వివరించారు. సింగరేణి గనుల్లో, సింగరేణి ప్రాంతాల్లో కీలక ఖనిజాల ఉనికి, అన్వేషణ, ఉత్పత్తిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సహకారం కోసం ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వీడియో కాల్ సాయంతో ఆపరేషన్?

జగిత్యాల ప్రైవేటు ఆస్పత్రిలో మహిళ మృతి


డాక్టర్ నిర్లక్ష్యం వల్లేనని బంధువుల ఆందోళన

జగిత్యాల అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కడుపులో కణితులు తొలగించుకోవడానికి జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరిన మహిళ.. ఆపరేషన్ చేస్తుండగా చనిపోయింది. అయితే, సర్జరీ చేస్తున్న డాక్టర్ మరో డాక్టర్‌తో వీడియో కాల్‌లో సాయం తీసుకుంటూ వైద్యం చేయడం వల్లనే ఆమె చనిపోయిందని మృతురాలి బంధువులు ఆందోళనకు దిగారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పోచంపేట గ్రామానికి చెందిన అయిత రాజవ్వ(42) గర్భసంచిలో కణితులు వచ్చి ఇబ్బంది పడుతోంది. వాటిని తొలగించుకోవడానికి బుధవారం జగిత్యాలలోని పల్లవి ఆస్పత్రిలో చేరింది. అయితే, ఆపరేషన్ చేస్తుండగా గుండె పోటు వచ్చి గురువారం ఉదయం ఆమె మృతి చెందిందని వైద్యురాలు రాజవ్వ కుటుంబ సభ్యులకు తెలిపారు. కాగా, డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఆమె చనిపోయిందని మృతురాలి బంధువులు ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. హైదరాబాద్‌లోని వైద్యులతో ఫోన్‌లో వీడియోకాల్ చేస్తూ ఆపరేషన్ చేయడం వల్లనే రాజవ్వ చనిపోయిందని ఆరోపించారు. పోలీసులు వచ్చి మృతురాలి బంధువులను సముదాయించారు. జగిత్యాలకు చెందిన వైద్యులు వారితో మంతనాలు జరిపి శాంతింపజేశారు. దీనిపై పల్లవి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ పద్మినిని వివరణ కోరగా రాజవ్వకు గర్భసంచిలో కణితి పెద్దగా ఉందని, ఆమెకు లాప్రోస్కోపిక్ ఆపరేషన్ చేయడానికి సిద్ధమవుతుండగా గుండె పోటు వచ్చి మృతి చెందిందని తెలిపారు. ఇతర వైద్యులను కూడా పిలిపించి ప్రయత్నించినప్పటికీ ప్రాణాలను కాపాడలేకపోయామని చెప్పారు.

ఖరీఫ్ మొదలైనా

ఇంకా యాసంగి కొనుగోళ్లు

- ఈనెలాఖరు వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- ఆలస్యంగా వరికోతలు చేపట్టే రైతులకోసం నిర్ణయం
- 73 లక్షల టన్నులు దాటిన సేకరణ, 75 లక్షలకు చేరే అవకాశం



హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం సేకరణ ఈ నెలాఖరు వరకు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. యాసంగి సాగు ఆలస్యంగా చేపట్టిన జిల్లాల్లో రైతులు వరి కోతలు కూడా ఆలస్యంగా చేపడుతున్నారు. ఫలితంగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావటం కూడా ఆలస్యమవుతోంది. ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం విక్రయించే ప్రతి రైతు నుంచి ధాన్యం సేకరించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. ఈనెల 30వ తేదీ వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచి ఉంచాలని ఆదేశాలు జారీచేసింది. యాసంగి 2024-25 సీజన్‌లో 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంతో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కొనుగోళ్లు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా 8,378 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసింది. గురువారం నాటికి 73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. 70 లక్షల టన్నులు టార్గెట్ పెట్టుకోగా జూన్ నెల మొదటి వారంలోకి రాగానే లక్ష్యం పూర్తయింది. 3 లక్షల టన్నులు అదనంగా సేకరించింది. ఇంకా ఉమ్మడి వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొస్తున్నారు. తొలుత జూన్ 15 తేదీ నాటికి ధాన్యం సేకరణ పూర్తిచేయాలని ప్రభుత్వం భావించింది. కొన్ని జిల్లాల్లో ఇంకా వరి కోతలు జరుగుతుండటం, ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడవటంతో ఆరటానికి ఇంకా సమయం పడుతోంది. ఈ పరిస్థితుల్లో ఇప్పటికిప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు బంద్ చేసే పరిస్థితి కనిపించలేదు. మరో రెండు వారాలు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే... జూన్ నెల 30 తేదీ వరకు కూడా రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచి ఉంచుతామని, చివరి రైతు తెచ్చే చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో మరో 18 రోజుల పాటు అవసరమున్న జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు తెరిచి ఉండనున్నాయి. కొన్నిచోట్ల ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకరావటంలేదు. అలాంటి జిల్లాల్లో జిల్లా కలెక్టర్ల ఆదేశాల మేరకు సెంటర్లను మూసివేశారు. ఎక్కడ అవసరమైతే అక్కడ కొనుగోలు కేంద్రాలు తెరిచి ఉంచే బాధ్యతను జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న జిల్లాల్లో కూడా రోజుకు 20 వేల టన్నుల నుంచి 30 వేల టన్నుల వరకు ధాన్యం వస్తోంది. సీజన్‌లో వచ్చినంతగా కాకుండా తక్కువ పరిమాణంలో ధాన్యం వస్తోంది. ఇప్పటిరకు 73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా ఈనెలాఖరు వరకు కొనుగోలు కేంద్రాలు తెరిచి ఉంచితే మరో 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో యాసంగి (2024- 25) ధాన్యం సేకరణ రికార్డు స్థాయిలో 75 లక్షల మెట్రిక్ టన్నులకు చేరే అవకాశాలున్నాయి. జూన్ ఒకటో తేదీ నుంచి రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ మొదలైంది. నైరుతి రుతుపవనాలతో వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో రైతులు వానాకాలం పంటల సాగును ప్రారంభించారు. మరోవైపు కొన్ని జిల్లాల్లో యాసంగి ధాన్యం సేకరణ ఇంకా జరుగుతోంది.

యాసంగి ధాన్యం సేకరణలో టాప్ టెన్‌లో ఉన్న జిల్లాలు

క్రసం	జిల్లా పేరు	ధాన్యం (టన్నుల్లో)
1	నిజామాబాద్	829722
2	నల్లగొండ	598032
3	జగిత్యాల	466232
4	పెద్దపల్లి	400900
5	కామారెడ్డి	382461
6	సిద్దిపేట	374964
7	భువనగిరి	367954
8	సూర్యాపేట	339511
9	మెదక్	316760
10	కరీంనగర్	310529

పిడుగుపాటుకు ఆరుగురు రైతుల బలి

(మొదటి పేజీ తరువాయి)



పెందూరు మాధవరావు, పెందూరు సుజాత, మంగం భీంబాయి, సిడాం రాంబాయి (ఫైల్)

వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, బేల మండలం సోన్‌కాస్ గ్రామానికి చెందిన కోవ సునీత(40) వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన సమయంలోనే పిడుగు పడడంతో పంట చేనులోనే మృతి చెందింది. ఇదే మండలంలోని సాంగిడి గ్రామానికి చెందిన గేడం నందిని (39)పై కూడా పంట చేనులోనే పిడుగు పడడంతో ప్రాణాలు విడిచింది. అలాగే, ఉట్నూర్ మండలం కుమ్మరితండాకు చెందిన ధన్‌రాజ్, నిర్మల, కృష్ణబాయి పంట చేనులోని గుడిసెలో ఉండగా.. సమీపంలోనే పిడుగు పడడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. గాయపడిన వారిని వెంటనే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం పడింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో తెల్లవారు జాము నుంచి పిడుగులు, ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిశాయి. హైదరాబాద్ శివారులోని శేరిలింగంపల్లిలోని సెంట్రల్ యూనివర్సిటీలో అత్యధికంగా 14.85 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. చందానగర్‌లో 10.98 సెంటీమీటర్లు, గచ్చిబౌలిలో 8.1, మెయినాబాద్ కేతిరెడ్డిపల్లిలో 7.83, షాబాద్ మండలం తాళ్లపల్లిలో 7.1, మెయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 6.28, చందన్వెల్లిలో 6.88, చేవెళ్ల మండలం కందవాడలో 6.65, మెయినాబాద్‌లో 6.08, యాచారం మండలం నల్లవెల్లిలో 5.9, కేశంపేటలో 5.08 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వికారాబాద్ మండలంలో అత్యధికంగా 6.1, పరిగిలో 5.80 సెంటీమీటర్ల వర్షం కురిసింది. నిజామాబాద్ జిల్లాలోని మోర్తాడ్‌లో అత్యధికంగా 3.97 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నిజామాబాద్‌తోపాటు ఆర్మూర్, బోధన్, భీంగల్, తదితర ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఎగువన వర్షాలు పడుతుండడంతో.. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 2018 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. అలాగే, మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో 8, మహ్మదాబాద్ మండలంలో 6.92, గద్వాల జిల్లా ఇటిక్యాలలో 7.3, సెంటీమీటర్ల వర్షం కురవగా.. ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి.

ఒక్కొక్కరి ఆస్తులు రూ.200 కోట్లపైనే!

- గత ఏప్రిల్ 26న ఈఎన్సీ భూక్య హరిరామ్ అరెస్టు
- తాజాగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్‌కు రిమాండ్
- వీరిద్దరూ కాళేశ్వరంలో కీలకంగా వ్యవహరించిన వారే
- ఏసీబీ నజర్‌లో మరి కొన్ని కాళేశ్వరం తిమింగలాలు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన ఇంజనీర్ల ఆస్తులపై ఏసీబీ గురిపెట్టింది. ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా పనిచేసిన భూక్యా హరిరామ్‌ను గత ఏప్రిల్ 26న అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు.. దాదాపు 200కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించారు. తాజాగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్‌ను ఏసీబీ అధికారులు బుధవారం అరెస్టు చేసి, గురువారం న్యాయస్థానంలో హాజరుపరిచారు. శ్రీధర్‌ను 14రోజుల జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారు. కాగా, శ్రీధర్ నివాసం, ఇతర ప్రాంతాల్లో జరిపిన తనిఖీల్లో రూ.200కోట్లపైగా ఆస్తులను ఆయన కూడబెట్టినట్లు గుర్తించారు. శ్రీధర్‌కు సంబంధించిన బ్యాంకు లాకర్లలో భారీగా బంగారు ఆభరణాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే, అతడి బినామీల వ్యవహారాలు తెలుసుకునేందుకు కస్టడీ పిటిషన్ వేసి మరింత లోతుగా విచారించాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఇటీవల విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక ఆధారంగా అక్రమార్జనకు పాల్పడిన ఇంజనీర్లపై ఏసీబీ నిఘా కొనసాగిస్తుంది. పక్కా సమాచారం సేకరించిన తర్వాతే సోదాలు చేపట్టి, కేసులు నమోదు చేస్తున్నారు. శ్రీధర్, హరిరామ్ కేసుల్లోనూ లగ్జరీ విల్లాలు, ఫ్లాట్లు, ఖరీదైన ఏరియాల్లో ఇళ్ల స్థలాలు, వాణిజ్య సముదాయాలు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది.

బాలికపై లైంగిక దాడి.. యువకుడికి పదేళ్ల జైలు

రామాయంపేట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రెండో తరగతి బాలికపై లైంగిక దాడి చేసిన ఘటనలో యువకుడికి పదేళ్ల జైలు శిక్ష పడింది. రూ.వెయ్యి జరిమానా కూడా విధిస్తూ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి నీలిమ గురువారం తీర్పు వెలువరించారు. 2009 ఆగస్టు 27న రామాయంపేట వడ్డెర కాలనీకి చెందిన రొయ్యల రాజు.. ఆ బాలికను ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లి నోట్లో గుడ్డలు కుక్కి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై అప్పట్లో సీఐ విజయ్ కుమార్ ఆ యువకుడిని అరెస్టు చేశారు. ప్రస్తుత సీఐ వెంకటరాజాగౌడ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పరిశీలించిన జడ్జి.. జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని 17లక్షలు వసూలు

- ఏపీలోని అనంతపురం జిల్లా వాసి అరెస్టు

దేవరకొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చదివింది ఏడో తరగతి.. కానీ తాను నీటి పారుదలశాఖ మేనేజర్‌నని చెప్పుకున్నాడు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా ధర్మవరం వాసి మాదిన్నె కృష్ణ అలియాస్ వేణుగోపాల్‌రెడ్డి. 2021లో నల్లగొండ జిల్లా దేవరకొండకు వచ్చిన మాదిన్నె కృష్ణ.. స్థానిక బీఎన్ఆర్ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. తాను డిండి ప్రాజెక్టు మేనేజర్‌నని, ఉద్యోగాలిప్పిస్తానని అదే కాలనీ వాసులు మూడావత్ స్వాతి, షేక్ తబ్రేజ్‌లను నమ్మించి రూ.17 లక్షలు వసూలు చేశాడు. మూడేళ్లయినా ఉద్యోగం రాకపోవడంతో బాధితులు అనుమానంతో ప్రశ్నించడంతో ఇటీవలే ఇంటికి తాళం వేసి పరారయ్యాడు. బాధితులు గత మార్చి ఒకటో తేదీన దేవరకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గాలింపు చేపట్టిన దేవరకొండ పోలీసులు.. అనంతపురంలో నిందితుడ్ని అరెస్టు చేసి, అతడి వద్ద రూ.8 లక్షలు రికవరీ చేసినట్లు ఏఎస్పీ మౌనిక గురువారం మీడియాకు చెప్పారు. పరారైన మాదిన్నె కృష్ణ భార్యది ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం. కొద్ది రోజులు అక్కడే నివాసం ఉన్న కృష్ణ కుటుంబం.. చిట్టీలు నిర్వహించి ఖాతాదారులకు నగదు చెల్లించలేదన్న ఆరోపణలున్నాయి. అనంతపురం, కొణిజర్లలోనూ ఉద్యోగాలిప్పిస్తానని నమ్మించి పలువురి నుంచి నగదు వసూలు చేసిన కృష్ణపై చీటింగ్ కేసు నమోదైందని ఏఎస్పీ మౌనిక తెలిపారు.

90 ఏళ్ల వృద్ధురాలిపై సామూహిక అత్యాచారం

- రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో ఘటన

యాచారం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తొంభై ఏళ్ల వృద్ధురాలిపై గుర్తు తెలియని వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మంతన్‌గౌరెల్లిలో ఈ ఘటన జరిగింది. మంతన్‌గౌరెల్లికి చెందిన వృద్ధురాలు బుధవారం రాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తోంది.. ఇది గమనించిన దుండగులు తలుపులను విరగొట్టి... ఇంట్లోకి చొరబడి వృద్ధురాలి ఛాతీపై కొట్టి హింసించారు. ఆమె స్పృహ కోల్పోవడంతో అత్యాచారానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి గ్రామానికి చేరుకున్నారు. బాధితురాలిని వైద్య పరీక్షల కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. గ్రామానికి క్లూస్‌టీం, పోలీసు జాగిలాలతో దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మహావిషాదం...

ఆ భయానక ఘటన ఒళ్ళు జలదరింపచేస్తోంది. ఆ పెను విషాదం గుండెలను నలిపేస్తున్నది. అలవోకగా సముద్రాలను అధిగమించి, సునాయాసంగా వేలాదికిలోమీటర్లు దూసుకుపోవాల్సిన ఆ లోహవిహంగం నింగిని తాకకముందే నేలవాలిపోయింది. తల్లిగర్భంలో శిశువులా భద్రంగా ఉన్నామని, గమ్యాన్ని నిక్షేపంగా చేరుకుంటామన్న ప్రయాణికుల నమ్మకాన్ని ఈ ఇనుప రెక్కల పక్షి వమ్ముచేసింది. అనేక ఆశలనూ, ఆశయాలను, ఊసులనూ గుండెల్లో నింపుకొని, నేలవాలగానే ముంచెత్తబోయే సన్నిహితుల, ఆత్మీయుల ఆలింగనాల కోసం ఆనందంగా ఎదురుచూస్తున్నవారు అర్ధంతరంగా, అతివిషాదంగా తమ జీవితాన్ని ముగించాల్సివచ్చింది. మహాశక్తిమంతమైన ఇంజన్, అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలు ఉన్న ఒక గొప్ప కంపెనీ విమానం రివ్వున ఎగిరి, లండన్‌లో నిక్షేపంగా దిగడానికి బదులు వందల అడుగులు లేవడానికే వేదనపడటం, క్షణాల్లో కూలి భగ్గుమనడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఏం జరిగిందన్నది కళ్ళకు కనిపిస్తోంది. ఎందుకు జరిగిందన్న ప్రశ్న మాత్రం నిర్దిష్టమైన, నమ్మశక్యమైన సమాధానం దొరికేవరకూ మనలను నిలవనివ్వదు. మాటలకు అందని మహా విషాదం ఇది.

పట్టుమని తొమ్మిదివందల అడుగులు కూడా లేవలేక విమానం కుప్పకూలింది. విమాన ప్రమాదాల్లో సగానికి పైగా టేకాఫ్, లాండింగ్ సందర్భాల్లోనే జరుగుతాయి కనుక, పక్షి ఢీకొన్నదేమోనన్న అనుమానాలూ ఉన్నాయి. టేకాఫ్ సక్రమంగా జరగలేదని, అందుకు తగినంత శక్తి సమకూరలేదని అర్థమవుతూనే ఉంది. పొట్టనిండా ఇంధనం ఉన్నా, సరఫరా వ్యవస్థల్లో లోపం ఉంటే, ఇంధనం సరిగా చేరక ఇంజన్ విఫలమవుతుంది. ఇంజన్ మీద అత్యంత భారం పడే టేకాఫ్ సందర్భం పైలట్ల నైపుణ్యానికీ, అనుభవానికీ కూడా ఓ విషమపరీక్ష. నిండుగా ఉన్న ఇంధనం నిక్షేపంగా గమ్యానికి చేర్చాల్సింది పోయి విమానం మొత్తం క్షణాల్లో భగ్గుమనిపోయేందుకు ఉపకరించడం విషాదం. కాపాడమంటున్న ఆ మేడేకాల్ క్షేత్రస్థాయికి చేరి, ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది స్పందించేలోగానే విమానం మరింత కిందకు జారింది, అంతిమంగా కుప్పకూలింది. దురదృష్టకరమైన ఈ పరిణామానికి తోడు, ఆ విమానం వైద్యవిద్యార్థుల హాస్టల్ మీద పడి, అనేక మంది ప్రాణాలు తీసింది. తాను కుప్పకూలుతూ అన్నం తింటున్న వారిని పొట్టనబెట్టుకుంది. ఈ హాస్టల్ భవనం సహా విమానాశ్రయానికి చేరువలో ఉన్న ప్రాంతాలన్నీ ఈ విధ్వంసం తీవ్రతకు ప్రత్యక్షసాక్ష్యాలు. డీఎన్ఏ పరీక్షతో తప్ప మృతులను గుర్తుపట్టలేని రీతిలో ఈ వినాశనం జరిగింది. అందరినీ పొట్టనబెట్టుకున్న ఆ విమానంలో నుంచి ఒకే ఒక్కడు నిక్షేపంగా బయటపడటం ఓ అద్భుతం. విమానంలో నుంచి ఎవరో విసిరివేసినట్టుగా, ఒంటి మీద పెద్ద గాయాలు లేకుండా బతికి బయటపడిన ఈ వ్యక్తి తనకు తానుగా నడిచిపోతున్న ఆ దృశ్యం ఎన్నటికీ చెరిగిపోనిది.

ఇప్పుడు ప్రమాదానికి గురైన విమానానికి వయసెక్కువనీ, సాంకేతిక సమస్యలతోనూ, పలుమార్లు డీజీసీఏ హెచ్చరికలతో దానిని పక్కనబెట్టారని కొన్ని వార్తలు వస్తున్నాయి. నిజానిజాలు అటుంచితే, శల్యపరీక్షలు చేయనిదే, ప్రయాణానికి నూరుశాతం అర్హమైనదని నిర్ధారణ కానిదే ఏ విమానమూ గాలిలోకి ఎగరదు. అత్యంత అనుభవజ్ఞులైన పైలట్, కోపైలట్‌కు ఏ మాత్రం అనుమానం కలిగినా ఈ ప్రయాణానికి అంగీకరించేవారే కాదు. ఇంతటి ఘోర ప్రమాదం జరిగిన తరువాత, మొత్తంగా బోయింగ్ మీద, ప్రత్యేకించి ఈ తరహా విమానాలమీద కొన్ని సత్యాసత్యాలు ప్రచారంలోకి రావడం సహజం. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ఈ విమానాలు నిక్షేపంగా తిరుగుతున్నమాటా నిజం. ఎయిర్ ఇండియాను కొనుగోలు చేసిన సందర్భంలో టాటా సంస్థకు సంక్రమించిన విమానాల్లో కొన్నింటికి వయసు మీదపడటంతో వాటి ఆధునికీకరణ కూడా సాగుతోందని అంటారు. గత నెలలోనే నాలుగు వందల మిలియన్ డాలర్ల వ్యయంతో అది మలిదశ కార్యక్రమానికి నడుంబిగించింది. ఈ ప్రమాదం నేపథ్యంలో, ఎయిర్ ఇండియా తన విమానాల సంపూర్ణ ప్రక్షాళనకు సిద్ధపడక తప్పదు. విమానాల ఆధునికీకరణకు సంబంధించి దేశీయ విమానయానసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకొని వాటి తరఫున విదేశాలతో వ్యవహరించడం అవసరం. సాంకేతిక వైఫల్యాల నుంచి మానవ నిర్లక్ష్యం వరకూ ఈ ప్రమాదానికి దోహదం చేసిన అంశాలన్నింటినీ నిజాయితీతో గుర్తించి, కఠినమైన చర్యలను చేపట్టడంతో పాటు, సరైన పరిష్కారాలను సాధించడం అవసరం.

విద్యాధామాల్లో రెక్కలు తెగుతున్న స్వేచ్ఛ

ప్రతి ప్రశ్నకు సమాధానం కోసం మనం ఏఐను ఆశ్రయిస్తున్నప్పుడు సరైన ప్రశ్న అడిగేందుకు ఏఐ సహాయాన్ని పొందలేమా? అశోక విశ్వవిద్యాలయ విద్యా కుటుంబానికి చెందిన బిభ్‌చందాని లేఖను చదివినప్పుడు నా మనసులో మెదిలిన మొదటి ఆలోచన అది. బిభ్‌చందాని బహిరంగంగా వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలతో నేను విభేదిస్తున్నప్పటికీ ఆయన లేఖను సానుభూతితో చదివాను. ప్రథమ శ్రేణి లిబరల్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధిపరిచేందుకు, నిజంగా లాభాపేక్ష లేకుండా సకల వసతులు, సదుపాయాలు సమకూర్చిన అశోక విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు ప్రతి ఒక్కరి, ముఖ్యంగా దాని నుంచి తమ పిల్లలు లబ్ధి పొందుతున్న నా లాంటి తల్లిదండ్రుల గౌరవానికి సంపూర్ణంగా అర్హులు.

బిభ్‌చందాని ఒక అస్పష్టమైన, తప్పుడు తార్కికతతో కూడిన ప్రశ్న అడగడం నాకు విచారం కలిగించింది. 'లిబరల్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయాలు అన్నీ స్వతస్సిద్ధంగా క్రియాశీలమైనవా? క్రియాశీలత వాటి ముఖ్య కర్తవ్యమా?' కాదు అనేదే దీనికి ఇవ్వగల సమాధానం. అన్ని విశ్వవిద్యాలయాలు ఒకేలా ఎలా ఉంటాయి? ఇతర విశ్వవిద్యాలయాలు వ్యవహరిస్తున్న తీరుతెన్నులు 'అశోక'కు ఆదర్శమూ, ప్రమాణమూ ఎలా అవుతాయి? ఏది ఏమైనప్పటికీ ఒక విశ్వవిద్యాలయం స్వాభావిక క్రియాశీలతతో వ్యవహరించడమంటే ఏమిటి? విశ్వవిద్యాలయం ఒక సంస్థగా క్రియాశీల కార్యకర్తగా వ్యవహరించడం హాస్యాస్పదంగా ఉండదూ? బిభ్‌చందాని ఈ ప్రశ్నను, తాను ధర్మకర్తగా ఉన్న విశ్వవిద్యాలయంలోని వందలాది అధ్యాపకుల– దేశంలోనే అత్యుత్తమమైనవారు– ను కాకుండా ఒక చాట్ బాక్స్‌ను అడగడం నన్ను విస్మయపరిచింది.

బిభ్‌చందాని అడగవలసిన ప్రశ్నలు: లిబరల్ ఆర్ట్స్ విద్య తన స్వభావ రీత్యా ఏదో ఒక విధమైన క్రియాశీలతను ప్రోత్సహిస్తుందా? అయినప్పుడు లిబరల్ ఆర్ట్స్ విద్యను బోధించే విశ్వవిద్యాలయం ఆ క్రియాశీలతతో ఎలా వ్యవహరించాలి? సమాజాన్ని బాధిస్తున్న సమస్యలను విశ్వవిద్యాలయ పాఠ్యాంశాలు, బోధనా పద్ధతులలో చేర్చడం ద్వారా వాటి పరిష్కారానికి క్రియాశీలంగా పని చేయాలా? అటువంటి నిమగ్నతను కేంపస్ సంస్కృతిలో ప్రోత్సహించాలా? కేంపస్‌లోను, కేంపస్ వెలుపల అటువంటి క్రియాశీల కార్యకలాపాలలో పాల్గొనేందుకు అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బందిని అనుమతించాలా?

ఇవన్నీ ఏ సంస్థకు అయినా, ముఖ్యంగా ఏ విద్యా సంస్థకు అయినా సాధారణ ప్రశ్నలే. ఉత్తమ విద్య ఏదైనా విద్యార్థులలో జిజ్ఞాసను పెంచాలి. ఉత్సుకత, ప్రశ్నించడం, విశాల దృక్పథం, విమర్శనాత్మక ఆలోచన, శ్రద్ధ, సృజనాత్మకతతో కూడిన విచారణ స్ఫూర్తిని పెంపొందించాలి. గ్రహించిన జ్ఞానాన్ని ప్రశ్నించడాన్ని, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అధికారాన్ని నిలదీయడాన్ని నేర్పాలి. విద్య స్వతస్సిద్ధంగా విధ్వంసకమైనదని బ్రెజీలియన్ విద్యావేత్త, తత్వవేత్త Paulo Freire అన్నారు. ఈ విద్యా ధర్మాన్ని లిబరల్ ఆర్ట్స్ విద్య మరింత ముందుకు తీసుకెళుతుంది. తమ విమర్శనాత్మక ఆలోచనను సొంత జీవితాలకు, సమాజానికి వర్తింపచేసేలా విద్యార్థులను పురిగొల్పుతుంది. అందుకు అవసరమైన శిక్షణనిస్తుంది. తమలోను, తోటివారిలోను ఉన్న దురభిప్రాయాలు, సమాజంలోని ఆధిపత్యవర్గాల ప్రత్యేక హక్కులను ప్రశ్నించేలా చేస్తుంది. ప్రొఫెసర్ అలీఖాన్ మహమూదాబాద్ లాంటి రాజనీతి శాస్త్ర విద్యార్థులు,



ఒక విశ్వవిద్యాలయం తన విద్యా కుటుంబంలోని ఒక సభ్యుడు రాజకీయ కారణాలతో వేధింపులకు గురవుతున్నప్పుడు అతడికి బాసటగా ఉండాలా? వివాదం మొదలయీ మొదలవక ముందే అతడిని అతడి కర్మకు వదిలేయాలా? అతడికి న్యాయపరంగా కాకపోయినా నైతిక మద్దతు అయినా ఇవ్వకూడదా? కనీసం మౌనంగా ఉండిపోకూడదా? బిభ్‌చందాని లేఖను అశోక విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుల నుంచి దాని విస్తృత విద్యా కుటుంబానికి సందేశంగా భావిస్తే అది ఒక అంతిమ హెచ్చరిక చేస్తున్నట్టు స్పష్టమవుతుంది. ఆ హెచ్చరిక తీవ్రంగా, స్ఫుటంగా, భీతిగొల్పే విధంగా ఉన్నది.

అధ్యాపకులు ఈ విషయంలో మరింత ముందుంటారు. రాజకీయ అధికార ప్రాబల్య ప్రాభవాలను నిత్యం నిశితంగా ప్రశ్నించడం వారి మేధో కర్తవ్యం కదా.

లిబరల్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం దేనికైనా వేయవలసిన ప్రశ్న ఇది: 'తన బోధనకు ముందున్న పరిస్థితులు, బోధన పర్యవసానాలతో విశ్వవిద్యాలయం ఎలా వ్యవహరించాలి? ఈ విద్యను బోధించేవారు విమర్శనాత్మకంగా, నిష్పాక్షికంగా, విశాల దృక్పథంతో ఆలోచించగలిగినవారు అయినప్పుడే నాణ్యమైన లిబరల్ ఆర్ట్స్ విద్య సమకూరుతుంది. బోధనా సంస్థ భావాల స్వేచ్ఛా వినిమయాన్ని ప్రోత్సహించడమనేది కూడా చాలా ముఖ్యం. మానవీయ శాస్త్రాల విద్య సొంత నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యమున్న వారిని, తమ విశ్వాసాలకు అనుగుణంగా నిజజీవితంలో ప్రవర్తించగల దృఢ వ్యక్తిత్వమున్న వారిని రూపొందించేదిగా ఉండాలి. వ్యక్తుల వాస్తవ జీవితాలు, సమాజ సమష్టి జీవితం సంక్లిష్టమైనవి. అవి విసిరే సమస్యలు, సవాళ్లను క్రియాశీలంగా ఎదుర్కొనేందుకు అనుమతించకుండా, అందుకు దోహదం చేయకుండా ఒక లిబరల్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంతో సహా ఏ విశ్వవిద్యాలయమైనా తన విద్యా బోధన విధ్యుక్త ధర్మాన్ని పరిపూర్తి చేయగలదా? సమాజ సమస్యల పరిష్కారానికి క్రియాశీల కృషిని పౌర ధర్మంగా గౌరవించాలి. ఇదే క్రియాశీలత అయితే లిబరల్ ఆర్ట్స్ విద్య, క్రియాశీలత మధ్య బొడ్డుతాడు సంబంధమున్నదని గుర్తించాలి, అంగీకరించాలి.



■ యోగేంద్ర యాదవ్

ఒక విశ్వవిద్యాలయం ఏదో ఒక తరహా పక్షపాతాన్ని పెంపొందించాలని నేను చెప్పడం లేదు. పోటీ దృక్పథాలు, భావజాలాలకు సమ ప్రాధాన్యం లభించేలా చూడాలి. మహమూదాబాద్ లాంటి అధ్యాపకుల రాజకీయ విశ్వాసాలు చర్చనీయాంశాలుగా ఉన్నంతవరకు అవి విద్యకు ఆటంకం కాబోవు. పక్షపాత దృక్పథంతో సిద్ధాంతాలను విద్యార్థుల మనసుల్లోకి ఎక్కించడం, వాటిని సహజ వివేకంగా ఆమోదించడం సరికాదు, అటువంటి క్రియాశీలతకు నియమ నిబంధనలు ఉండాల్సిన అవసరమున్నది. సంస్థాగత ప్రదేశాలలో ఏ తరహా, ఏ రీతి క్రియాశీలతను అనుమతించాలి, ప్రోత్సహించాలి అనే విషయమై విశ్వవిద్యాలయాలు స్పష్టమైన హద్దులు ఏర్పరచుకోవచ్చు. అయితే విమర్శనాత్మక ఆలోచనను, పౌర చర్య (సివిక్ యాక్షన్)ను వేరుపరచడం వల్ల లిబరల్ ఆర్ట్స్ విద్య పరమ లక్ష్యమే నిష్ఫలమవుతుంది.

ప్రత్యామ్నాయ దృక్కోణాలను అన్వేషించే ఈ ప్రాథమిక చర్చ మహమూదాబాద్ కేసులో ప్రశ్నను తప్పించుకోవడానికి ప్రయత్నించకూడదు. ఇంతకూ ఆ ప్రశ్నను బిభ్‌చందాని పరిగణనలోకి తీసుకోనేలేదు. అధ్యాపకుల లేదా విద్యార్థుల ప్రతి సోషల్ మీడియా పోస్ట్‌కు లేదా వారు రాసిన ఒక పరిశోధనా వ్యాసానికి విశ్వవిద్యాలయం బాధ్యత వహించాలని ఎవరూ అడగడం లేదు. ఇదీ అసలు ప్రశ్న: ఒక విశ్వవిద్యాలయం తన విద్యా కుటుంబంలోని ఒక సభ్యుడు రాజకీయ కారణాలతో వేధింపులకు గురవుతున్నప్పుడు అతడికి బాసటగా ఉండాలా? వివాదం మొదలయీ మొదలవక ముందే అతడిని అతడి కర్మకు వదిలేయాలా? అతడికి న్యాయపరమైన మద్దతు ఇవ్వకపోయినప్పటికీ నైతిక మద్దతు అయినా ఇవ్వకూడదా? కనీసం మౌనంగా ఉండిపోకూడదా?

శోచనీయమైన విషయమేమిటంటే సరిగ్గా ఈ విషయంలోనే అశోక వర్సిటీ ప్రతిస్పందన అసంతృప్తికరంగా ఉన్నది. ఆ సంస్థ తాను ప్రవర్తించిన తీరుకు భిన్నంగా వ్యవహరించి వుంటే బాగుండేదనిపిస్తుంది. మహమూదాబాద్ అరెస్ట్‌కు 'అశోక' ప్రథమ ప్రతిస్పందన, ఆ ప్రొఫెసర్ సోషల్ మీడియా పోస్ట్ సైనిక దళాలకు వ్యతిరేకంగా ఉన్నదనే డొంకతిరుగుడు వాదనను సమ్మతించిన విధంగా ఉన్నది. అరెస్ట్ అయిన అనంతరం మీడియా, ప్రభుత్వం మాదిరిగానే విశ్వవిద్యాలయమూ అతడు తప్పు చేసినట్టుగానే భావించినట్టు ఉన్నది. బిభ్‌చందాని లేఖ మరో విధంగా భావించేందుకు ఆస్కారమివ్వడం లేదు. మహమూదాబాద్ తన రాజకీయ ఎజెండాకు 'అశోక'ను ఉపయోగించుకున్నాడనేది విశ్వవిద్యాలయ నిర్వాహకులు ఆక్షేపిస్తున్నారు. ఇందులో నిజం లేకపోలేదు. ఈ దృష్ట్యా తమ విద్యాకుటుంబంలోని బాధ్యతాయుత వ్యక్తి ఎవరైనా తన రాజకీయ చర్యలతో విశ్వవిద్యాలయానికి ఇబ్బందులు కలిగించకుండా ఉండేలా ఒక నిర్దుష్టమైన విధానాన్ని రూపొందించుకోవాలి.

భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన అధ్యాపకులతో వ్యవహరించే విషయంలో 'అశోక' ప్రతిస్పందన ఉదార దృక్పథంతో లేదనే విమర్శలు రావడం మహమూదాబాద్ విషయంలోనే మొదటిసారికాదు. అలాంటి ప్రతి సందర్భంలోనూ విశ్వవిద్యాలయం ఔదార్యరహితంగా, అసహిష్ణుతతో వ్యవహరించేందుకే మొగ్గుచూపినట్టుగా కనిపిస్తుంది. బిభ్‌చందాని లేఖను విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుల నుంచి దాని విస్తృత విద్యా కుటుంబానికి సందేశంగా భావిస్తే అది ఒక అంతిమ హెచ్చరికను సూచిస్తున్నట్టు స్పష్టమవుతుంది. ఆ హెచ్చరిక తీవ్రంగా, స్ఫుటంగా, భీతిగొల్పే విధంగా ఉన్నది.

అశోక వర్సిటీ నిర్వాహకులు ఎటువంటి ప్రతిబంధకాలలో పనిచేస్తున్నారో మనకు తెలియదు. ఉదారవాద భావాలు, విశాల దృక్పథాన్ని పెంపొందించేందుకు అంకితమైన ఒక విశ్వవిద్యాలయం అప్రజాస్వామిక, సంకుచిత పాలనా వ్యవస్థలో పనిచేయడమనేది దాని ఆశయాలు, లక్ష్యాల రీత్యా ఒక అసంగత విషయం. తమకు ఇబ్బందులు కలిగించే రాజకీయ చర్యలను ఇంకెంత మాత్రం సహించకూడదనే అభిప్రాయానికి అశోక వ్యవస్థాపకులు వచ్చి ఉండవచ్చు. అసలు వర్సిటీ మనుగడకు, తమ వ్యాపార ప్రయోజనాలకు ఆపద వాటిల్లకుండా తమ స్వప్నాన్ని వారు సమర్థించుకోలేరు. ఇది అర్థం చేసుకోదగిన విషయమే. అయితే వారు తమ పరిస్థితిని నైతిక సూత్రాలు, నైతిక పరిగణనలను నొక్కి చెప్పే భాషలో వ్యక్తీకరించవలసిన అవసరం లేదు. మీరు సమర్థించలేని బాధితుడిని అపరాధానికి పాల్పడిన వాడుగా భావించకూడదు.

ఉదారవాద విద్యా విలువల సంక్షోభానికి సంబంధించిన ఈ చర్చ అశోక విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు నిర్వాహకులకే పరిమితమవకుండా అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థినీ విద్యార్థులతో కూడిన విస్తృత అశోక విద్యా కుటుంబానికి విస్తరించాలి. మరి ఆ ఉన్నత విద్యా ధామంలో ఉదారవాద విద్యను కాపాడుకోవడంలో వారందరికీ విధిగా సంబంధముండి తీరాలి. ఈ దేశంలో ఉదారవాద విద్య నిజమైన విషాదం అశోక విశ్వవిద్యాలయంలో సంభవించింది మాత్రమే కాదు. సమున్నత విద్యా బోధన, పరిశోధనకు పేరు పొందిన జేఎన్‌యూ, డీయూ, హెచ్‌సీయూ, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ మొదలైన వాటిని చెడగొట్టిన తీరుతెన్నులు కూడా ఆ విషాదకథలోకే వస్తాయి. విద్యార్థుల, అధ్యాపకుల పౌర ధర్మ క్రియాశీలతను ఉన్నతశ్రేణి విద్యా సంస్థలు, సంపద్వంతులు అయిన వాటి దాతలు సమర్థించరు. ప్రజలే ఆ చైతన్యశీల క్రియాశీలతను సమర్థించాలి, కాపాడుకోవాలి. ఇది చెప్పేందుకు మనకు ఒక చాట్ బాట్ అవసరం లేదు.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

ఈ విస్తరణలోనూ ముస్లింలకు నిరాశే!

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరిగింది, ముగ్గురు కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ రెండవ విడత విస్తరణలో కూడా ముస్లింలకు పూర్తి నిరాశే మిగిలింది. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారి, దాదాపు ఇరవై నెలల పాటు, ముస్లింలకు మంత్రివర్గంలో ఒక్క స్థానమూ ఇవ్వకుండా ప్రభుత్వం కొనసాగుతోంది. ఇప్పటికి మొత్తం పదిహేనుమంది మంత్రులు నియమితులయ్యారు. ముస్లిం సామాజిక వర్గం నుండి ఒక్కరికీ అవకాశం కల్పించకపోవడం శోచనీయం. ముస్లిం ఎమ్మెల్యేలు ఎవరూ గెలవలేదు కనుక మంత్రి పదవులు ఎలా ఇవ్వాలి? అనే వాదన ముందుకు తెస్తున్నవారు ఒక్కసారి గతాన్ని గుర్తెరగాలి. 2014లో ప్రత్యేక తెలంగాణ మొదటి క్యాబినెట్ ఏర్పాటైన వేళ కేసీఆర్‌కూ ఇదే సమస్య ఎదురైంది. ముహమ్మద్ మహమూద్ అలీ అప్పుడు ఎమ్మెల్యే కానప్పటికీ ఆయనకు ఉప ముఖ్యమంత్రి హోదాతో పాటు హోంమంత్రిత్వ శాఖను కూడా ఇచ్చారు. ఈ వెసులుబాటు ఉన్నప్పుడు 'ఎవరూ లేరు' అన్న కారణం సహేతుకం కాదు.

రాష్ట్రంలో ముస్లింల జనాభా దాదాపు 14శాతం. గణనీయమైన ఓట్ల శాతం కలిగిన ముస్లిం సామాజిక వర్గం గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కీలకమైన మద్దతును అందించింది. కేసీఆర్ ఒంటెద్దు పోకడలకు వ్యతిరేకంగా, బీజేపీతో లోపాయికారీ ఒప్పందం ఫలితంగా ముస్లిం, ముస్లిమేతర మేధావివర్గం, ధార్మిక సంస్థలు, మహిళలు, యువత అందరూ కాంగ్రెస్ అభ్యర్థులకు తిరుగులేని మద్దతు ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెలకొన్న అసంతృప్తిని కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మలచడంలో ముస్లింల పాత్ర గణనీయమైనది. కానీ 'ఓడ దాటిందాక ఓడమల్లయ్య...' అన్నట్టు గెలిచిన వెంటనే కాంగ్రెస్ పార్టీ ముస్లిం వర్గాన్ని విస్మరించింది. లంబాడా సామాజిక వర్గానికి డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చి కొంత ఉపశమనం కలిగించినా, ముస్లింలకు అలాంటి కనీస గౌరవం కూడా లభించలేదు. 'ముస్లింలకు ఓటు హక్కు ఉంది కానీ పాలనా హక్కు లేదా?' అని యువతరం నిలదీస్తోంది.

దేశవ్యాప్తంగా కాంగ్రెస్ సహా అనేక పార్టీలు ముస్లింల ప్రాతినిధ్యాన్ని గణనీయంగా తగ్గిస్తున్నాయి. ముస్లిం సమాజం ప్రతిసారీ తన బాధ్యతను గుర్తెరిగి ఓటు హక్కును వినియోగిస్తోంది. కానీ పాలనా బాధ్యతల్లో పాలుపంచుకోలేని నిస్సహాయతకు గురవుతోంది. ఈ పరిస్థితి మైనారిటీల పట్ల అన్యాయం మాత్రమే కాదు; సమానత, న్యాయం అనే రాజ్యాంగ విలువలనే ప్రశ్నార్థకం చేసే ధోరణి. ఇప్పటికైనా తెలంగాణ కాంగ్రెస్ స్పందించాలి. తదనంతర మంత్రివర్గ విస్తరణలో ముస్లింలకు పదవులు ఇవ్వాలి.

– యండి. ఉస్మాన్‌ఖాన్

కులాంతర వివాహాలకు ప్రోత్సాహం కరువు!

నేటికీ మన భారతీయ సమాజంలో.. మరీ ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లో వేరే కులం పిల్లనో, పిల్లగాన్నో పెండ్లి చేసుకోవడం అంటే మామూలు ముచ్చట కాదని మనందరికీ తెలిసిందే. కుల వ్యవస్థలోని అంతరాలను తగ్గించే శక్తి కులాంతర వివాహాలకే ఉందని కూడా మనకు తెలుసు. కుటుంబాన్ని, సమాజాన్ని ఎదిరించి కులాంతర వివాహం చేసుకున్న వారి జీవనం సాఫీగా సాగడం అంత సులువు కాదు. అయితే పరువు హత్యలు, లేదంటే ఆ కొత్త దంపతులు ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులు! ఇలా అనేక సమస్యలు కులాంతర వివాహాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.

కులాంతర వివాహాలకు ప్రోత్సాహం, ఆర్థికంగా దన్ను అవసరం. ఆ వివాహాలు చేసుకున్న వారికి రూ.2.50 లక్షలు ఇస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. దానిని మరి కొంత పెంచి ఇస్తామని గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కానీ ఈ రెండూ హామీలూ అందని ద్రాక్షగానే మిగిలాయి.

ఉదాహరణకు ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో 2019 నుంచి గత నెల వరకూ కొన్ని వందల కులాంతర వివాహాలు జరిగాయి. వాటిలో ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు కోరుతూ ఎస్సీ సంక్షేమశాఖకు దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 360. కానీ అందులో 77 మందికి మాత్రమే ప్రోత్సాహకాలు మంజూరయ్యాయి! తక్కిన 283 మందికి ఎదురు చూపులే మిగిలాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో పరిస్థితి ఇలాగే ఉంది.

'సీనియారిటీ ప్రాతిపదికన ఏటా ఇద్దరు ముగ్గురికే ప్రోత్సాహకాలు మంజూరవుతాయి. అవి కూడా ఎప్పుడు వస్తాయనే విషయం తెలియదని ఓ జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి తెలిపారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న ప్రభుత్వం.. కులాంతర వివాహ ప్రోత్సాహకాలపై వివక్ష చూపడం చూస్తుంటే 'ప్రభుత్వాలకే కులాంతర వివాహాలు జరగడం ఇష్టం లేదేమో' అనే అనుమానం కలుగక మానదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి కులాంతర వివాహాల ప్రోత్సాహకాలపై గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. సత్వరమే దరఖాస్తుదారులకు ప్రోత్సాహకాలు అందజేయాలి.

– పిన్నింటి విజయ్‌కుమార్
కాకతీయ యూనివర్సిటీ

పొట్లపల్లి కమల మనోహర్‌రావుపై డాక్యుమెంటరీ

పొట్లపల్లి కమల మనోహర్‌రావు డిసెంబర్ 20, 1919న జన్మించారు. స్వగ్రామం అశ్వరావుపల్లి (రఘునాథపల్లి మండలం, జనగాం జిల్లా). ఆయన నిజాం ప్రభుత్వంలోని సామాజిక సంక్షేమశాఖలో పనిచేశారు. ఆదివాసీ సమూహాల అభివృద్ధి కోసం, ప్రత్యేకంగా గిరిజన సంక్షేమశాఖ ఏర్పాటుకు కృషిచేసి సాధించారు. 1966లో గిరిజన సంక్షేమశాఖ స్థాపించినపుడు ఆయన దాని మొదటి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అప్పటి నుంచి 1975లో పదవీ విరమణ వరకు ఆదివాసీల జీవన విధానం మెరుగుపరచడం కోసం ఎంతో కృషి చేశారు. 'సింగిల్ విండో' పరిపాలనా సూత్రాన్ని ప్రవేశపెట్టిన శాస్త్రవేత్తగా గుర్తింపు పొందారు. ఆదిలాబాద్ గోండు ఆదివాసీలపై అధ్యయనం చేసిన ప్రొఫెసర్ హైమండార్ఫ్ కమల మనోహర్‌రావు సేవలను గుర్తించి, అభినందిస్తూ కొన్ని లేఖలు కూడా రాశారు. గోండులకు భూమి హక్కు, పట్టాలూ లభించడంలో కమల మనోహర్‌రావు కృషి కూడా ఉంది. ఆయనపై ఒక డాక్యుమెంటరీ అధ్యయనం చేస్తున్నాం. ప్రభుత్వ అధికారిగా గిరిజన సంక్షేమానికి ఆయన చేసిన కృషికి సంబంధించిన వివరాలన్నీ సేకరించదలచుకున్నాము. ఆయనకు సంబంధించిన సమాచారం, ఆర్టికల్స్, పుస్తకాలు ఉంటే మాకు తెలియచేయాలని కోరుతున్నాం. ఆయనతో పరిచయం ఉన్నవారు ఆ జ్ఞాపకాలను పంచుకోదలిస్తే, మేమే వచ్చి ఆ వివరాలు రికార్డు చేసుకుంటాము. ఫోన్: 94405 95858; ఈమెయిల్: smrm5858@gmail.com.

– శ్యాంమోహన్

రాజ్యాంగం కంటే వెనకబడినవారు ఏం విప్లవకారులు?

మావోయిస్టుల శాంతి చర్చల ప్రకటనలో రెండుసార్లు రాజ్యాంగ విలువల ప్రస్తావన రావటాన్ని ఒక విశేషంగా గుర్తిస్తూ, డానీ రాసిన, పాలకులు–మావోయిస్టులు, మధ్య రాజ్యాంగం! అనే వ్యాసానికి (ఆంధ్రజ్యోతి–ఏప్రిల్ 15) కొనసాగింపుగా 'రాజ్యాంగంపై మావోయిస్ట్ అవగాహన స్పష్టమే' అంటూ మే 8న పాణి ఒక వ్యాసం రాశారు. పాణి తన వ్యాసంలో, "పౌర హక్కులు, చట్టబద్ధ పాలన, ఆదేశిక సూత్రాలు అనేవి రాజ్యాంగంలో భాగం కావటం చారిత్రకంగా ప్రగతిశీలమైన విషయం. ...పీడిత సమూహాల రక్షణలో ఎంతో కొంత సానుకూల పాత్ర పోషిస్తుంది. ...అయినప్పటికీ సానుకూల అంశాలు వాటంతటవి అమలు కావటం లేదు. ఈ సానుకూల అంశాలను ప్రభుత్వాలు బాహటంగా ఉల్లంఘిస్తున్నాయి. దీనికి తోడు సామాజిక వివక్షల వల్ల కూడా రాజ్యాంగం అమలులోకి రావడం లేదు," అంటున్నారు. నిజమే. మొదటి రెండు పారిశ్రామిక తీర్మాన విధానాలు తప్ప ఆ తరువాత వచ్చినవన్నీ రాజ్యాంగ లక్ష్యాలకు భిన్నమైనవే. అలాగే పాణి అన్నట్టు అనేక సానుకూల అంశాలు అమల్లోకి రావడం లేదనేదీ వాస్తవమే. అప్పుడు ఏం చేయాలి? సానుకూల అంశాలు అమల్లోకి రావడానికి పోరాటాలు చేయాలి. ఇక్కడ సమస్య పోరాటాల గురించి కాదు, ఆ పోరాటాల కోసం మావోయిస్టులు ఎంచుకున్న సాయుధ పంథా గురించి. దీన్ని ఆయన గుర్తించడం లేదు. అలాగే విప్లవం రాజ్యాంగ పరిధిలో లేని విషయం అంటూనే రాజ్యాంగ పరిధిలో శాంతి చర్చలు జరగాలంటున్నారు. మరి విప్లవం అనేది ఒక్క మావోయిస్టు పార్టీకి మాత్రమే లక్ష్యంగా ఉందా? ఇతర ఎమ్ఎల్ పార్టీలకు గాని కమ్యూనిస్టు పార్టీలకు గాని లక్ష్యంగా లేదా? అంటే ఉంది. అటువంటప్పుడు వారికి లేని రాజ్యాంగపరమైన సమస్య కేవలం మావోయిస్టు పార్టీ వారికి ఎందుకు కలుగుతుంది? ఇది కదా మౌలిక ప్రశ్న.

రాజ్యాంగంలో సానుకూల అంశాలు ఉన్నాయనే అవగాహన మావోయిస్ట్ ఉద్యమానికి మొదటి నుండి ఉన్నట్లు, అందు కోసం పోరాటం చేస్తున్నట్లు పాణి చెప్పుకొస్తున్నారు. మరి అలాంటి వైఖరి ఉన్నవాళ్లు ఈ రాజ్యాంగాన్ని కూల్చేస్తామని ఎందుకంటారు? మరొక దగ్గర రాజ్యాంగంలోని సమానత్వ భావనకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న అభివృద్ధి విధానాల వల్ల దోపిడీ, పీడనలు పెరుగుతున్నాయని పాణి అంటారు. అటువంటప్పుడు రాజ్యాంగం విప్లవకరమైనదని చెబుతున్నట్లే కదా! కానీ మావోయిస్టుల సమర్థన కోసం మరలా ఇలా దోపిడీ, పీడనలు పెరగటానికి రాజ్యాంగంలోనే అవకాశాలు ఉన్నాయని, అలాంటి సమస్యల వల్లనే విప్లవోద్యమం పుట్టుకొచ్చిందని చెప్పటం ఎలా సరైనది అవుతుంది? నిజంగా నక్సల్బరీ ఉద్యమం భూ సమస్య కేంద్రంగా మొదలైందన్నది అందరికీ తెలిసిందే. భూ సమస్య అనేది పెట్టుబడిదారీ పూర్వ వ్యవస్థ తాలూకు అవశేషం. నిజంగా పెట్టుబడిదారీ పూర్వ వ్యవస్థ అయిన భూస్వామ్యం రద్దు లక్ష్యంగా వ్యవసాయక విప్లవం ఇరుసుగా భావించే వారికి ఈ బూర్జువా రాజ్యాంగం అడ్డు కాదు.

మావోయిస్టు పార్టీయే కాదు అన్ని కమ్యూనిస్టు పార్టీలు రాజ్యాంగాన్ని బూర్జువా రాజ్యాంగంగానే గుర్తిస్తున్నాయి. బూర్జువా రాజ్యాంగం పెట్టుబడిదారుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తుంది అనే దానిలో ఎవరికీ సందేహం లేదు. అందుకనే కమ్యూనిస్టులు మొదట్లో ఈ రాజ్యాంగాన్ని కూల్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. రాజ్యాంగం పట్ల మొదటి నుంచీ కమ్యూనిస్టులకు వ్యతిరేకత ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. అయినప్పటికీ కమ్యూనిస్టు పార్టీల వైఖరిలో ప్రస్తుత కాలంలో మార్పులు చూస్తున్నాం. అందువల్లనే వారు రాజ్యాంగ పరిరక్షణ అనే పిలుపులను ఇస్తున్నారు. కానీ మావోయిస్టులు ఇలాంటి పిలుపును ఇచ్చిన సందర్భం కానీ, దానికోసం వారి కార్యాచరణను కానీ మనం చూడం. కానీ ఇలాంటి వైఖరి వారు కలిగి ఉన్నట్లు, పోరాటం చేస్తున్నట్లు పాణి చెప్పుకొస్తున్నారు.

మావోయిస్ట్‌లు తాము ఎంచుకున్న సాయుధ పోరాటాన్ని మైదాన ప్రాంతాలలో ఉండి చేసే వీలులేని కారణంగానే గిరిజన ప్రాంతాలను ఆశ్రయించాల్సిన పరిస్థితికి నెట్టబడ్డారు. పాణి దీనికి సమర్థనగా 'నూతన ప్రజాస్వామిక విప్లవమంటే భూములు పంచడమే కాదు. అర్ధ భూస్వామ్యానికి, కార్పొరేట్ పెట్టుబడిదారీ విధానానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగే విస్తృత పోరాటం' అనే వ్యాఖ్యానాన్ని జోడిస్తున్నాడు. మరి అన్ని ఎమ్ఎల్ పార్టీలూ ఇదే లక్ష్యాన్ని కలిగి ఉన్నాయి కదా. మరి మావోయిస్టులకు ఎదురైన సమస్యలు వారికి ఎందుకు కలగటం లేదు. అంటే వారు ఏమీ పోరాటాలు చేయటం లేదనా? కేవలం మావోయిస్టులే చేస్తున్నారనా? నిజంగా కార్పొరేట్ హిందుత్వ ఫాసిజంకు వ్యతిరేకంగా మావోయిస్టులు పోరాటం చేస్తున్నట్టయితే వారు బలంగా ఉన్న ప్రాంతాల్లో బీజేపీ ఓడిపోవాలి కదా? అలా ఎందుకు జరగటం లేదు? వెనుకబాటు, ఆటవిక జీవనం కలిగిన గిరిజనులు చేస్తున్న పోరాటాన్ని వర్గ పోరాటంగా మార్క్స్ అసలు ఎక్కడైనా చెప్పాడా? అంటే గిరిజనులు ఎల్లాకాలం ఆటవిక జీవనంలోనే ఉండిపోవటాన్ని విప్లవంగా చెప్పాడా? అలా ఉండిపోవటమే సోషలిస్టు విప్లవ లక్షణం అవుతుందా? అలాగే అడవుల పరిరక్షణ, అక్కడున్న వనరుల సంరక్షణ కేవలం అమాయక గిరిజనుల బాధ్యత అవుతుందా? ఇందుకోసం సాయుధ పంథా ఎంచుకోవటం సరైనదేనా?

కమ్యూనిస్టు పార్టీలలోని వారి కార్యక్రమాన్ని చూసినా, కార్యాచరణ చూసినా విప్లవ లక్షణాలు ఏమీ కానరావు. వారి కంటే కూడా ఈ బూర్జువా రాజ్యాంగమే విప్లవకరంగా ఉంది. దీన్ని గుర్తించడంలో కమ్యూనిస్టులు మొదటి నుంచీ విఫలమే. అందువల్లనే ఈ రాజ్యాంగం కంటే కూడా 75 ఏళ్లు వెనుకబడిపోయారు.



వాస్తవానికి 1850లోనే ఇంటర్నేషనల్ కమ్యూనిస్టు లీగ్ 21 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు ఉండాలని, మంచి అభ్యర్థులను ఎన్నికల్లో నిలపాలని డిమాండ్ చేసింది. ఏ మాత్రం గెలవని చోట కూడా కమ్యూనిస్టు లీగ్ తన అభ్యర్థులు నిలపాలని మార్క్స్ చెప్పాడు. కమ్యూనిస్టు ఉద్యమ మూలకర్తలు ఇలా చెబుతున్నప్పటికీ దానికి భిన్నంగా సాయుధ పంథా ఆధారంగా ముందుకు సాగిపోవాలని పాణి సూచిస్తున్నారు. రాచరిక కాలం నాటి సాయుధ పోరాట పంథా పోయి ఎన్నికల్లో పాల్గొనే విధానం అమల్లోకి వచ్చి 175 సంవత్సరాలు దాటినప్పటికీ ఇంకా అదే పాత పంథా కొనసాగాలని పిలుపు ఇవ్వడంలో విప్లవ లక్షణం ఉన్నదా?

పాణి తన వ్యాసంలో అనేక చోట్ల విప్లవం, విప్లవోద్యమం అనే పదాలు వాడారు. నిజంగా మావోయిస్టులు ఏ రకంగా విప్లవకారులో, వారి కార్యక్రమంలోనూ కార్యాచరణలోనూ ఉన్న విప్లవ లక్ష్యాలు ఏమిటో వివరించగలరా? భూములు పంచటం అనే ఒక మాట తప్పించి మిగతా ఏ విషయాలలో వారు విప్లవకారులు? నిజానికి అన్ని కమ్యూనిస్టు పార్టీలలో వారి కార్యక్రమాన్ని చూసినా, వారి కార్యాచరణ చూసినా విప్లవ లక్షణాలు ఏమీ కానరావు. వారి కంటే కూడా ఈ బూర్జువా రాజ్యాంగమే విప్లవకరంగా ఉంది. అందుకనేగా మార్క్సిస్ట్ మేధావి ప్రభాత్ పట్నాయక్ 1950 రాజ్యాంగం అమలుతో భారతదేశంలో దీర్ఘకాలిక విప్లవం ప్రారంభమైందని అంటున్నాడు. దీన్ని గుర్తించడంలో మొదటి నుంచీ కమ్యూనిస్టులు విఫలమే! అందువల్లనే ఈ రాజ్యాంగం కంటే కూడా 75 ఏళ్లు వెనుకబడిపోయారు. ఇలాంటి వాళ్లు విప్లవకారులు ఎలా అవుతారో మరి.

■ ప్రొఫెసర్ పట్టా వెంకటేశ్వర్లు



విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు చొరవ చూపాలి
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తాం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

7

'రాజీవ్ యువ వికాసం'.. నిరుద్యోగుల్లో ఎన్నో ఆశలను రేపిన పథకం. లబ్దిదారులుగా ఎంపికై ఉపాధిని పొందవచ్చని నిరుద్యోగులు భావించారు. పథకం అమలు కోసం వేయికళ్లతో ఎదురుచూస్తూ వచ్చారు. అయితే ఈ పథకానికి ప్రభుత్వం ఆకస్మికంగా బ్రేకులు వేసింది. నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో పెట్టుబడి సాయం అందించి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని రూపొందించిన విషయం విధితమే. గత ఏప్రిల్ 15 వరకు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులను స్వీకరించింది. అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు అధికారులు దరఖాస్తులను సైతం వడపోశారు. అర్హతలున్నవారిని ఎంపిక చేసి, జూన్ 2న రూ.50వేల, రూ.లక్ష లోపు రుణాల లబ్దిదారులకు మంజూరు పత్రాలను ఇస్తామని ప్రకటించారు. అయితే ఏమైందో ఏమోగానీ, అకస్మాత్తుగా మంజూరు పత్రాల పంపిణీకి సర్కారు బ్రేక్ వేసింది. దీంతో రుణసాయం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు షాక్ గురయ్యారు. రాబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పథకం అమలుకు బ్రేక్ వేసినట్టు భావిస్తున్నారు. అదే నిజమైతే మరో రెండు నెలల పాటు 'వికాసం' అలికిడి వినిపించదన్నమాట.



- మంజూరు పత్రాల పంపిణీ నిలిపివేత
- రూ.50వేలు, రూ.లక్ష యూనిట్లకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని తొలుత నిర్ణయం
- జూన్ 2న మంజూరు పత్రాలు పంపిణీ చేస్తామని ప్రకటన
- అకస్మాత్తుగా పథకానికి బ్రేకులు వేసిన ప్రభుత్వం
- మంజూరైన యూనిట్ల కంటే ఎస్సీ, బీసీల్లో అర్హులే అధికం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,91,235 దరఖాస్తులు
- స్థానిక ఎన్నికల తర్వాత అమలు చేస్తారని అంచనా

ఆశలు గల్లంతు

రాజీవ్ యువ వికాసం అమలుకు సర్కారు బ్రేక్

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

రాజీవ్ యువవికాసం కింద రూ.50వేల నుంచి గరిష్టంగా రూ.4లక్షల వరకు రుణాలు అందించేందుకు నాలుగు గ్రేడ్లుగా విభజించి, రాయితీ ప్రకటించింది. రూ.50వేల వరకు 100శాతం రాయితీని ప్రకటించింది. అలాగే రూ.50,001 నుంచి రూ.లక్ష వరకు 90శాతం రాయితీని, రూ.1,00,001 నుంచి రూ.2లక్షల వరకు 80శాతం రాయితీ, రూ.2,00,001 నుంచి రూ.4లక్షల వరకు 70శాతం రాయితీతో రుణాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు స్వీకరించింది. దీంతో ఉమ్మడి వరంగల్ పరిధిలో 1,377రెవెన్యూ గ్రామాల నుంచి 1,91,235 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 49,276మంది దరఖాస్తులు చేసుకోగా, ఎస్టీల నుంచి 33,427, బీసీ కార్పొరేషన్ ద్వారా 95,479 దరఖాస్తులు వచ్చాయి. అలాగే ఈబీసీల నుంచి 2,806 దరఖాస్తులు, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 10,015 దరఖాస్తులు, క్రిస్టియన్ మైనార్టీల నుంచి 232 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా మహబూబాబాద్ జిల్లా నుంచి 48,702 దరఖాస్తులు రాగా, అతి తక్కువగా మంత్రి సీతక్క ప్రాతినిథ్యం వహిస్తున్న ములుగు జిల్లా నుంచి కేవలం 3,518 దరఖాస్తులే వచ్చాయి. వివిధ రకాల విచారణల అనంతరం లబ్ధిదారులను ఎంపిక చేసి అధికారులు ప్రభుత్వానికి పంపించారు.

మంజూరు పత్రాల పంపిణీకి బ్రేక్

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,91,235 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నుంచి జూన్ 9వ తేదీ వరకు ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇవ్వాలని, జూన్ 15వ తేదీ లోపు లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే తొలుత రూ.50వేలు, రూ.లక్ష లోపు రుణం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకే మంజూరు పత్రాలు అందిస్తారని అధికారులు తెలిపారు. జూన్ 2న మంజూరు పత్రాలు అందుకునే లబ్ధిదారుల జాబితాను కూడా కొన్ని జిల్లాల్లో అధికారులు సిద్ధం చేశారు. అయితే అనూహ్యంగా ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకాన్ని నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో నిరుద్యోగులు షాక్ గురయ్యారు. ప్రభుత్వం అందించే సాయం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. అయితే లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర అవకతవకలు జరిగినట్లుగా జరుగుతున్న ప్రచారంతోనే ప్రభుత్వం వెనకడుగు వేసినట్లుగా భావిస్తున్నారు. సిబిల్ స్కోర్ ఆధారంగా కూడా లబ్ధిదారులను ఎంపిక

ఉమ్మడి జిల్లాలో వచ్చిన దరఖాస్తులు

జిల్లా	ఎస్సీ	ఎస్టీ	బీసీ	ఈబీసీ	మైనార్టీ	క్రిస్టియన్	మొత్తం
వరంగల్	10,490	6,031	22,972	616	3,798	66	43,973
హనుమకొండ	13,608	1,624	23,782	598	2,494	68	42,174
జనగామ	8,679	3,787	15,757	447	981	48	29,699
మహ-బాద్	8,963	18,809	18,546	579	1,766	39	48,702
భూపాలపల్లి	6,877	2,338	12,567	522	855	10	23,169
ములుగు	659	838	1,855	44	121	01	3,518
మొత్తం	49,276	33,427	95,479	2,806	10,015	232	1,91,235

(మిగతా 6వ పేజీలో...)



మృతిచెందిన యువకులు

టైరు పేలి.. చెట్టును ఢీకొట్టి..

- కారు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు

6



సరోజన (ఫైల్)

ఆస్తి తగాదాలతో హత్య

- సవతి తల్లిని గొడ్డలితో నరికి చంపిన కొడుకు
- పెగడపల్లిలో దారుణం

6

హనుమకొండ కలెక్టర్‌గా స్నేహా శబరీష్

- సంగారెడ్డి కలెక్టర్‌గా ప్రావీణ్య బదిలీ



స్నేహా శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): హనమకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా స్నేహా శబరీష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. స్నేహా శబరీష్ ఇంతకుముందు హైదరాబాద్ జీహెచ్ఎంసీ అడిషినల్ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. కాగా, ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసిన పి.ప్రావీణ్య సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌గా చహత్ బాజ్‌పాయ్

- ప్రస్తుత కమిషనర్ అశ్విని కరీంనగర్ అదనపు కలెక్టర్‌గా బదిలీ



చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్‌గా చహత్ బాజ్‌పాయ్ నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పని చేస్తున్నారు. కాగా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌గా పనిచేస్తున్న అశ్విని తానాజీ వాకడేను కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థ)గా బదిలీ చేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. అశ్విని గ్రేటర్ వరంగల్ కమిషనర్‌గా గత ఏడాది మార్చి 14న వచ్చారు. నగరంలో స్మార్ట్‌సిటీ పనులతో పాటు నగరంలో వివిధ అభివృద్ధి పనులను నిర్వర్తించి తన మార్క్ చూపించారు. ఇక నూతన కమిషనర్‌గా వస్తున్న చహత్ బాజ్‌పాయ్ 2019లో సివిల్స్‌లో ఆల్ ఇండియా 59వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. శిక్షణ కాలం పూర్తి చేసిన తర్వాత నంద్యాల జిల్లా సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తూ గ్రేటర్ వరంగల్‌కు పోస్టింగ్‌పై వస్తున్నారు. ఆమె నేడో, రేపో విధుల్లో చేరుతారని తెలిసింది.

పాఠశాలల కళకళ

- సందడిగా మొదలైన విద్యాసంవత్సరం
- ఉత్సాహంగా తరలివచ్చిన విద్యార్థులు
- అందంగా ముస్తాబైన పాఠశాలల ప్రాంగణాలు
- పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేసిన కలెక్టర్లు



హనుమకొండ న్యూ శాయంపేట పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరం సందడిగా మొదలైంది. వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు గురువారం పునః ప్రారంభమయ్యాయి. ఊరువాడా, పట్టణం పల్లె అనే తేడా లేకుండా పిల్లలు దారుల వెంబడి బడి బ్యాగులతో పాఠశాలలకు తరలివెళ్లడం కనిపించింది. పాఠశాల ప్రాంగాణాలన్నీ కళకళలాడాయి. బడి బాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవాస ప్రాంతాల్లో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఉపాధ్యాయులు చేబూని పిల్లలను క్లాసుల్లోకి తీసుకెళ్లగా, మరికొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులకు పువ్వులు ఇస్తూ విద్యార్థులు పాఠశాలల్లోకి అడుగిడటం కనిపించింది. కాగా, ఈ ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేయగా వరంగల్ జిల్లాలో 13, హనుమకొండ జిల్లాలో 16 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ పాఠశాలలను ప్రారంభించారు.

వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద ఖిలా వరంగల్ మండలంలోని గుంటూరుపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేశారు. హనుమకొండ జిల్లాలో న్యూశాయంపేటలోని పోచంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ కావ్య, కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నోట్ పుస్తకాలు అందజేస్తుందన్నారు. అలాగే కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తుందన్నారు. వర్ధన్నపేట మండల పరిధిలోని పలు పాఠశాలల్లో డీఈవో జ్ఞానేశ్వర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేయగా, హనుమకొండలోని మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఈవో వాసంతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు.

కాళేశ్వరంపై సీబీఐ విచారణను కోరాలి..

- సూత్రధారులు, పాత్రధారుల పేర్లను బయటపెట్టాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ

రాంనగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి సీబీఐ విచారణను కోరాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కోరారు. కేంద్రంలో బీజేపీ పాలనకు 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీకే అరుణ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సీఎంలో కుర్చీలో ఎన్ని రోజులు ఉంటాడో తెలియదని, ఉన్నప్పుడే కాళేశ్వరం అవినీతిలో సూత్రధారులు, పాత్రధారుల పేర్లు బయటిపెట్టి విశ్వసనీయతను చాటుకోవాలన్నారు. ఎన్నికల్లో కేసీఆర్ అవినీతిని బయటపెట్టి జైలుకు తరలిస్తామని దొంగ మాటలు మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనని ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోందన్నారు. కాళేశ్వరం నిర్మాణంలో పనిచేసిన ఇంజనీర్ వద్ద రూ.200 కోట్లు పట్టుబడ్డాయని మీడియాలో చూశామని, దీనిని బట్టి కాళేశ్వరం నిర్మాణంలో ఎవరెవరికి ఎంత వాటా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. 3 పర్యాయాలు ప్రధాని మోదీని ఒప్పించి రాష్ట్రానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తుంటే.. అభివృద్ధికి కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నాడని సీఎం విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టాక దేశంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారులు, గ్రామీణ రహదారులు, రైల్వే మార్గాలు, ప్రాజెక్టులు రెండింతలుగా పెరిగాయన్నారు. రాష్ట్రంలో సుమారు 7,000 కిలోమీటర్ల మేరకు జాతీయ రహదారులు నిర్మించామన్నారు. భారతదేశ కీర్తిని ప్రపంచం నలుమూలలా చాటుతూ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచి, ఉగ్రదాడులకు సమాధానం చెప్పారన్నారు. వ్యాపారాలు పెట్టుకునే వారికి బాసటగా నిలిచారన్నారు.

2047 వరకు స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ అడుగులు వేస్తున్నారని అన్నారు. తొలుత ఆమె 11ఏళ్లలో చేసిన అభివృద్ధిపై ఏర్పాటు చేపిస ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి తిలకించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, కార్పొరేటర్లు చాడ స్వాతిరెడ్డి, గుజ్జుల వసంత, బైరి లక్ష్మి, రావుల కోమల నాయకులు కాశీప్రసాద్, కిషన్, సీతారాంనాయక్, దేవేందర్‌రెడ్డి, విజయ చందర్‌రెడ్డి, సంద్ర మధు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబెల్లిపైనే పోటీ చేస్తా..

- ఫోన్‌ట్యాపింగ్ నుంచి తప్పించుకోలేరు.. మంత్రిగా అక్రమాలకు పాల్పడ్డారు..
- టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి



వరంగల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎక్కడి నుంచి పోటీ చేసినా, తాను ఆయనపై అక్కడి నుంచే పోటీకి దిగుతానని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి స్పష్టం చేశారు. గురువారం హనుమకొండలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. అమెరికాలో స్థిరపడిన తాను.. ఎర్రబెల్లి చేసిన తప్పుల వల్లే రాజకీయాల్లోకి రావాల్సి వచ్చిందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజనతో పాటు మహిళలకు 33శాతం సీట్లు రిజర్వుడు అవుతాయన్నారు. పాలకుర్తి మహిళలకే రిజర్వుడు అవుతుందని, అక్కడి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పోటీ చేస్తారని తెలిపారు. ఎర్రబెల్లి ఎక్కడికి పారిపోయి పోటీ చేసినా తాను ఆయనపై పోటీ చేస్తానని తెలిపారు. వర్ధన్నపేట నుంచి ఎర్రబెల్లి పోటీకి దిగితే తాను రెడీ అన్నారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఎర్రబెల్లి జైలుకు వెళతారని చెప్పారు. తన ఫోన్‌లు కూడా ట్యాపింగ్‌కు గురయ్యాయని, ప్రభాకర్‌రావును పోలీసులు విచారిస్తున్నారని, త్వరలోనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఝాన్సీరెడ్డి అన్నారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. స్త్రీనిధి రుణాల గోల్‌మాల్ చేశారని, వీటిపై విచారణ జరుగుతోందని, త్వరలోనే ఎర్రబెల్లి జైలుకు వెళ్లాల్సి వస్తుందని ఝాన్సీరెడ్డి పేర్కొన్నారు.



రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పీసీ ఘోష్

రామప్పలో పీసీ ఘోష్ పూజలు

వెంకటాపూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేటలో గల చారిత్రక రామప్ప ఆలయాన్ని కాళేశ్వరం ప్రాజెక్టు కమిషన్ ఛైర్మన్ పీసీ ఘోష్ గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు, ఉద్యోగులు ఆయనను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఘోష్. రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకున్నారు. బోటులో విహరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పోలీసులను దుర్భాషలాడిన ముగ్గురు యువకులపై కేసు

వరంగల్ క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పోలీసులను దుర్భాషలాడిన ముగ్గురు యువకులపై కేయూ పోలీసులు కేసు నమోదు చేశారు. హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి కథనం ప్రకారం.. బుధవారం రాత్రి కేయూ జంక్షన్‌లో హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా సాయికుమార్ అనే యువకుడు పట్టుబడ్డాడు. యువకుడి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్న క్రమంలో తన స్నేహితులకు సమాచారం ఇచ్చాడు. సాయికుమార్ పిలుపుతో కేయూ జంక్షన్‌కు వచ్చిన రవీందర్, ఆరీఫ్ అనే యువకులు ట్రాఫిక్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగిస్తూ దుర్భాషలాడారు. కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేయూ పోలీసులు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు హనుమకొండ నుంచి ఆర్టీసీ బస్సు

హనుమకొండ టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని అరుణాచల గిరిప్రదక్షిణ చేయాలనుకునే భక్తుల కోసం హనుమకొండ నుంచి ఆర్టీసీ ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేసినట్లు వంగల్ ఆర్ఎం డి.విజయభాను గురువారం ప్రకటనలో తెలిపారు. హనుమకొండ నుంచి జూన్ 27న మధ్యాహ్నం 3గంటలకు బయలుదేరుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకంలోని విఘ్నేశ్వరుడి దర్శనం అనంతరం వెల్లూరులోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారి దర్శనం తర్వాత అరుణాచలేశ్వర స్వామి ప్రదక్షిణకు జూన్ 29న జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం సన్నిధి బీచుపల్లి హనుమాన్ ఆలయం దర్శనం అనంతరం హనుమకొండకు చేరుకుంటుందని తెలిపారు. ఒక్కొక్కరికి పెద్దలకు రూ.5వేలు, పిల్లలకు రూ.3500 ఆర్టీసీ సంస్థ టిక్కెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సదుపాయాన్ని భక్తులు వినియోగించుకోవాలని ఆర్ఎం కోరారు. పూర్తి సమాచారం కోసం సెల్ నెంబరు 9063407493, 7780565971, 9866373825, 9959226047 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్ క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. రాజీపడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండ్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ మొదలగు కేసుల్లో రాజీపడే అవకాశం ఉంటుందన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకొని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. న్యాయశాఖ ఇచ్చిన ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలోని పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వర్తించే కానిస్టేబుళ్లు, ఇతర పోలీసు సిబ్బంది రాజీపడదగిన కేసులను గుర్తించి ఇరు వర్గాలను పిలిపించి రాజీపడేటట్లు అవగాహన కల్పించాలన్నారు. రాజీకోసం ఎదురుచూసే వ్యక్తులు పోలీసు అధికారులను సంప్రదించాలన్నారు. దీనిద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందన్నారు.

సర్కారు బడుల్లో చిన్నారులకు విద్య

ప్రీప్రైమరీ స్కూళ్లను ప్రారంభించిన ప్రభుత్వం ● ఉమ్మడి జిల్లాలో 61 చోట్ల ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో తమ ఐదేళ్లలోపు చిన్నారులను చేర్పించాలన్న తల్లిదండ్రుల ఆశలను ప్రభుత్వం నెరవేర్చింది. విద్యా సంవత్సరం ప్రారంభం నాడే ఎంపిక చేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించేందుకు అనుమతులు మంజూరు చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంపిక చేసిన 61 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించారు. గత ఏడాది వరకు ప్రభుత్వ పాఠశాలల్లో 5 సంవత్సరాలు దాటిన పిల్లలకు మాత్రమే 1వ తరగతిలో ప్రవేశాలను కల్పించేవారు. ఇక ఈ ఏడాది నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. దీంతో ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెరగనున్నాయి. అన్ని ప్రాథమిక, ప్రాతమికోన్నత పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించాలని సర్వత్రా విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.

ఐదేళ్లు దాటని చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు లేకపోవడంతో చిన్నారులను తల్లిదండ్రులు వారికి దగ్గరున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించే వారు. తొలుత ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించాలని భావించింది. అయితే అక్కడ ఉపాధ్యాయ శిక్షణ పొందిన వారు లేకపోవడం, చిన్నారులకు విద్యను నేర్పించే అనుభవం అంగన్‌వాడి కార్యకర్తలకు లేకపోవడంతో ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లోనే ప్రీప్రైమరీ తరగతులను నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు కేంద్రప్రభుత్వ ఆధీనంలోని సమగ్ర శిక్ష అభియాన్ నుంచి నిధులు సమకూరనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో...

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ప్రస్తుతం 61 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు అనుగుణంగానే సంబంధిత జిల్లా విద్యాశాఖ యంత్రాంగం ఆయా పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ఏర్పాటుకు అన్ని చర్యలు చేపట్టి తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. వరంగల్ జిల్లాలో ఎంపీపీఎస్ స్వామిరావ్‌పల్లి, ఎంపీపీఎస్ లక్కమారిపల్లి, ఎంపీపీఎస్ తొగర్రాయి. ఎంపీయూపీఎస్ రేకంపల్లి, ఎంపీపీఎస్ రామతీర్థం, ఎంపీయూపీఎస్ లెంకలపల్లి, ఎంపీపీఎస్ లింగపురం, ఎంపీపీఎస్ కొండూరు, ఎంపీయూపీఎస్ గన్నారం, ఎంపీపీఎస్ కొత్తూరు, ఎంపీపీఎస్ బుర్హాన్‌పల్లి, ఎంపీపీఎస్ పైడిపెల్లి, జీపీఎస్ శంభునిపేటలో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభమయ్యాయి. హనుమకొండ జిల్లాలో ఎంపీపీఎస్ పరకాల, ఎంపీయూపీఎస్ మైలారం, ఎంపీయూపీఎస్ ప్రగతిసింగారం, ఎంపీపీఎస్ ఊరుగొండ, ఎంపీపీఎస్ సీతారాంపూర్, ఎంపీయూపీఎస్ రత్నగిరి, ఎంపీపీఎస్ మాణిక్యాపూర్, ఎంపీపీఎస్ కొప్పూర్, ఎంపీపీఎస్(ఎస్సీకాలని) ముల్కనూర్, ఎంపీపీఎస్ ముల్కనూరు, ఎంపీపీఎస్ బావుపేట్, ఎంపీపీఎస్ కేశవాపూర్, జీపీఎస్ గర్ల్స్ కాజీపేట, జీపీఎస్ గొల్లపల్లి, జీపీఎస్ పాలెం, జీపీఎస్ రాంనగర్. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎంపీపీఎస్ కూడురుపల్లి, ఎంపీయూపీఎస్ బోర్లగూడెం, ఎంపీపీఎస్ గర్మిల్లపల్లి, ఎంపీపీఎస్ టేకుమట్ల, ఎంపీపీఎస్ తిరుమలగిరి, ఎంపీపీఎస్ రేగొండ, ఎంపీపీఎస్ జగ్గయ్యపేట్, ఎంపీపీఎస్ పరశురాంపల్లి, ఎంపీపీఎస్ రంగరావుపల్లి, ఎంపీపీఎస్ కొండాపూర్, ఎంపీపీఎస్ గొర్లవీడు, ఎంపీపీఎస్ కొత్తపల్లి(ఎస్ఎం), ఎంపీయూపీఎస్ గుడాడ్‌పల్లి, ఎంపీపీఎస్ మహబూబ్‌పల్లి, ఎంపీపీఎస్ మంజూర్‌నగర్, ఎంపీపీఎస్ కొంపల్లి, ఎంపీయూపీఎస్ పుల్లూరురామయ్యపల్లి, ఎంపీపీఎస్ జంగేడు, ఎంపీపీఎస్ బెడ్డలోనిపల్లి, ఎంపీపీఎస్ సెగ్గంపల్లి, ఎంపీపీఎస్ ఫకీర్‌గడ్డ, ఎంపీపీఎస్ గడ్డిగానిపల్లి, ఎంపీయూపీఎస్ కాసీంపల్లి, ఎంపీపీఎస్ వేశాలపల్లి, ఎంపీపీఎస్ కమలాపూర్, ఎంపీపీఎస్ రాంపూర్, ఎంపీపీఎస్ ఎర్రయ్యపల్లి, ఎంపీపీఎస్ కృష్ణకాలనీ, ఎంపీపీఎస్ సుభాష్‌కాలనీ, ఎంపీపీఎస్ రామ్‌నాయక్‌తండ, ఎంపీపీఎస్ గుర్రంపేటలో ప్రారంభించగా ములుగు జిల్లాలో ఒకే ఒక్క స్కూలు ఎంపీపీఎస్ మంగపేటలో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభం అయ్యాయి.



రైలులో పరారైన దొంగ

కస్టడీ నుంచి తప్పించుకున్న దొంగ కోసం పోలీసుల గాలింపు

మట్టెవాడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పోలీసు కస్టడీ నుంచి పరారైన దొంగకోసం పోలీసులు బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా గాలిస్తున్నారు. నగరంలోని ప్రధాన జంక్షన్లలో గల సీసీ పుటేజీలను, వరంగల్ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో గాలించారు. బైక్ చోరీ కేసులో నిందితుడు కడిపికొండకు చెందిన కట్కూరి సాయికుమార్‌ను బుధవారం కాజీపేట పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ బి.జనార్దన్, కానిస్టేబుల్ సునీల్‌కుమార్‌లు వైద్య పరీక్షల నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తీసుకొచ్చారు. మొదటగా ఈసీజీ తీయించారు. అనంతరం టూడీ ఏకో పరీక్ష నిమిత్తం కాకతీయ మెడికల్ కళాశాలలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. తిరిగి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి నిందితుడు సాయికుమార్‌ను తీసుకొచ్చారు. రిపోర్టుల కోసం కానిస్టేబుల్ వెళ్లగా, మరో కానిస్టేబుల్ కస్టడీలో సాయికుమార్ ఉన్నాడు. ఈ క్రమంలో బాత్‌రూమ్‌కు వెళ్లొస్తానని చెప్పి కానిస్టేబుల్‌ను చేతితో నెట్టేసి ఎంజీఎం నుంచి పరార్ అయ్యాడు. సాయికుమార్‌ను పట్టుకోవడం కోసం పోలీసులు వెంబడించినా ఫలితం లేకుండా పోయింది. పోలీసులు వరంగల్ ప్రధాన కూడళ్లలో సీసీ పుటేజీలను పరిశీలించారు. సీసీ పుటేజీ ఆధారంగా ఎంజీఎం నుంచి వరంగల్ రైల్వేస్టేషన్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. బుధవారం రాత్రి రైల్వే స్టేషన్‌కు పోలీసులు చేరుకొని గాలిస్తుండగా పోలీసులను చూసిన సాయికుమార్.. విజయవాడ వైపు వెళుతున్న రన్నింగ్ రైలు ఎక్కి పరార్ అయ్యాడు. పోలీసులు వెంటనే మరో రైలులో ఖమ్మం, విజయవాడ వైపు వెళ్లినా నిందితుడి ఆచూకీ లభించలేదు. కాజీపేట, మట్టెవాడ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అతడి కోసం గాలిస్తున్నారు.

ప్రతీ అమావాస్యకు వీరభద్రస్వామికి అభిషేకం



భీమదేవరపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో ప్రతీ నెల అమావాస్యను పురస్కరించుకుని వీరభద్ర స్వామికి విశేష అభిషేకం, భద్రకాళి అమ్మవారికి చండీ హోమం నిర్వహించాలని సంకల్పించినట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. గురువారం కొత్తకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గ, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండేందుకు లోక కల్యాణార్థం అభిషేకాలు, చండీ హోమాలు నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారన్నారు. దీంతో ప్రతీ నెల అమావాస్యను పురస్కరించుకుని వీరభద్ర స్వామికి అభిషేకాలు, అమ్మవారికి చండీహోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఆర్థిక సమస్యలు, ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఈవో కిషన్‌రావు కోరారు.

కరీంనగర్-తిరుపతి మధ్య 8 ప్రత్యేక రైళ్లు

వచ్చే నెల 6 నుంచి 28 వరకు నడపనున్న దక్షిణమధ్య రైల్వే

గిర్మాజిపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 6 నుంచి 28వ తేదీ వరకు కరీంనగర్-తిరుపతి మధ్య 8 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 6 నుంచి 27 వరకు ప్రతీ ఆదివారం తిరుపతి నుంచి కరీంనగర్‌కు 4 ప్రత్యేక రైళ్లు(రైలు నెంబరు 02761) నడుస్తాయని చెప్పారు. అలాగే జూలై 7 నుంచి 28వ తేదీ వరకు ప్రతీ సోమవారం కరీంనగర్ నుంచి తిరుపతికి 4 ప్రత్యేక రైళ్లు(రైలు నెంబరు 02762) నడుస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రత్యేక రైళ్లు రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, మధిర, ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్, వరంగల్, జమ్మికుంట, పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లలో ఆగుతాయని తెలిపారు. తిరుపతి-కరీంనగర్ మధ్య ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా నడపనున్న ఈ రైళ్లను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పీజీ రెగ్యులర్ కోర్సుల రెండో సెమిస్టర్ ఫీజు గడువు 20

కేయూ క్యాంపస్ జూన్ 12, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర పీజీ కోర్సుల రెగ్యులర్ పరీక్షల ఫీజులు చెల్లించుకునేందుకు జూన్ 20 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా గడువు ఉందని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యలు గురువారం తెలిపారు. రూ.250 అపరాధ రుసుంతో జూన్ 26 వరకు ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. రెగ్యులర్, ఇంప్రూమెంట్, ఎక్స్ అభ్యర్థులందరూ పరీక్షల ఫీజులు చెల్లించుకోవాలని పేర్కొన్నారు.

రేపటి నుంచి జంతుశాస్త్ర విభాగంలో కార్యశాల

కేయూ క్యాంపస్ జూన్ 12, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగంలో జూన్ 13 నుంచి మూడు రోజుల పాటు కార్యశాల నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'హ్యాండ్స్ ఆన్ మ్యాలిక్యూలర్ డాగింగ్ అండ్ డ్రగ్స్ డిస్కవరీ టెక్నిసు' అనే అంశంపై జరిగే ప్రారంభ సదస్సుకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, కేయూ సైన్స్ విభాగాల డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు, జంతుశాస్త్ర విభాగం బీవోఎస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఈసం నారాయణ హాజరుకానున్నట్లు వెల్లడించారు. 13న ఉదయం 10 గంటలకు కేయూ జంతుశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో సదస్సు ప్రారంభం అవుతుందని వెల్లడించారు.



నర్సంపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

స్థానిక ఎన్నికలను నిర్వహించే ధైర్యం కాంగ్రెస్‌కు లేదు..

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే దమ్ము, ధైర్యం కాంగ్రెస్ పార్టీకి లేదని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. నర్సంపేట పట్టణంలో గురువారం బీఆర్ఎస్ శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, అందువల్లే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడానికి ఆలస్యం చేస్తోందని పేర్కొన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధే కనిపిస్తోందన్నారు. ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా బీఆర్ఎస్‌దే విజయం అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న జల దోపిడీపై ప్రజలు, రైతులు చైతన్యం కావాలని కోరారు. గోదావరి జలాలను ఆంధ్రప్రాంతానికి తరలించడానికి కాళేశ్వరంపై సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ కుట్రలు చేస్తోన్నారని ఆరోపించారు. తన గురువు చంద్రబాబు కోసం కాళేశ్వరంపై బురదజల్లే ప్రయత్నం ముఖ్యమంత్రి చేస్తున్నారని అన్నారు. ఆంధ్ర ప్రాంతంలో నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టు కోసం గోదావరి నీటిని లిఫ్టుచేయడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో కలిసి తెలంగాణలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులతో పాటు వరంగల్ జిల్లాను సస్యశ్యామలం చేసే దేవాదుల, సీతారామ, రామప్ప, పాఖాల, రంగాయచెరువు లాంటి ప్రాజెక్టులను ఎండబెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, నర్సంపేట పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, మాజీ మార్కెట్ ఛైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నల్లబెల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోతు సారంగపాణి, హింగె మురళి, బాల్నె వెంకన్న, కక్కెర్ల శ్రీనివాస్, గందె శ్రీనివాస్, రాజేశ్వరరావుతో పాటు వివిధ మండలాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆస్తి తగాదాలతో హత్య

● సవతి తల్లిని గొడ్డలితో నరికి చంపిన కొడుకు ● పెగడపల్లిలో దారుణం

హసన్‌పర్తి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆస్తి గొడవల్లో తనకు న్యాయం జరగడం లేదనే కోపంతో సవతి తల్లి(60)ని ఓ యువకుడు గొడ్డలితో నరికి చంపాడు. అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఈ ఘటన కాకతీయ యూనివర్సిటీ పోలీసుస్టేషన్ పరిధిలోని పెగడపల్లిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..

పెగడపల్లికి చెందిన చల్లా శ్రీనివాస్‌రెడ్డి మొదటి భార్యకు భూపాల్‌రెడ్డి, మరో ఇద్దరు కూతుళ్లున్నారు. శ్రీనివాస్‌రెడ్డి మొదటి భార్య 30 ఏళ్ల క్రితం మృతి చెందగా, సరోజన అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. సరోజనకి ఇద్దరు కూతుళ్ళు మంగ, మమత ఉన్నారు. శ్రీనివాస్‌రెడ్డికి 11 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో ఐదున్నర ఎకరాలు భూపాల్‌రెడ్డి, మూడు ఎకరాలు శ్రీనివాస్‌రెడ్డి, రెండున్నర ఎకరాలు సరోజన పంచుకున్నారు. భూపాల్‌రెడ్డి తన తండ్రి బాగోగులు చూసుకుంటూ తన ఐదున్నర ఎకరాల వ్యవసాయ భూమితో పాటు తల్లిదండ్రులకు సంబంధించిన ఐదున్నర ఎకరాల వ్యవసాయ భూమిని కూడా కౌలుకు దున్నుకుంటున్నాడు. భూపాల్‌కు భార్య శైలజతో పాటు ఇద్దరు కూతుళ్ల వున్నారు. ప్రస్తుతం వారు పెళ్లికి ఎదగడంతో శ్రీనివాస్‌రెడ్డి వారికి వివాహం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. సవతి తల్లి సరోజన ఇద్దరు కూతుళ్ళ ఆడ పిల్లలు కూడా పెళ్లికి ఎదిగి ఉన్నారు. ఈ క్రమంలో తండ్రి, సవతి తల్లి ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. పెళ్ళిళ్లు చేసుకొని వెళ్లిన కూతుళ్ళకు కూడా సవతి తల్లి తన వారసత్వ భూమిని దోచి పెడుతోందని, తనకు అన్యాయం చేస్తోందని భూపాల్‌రెడ్డి మదనపడేవాడని గ్రామస్తులు తెలిపారు.



రక్తపు మడుగులో సరోజన

ఈ క్రమంలోనే భూపాల్‌రెడ్డి కౌలు చేసుకుంటున్న సరోజనకు చెందిన రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమిని మరొకరికి కౌలుకు ఇవ్వడంతో సరోజన కూతుళ్ళు, భూపాల్‌రెడ్డి మధ్య ఆస్తి తగాదాలు మరింత రాజుకున్నాయి. బుధవారం రాత్రి మరోసారి జరిగిన గొడవలో మాటామాటా పెరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన భూపాల్‌రెడ్డి తన సవతి తల్లి సరోజనను గొడ్డలితో నరికి హత్య చేశాడు. అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. మృతురాలి సరోజన కూతుళ్ళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

ఈసెట్ ర్యాంకర్లకు అభినందనలు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ బ్రాంచీల్లో కోర్సులను పూర్తి చేసి ఈసెట్‌లో అత్యుత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ అభినందించారు. గురువారం కళాశాల ప్రాంగణంలో ఈసెట్‌లో రాష్ట్రస్థాయిలో టాప్ 20 ర్యాంకులు సాధించిన విద్యార్థులను అధ్యాపకబృందంతో కలిసి జ్ఞాపికలను అందించి అభినందించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థుల పట్టుదలకు, అధ్యాపకుల కృషికి ఈ ర్యాంకులు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాధిపతులు పాల్గొన్నారు.

వరంగల్ డీఈవోకు అక్షింతలు

తప్పుడు ఆదేశాల జారీ... ఉన్నతాధికారుల సీరియస్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ డీఈవో మామిడి జ్ఞానేశ్వర్‌కు సర్వశిక్ష అభియాన్ ఉన్నతధికారుల నుంచి బుధవారం రాత్రి అక్షింతలు పడినట్టు తెలిసింది. విద్యా సంవత్సరం ముందు రోజు ఆయన తీసుకున్న నిర్ణయమే ఇందుకు కారణం. జిల్లాలో పనిచేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్‌లను విధుల్లోకి తీసుకోవద్దంటూ ఎంఈవో, హెడ్మాస్టర్ల వాట్సాప్ గ్రూపుల్లో జ్ఞానేశ్వర్ వాయిస్ మెసేజ్ పంపించారు. వాస్తవానికి ఈ నెల 6వ తేదీనే వారిని పాఠశాలల ప్రారంభం రోజు రీ ఎంగేజ్ చేయాలని సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారు. కానీ దానికి విరుద్ధంగా వరంగల్ డీఈవో వాయిస్ రికార్డు రూపంలో ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లాలో పనిచేస్తున్న 63 మంది పీటీలు ఆందోళన చెంది సమగ్ర శిక్ష ఉన్నతాధికారులను సంప్రదించారు. ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని వారు స్పష్టం చేశారు. పీటీలను రీఎంగేజ్ చేసుకోవాలనే ఉత్తర్వులే తప్ప మరెలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని సమగ్ర శిక్షలోని ఓ ఉన్నతాధికారి కూడా స్పష్టం చేశారు. ఈ విషయం రాష్ట్రంలోని ఇతర జిల్లాల విద్యాశాఖ, ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ కావడంతో డీఈవో తీరును తప్పుబడుతూ సమగ్రశిక్ష ఉన్నతాధికారి ఫోన్‌లోనే అక్షింతలు వేసినట్లు తెలిసింది. దీంతో జిల్లాలో గత ఏడాది పనిచేసిన పీటీలను రీ ఎంగేజ్ చేసుకోవాలని మరోసారి సంక్షిప్త సందేశాలను వాట్సాప్ గ్రూపుల్లో పంపించారు.

టైరు పేలి.. చెట్టును ఢీకొట్టి..

కారు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

మరో ఇద్దరికి తీవ్రగాయాలు

మృతులు ఎల్‌బీనగర్, చింతల్ వాసులుగా గుర్తింపు



వసంతాపూర్ వద్ద టైర్ పేలడంతో చెట్టుకు ఢీకొని నుజ్జునుజ్జు అయిన కారు

గీసుగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఖిలావరంగల్ మండలం వసంతాపూర్ శివారులో కారు టైర్ పేలిన ఘటనలో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు అయ్యాయి. వరంగల్ ఎల్‌బీ నగర్‌కు చెందిన ఎమ్డీ. షోయబుద్దిన్(18), చింతల్‌కు చెందిన షేక్ అహ్మద్ (18) అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్‌బీ నగర్‌కు చెందిన షోయబుద్దిన్, సమీర్‌పాష, చింతల్‌కు చెందిన టేక్ అహ్మద్, జాన్‌పాకకు చెందిన ఇస్మాయిల్ నలుగురూ స్నేహితులు. వీరు సంగెం మండలం వెంకటాపూర్‌కు కారులో వెళ్లారు. అక్కడ పని ముగించుకొన్న అనంతరం వారు వసంతాపూర్ మీదుగా వరంగల్‌కు వస్తున్నారు. ఈ క్రమంలో గ్రామ సమీపంలో కారు వెనక టైర్ అకస్మాత్తుగా పేలి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొని పల్టీలు కొడుతూ పడిపోయింది. దీంతో కారులో వెనుక కూర్చున్న షేక్ అహ్మద్, అమీన్‌నుద్దిన్‌లు అక్కడికక్కడే మృతిచెందారు. ముందు కూర్చున్న సమీర్‌పాష, ఇస్మాయిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి ఎస్ఐ ప్రశాంత్ చేరుకొని ఘటన జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమా ర్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు.



షేక్ అహ్మద్ (ఫైల్)

పండ్ల తోటల పెంపకంతో పండగే



పండ్ల తోటల సాగులో భాగంగా పండించిన డ్రాగన్ ఫ్రూట్స్

- పైసా ఖర్చు లేకుండా ఈజీఎస్ ద్వారా సాగు
- మూడేళ్ల పాటు ఆర్థిక చేయూత
- జిల్లాలో 700 ఎకరాల్లో పెంపకమే లక్ష్యం
- ఇప్పటికే 370 ఎకరాలు గుర్తింపు
- డ్రాగన్ ఫ్రూట్‌కు యమ డిమాండ్
- ఉత్సాహంగా ముందుకు వస్తున్న రైతులు

హనుమకొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటలు సాగు చేయాలనుకునే రైతులకు తీపి కబురు. ఉపాధి హామీ పథకం కింద ఈ పంటల సాగుకు ప్రభుత్వం సాయం చేయనున్నది. ఇప్పటికే పలువురు రైతులు పంటలు సాగు చేస్తుండగా, సాగు లక్ష్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో పండ్ల తోటల పెంపకంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా పండ్ల ఉత్పత్తి జరగకపోవడంతో భారీగా ధరలు పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో నయాపైసా ఖర్చు లేకుండా పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. మార్కెట్లో పండ్లకు మంచి డిమాండ్ ఉండడంతో చాలా మంది రైతులు పండ్ల తోటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

ఈ నేపథ్యంలో అటువంటి రైతులకు ప్రభుత్వం ఆసరాగా నిలుస్తోంది. జాతీయ ఉపాధి హామీ పథకం కింద సాగు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పండ్ల తోటల పెంపకం పథకానికి జిల్లాలో మూడేళ్లుగా మంచి స్పందన లభిస్తోంది. సన్న, చిన్నకారు రైతులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. ప్రతీ మండలానికి గరిష్ఠంగా 50 ఎకరాల చొప్పున సాగు లక్ష్యాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులకు ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటికే చాలా మంది రైతులు సాగుకు ముందుకు వచ్చారు. ఈ యేడు జిల్లాలో 700 ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించారు.



రైతులు పెంచుతున్న సీతాఫలం మొక్కలు

భారీగా ప్రోత్సాహకాలు

ప్రభుత్వం పండ్ల తోటల సాగుకు భారీగా ప్రోత్సాహకాలను అందజేస్తోంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఉద్యానవన శాఖ, పంచాయతీరాజ్ శాఖ సహకారంతో, ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. ఉద్యానవన పంటల సాగుపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. సంప్రదాయ పంటల స్థానంలో పండ్ల తోటల పెంపకం వల్ల కలిగే లాభాలను గుర్తించిన రైతులు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నారు. వర్షాకాలం ప్రవేశించడంతో అర్హులైన రైతులను గుర్తించే పనిలో డీఆర్‌డీఏ అధికారులు ఉన్నారు.

గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద తోటల పెంపకం చేపడితే చిన్న, సన్నకారు రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. వరికి ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయం ఇచ్చే పండ్లు, ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈజీఎస్ ద్వారా రాయితీలు ప్రకటించింది. మామిడి తోటల సాగు, ఆయిల్ పామ్ తోటల పెంపకానికి ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. జిల్లాలో రైతులు డ్రాగన్ ఫ్రూట్ పెంపకానికి ఎక్కువ మొగ్గు చూపుతున్నారు.

పండ్ల మొక్కల ధరలు

ఉపాధి హామీ పథకంలో వివిధ రకాల మొక్కలకు నిర్ణయించిన మేరకు ధరలను రైతులకు చెల్లిస్తారు. మార్కెట్‌లో రైతులు తమకు నచ్చిన మొక్కలను కొనుగోలు చేసుకోవచ్చు. వాటి ధర ఎక్కువ ఉంటే ఆ మేరకు కొనుగోలు చేసినా ప్రభుత్వం నిర్ణయించిన ధరనే చెల్లిస్తుంది. మిగతాది రైతులే భరించాల్సి ఉంటుంది. రవాణా ఖర్చుతో కలుపుకొని మామిడికి రూ.50, సీతాఫలంకు రూ.60, చింతకు రూ.60, డ్రాగన్‌ఫ్రూట్‌కు రూ.45, నిమ్మకు రూ.30, జామాయిల్‌కు రూ.40. కరొండకు రూ.20, నేరేడు రూ.60, బత్తాయికి రూ.110, కొబ్బరికి రూ.70, దానిమ్మకు రూ.45, సపోటకు రూ.60, మునగకు రూ.25, జీడిమామిడికి రూ.24, పెద్ద రేగుకు రూ.51, పామాయిల్‌కు రూ.20 చొప్పున ఒక్కో మొక్కకు చెల్లిస్తారు. ఆయా పండ్ల తోటల పెంపకానికి ఒక ఎకరానికి మామిడి 70, బత్తాయి 100, సపోట 60, కొబ్బరి 110, జామ 110, డ్రాగన్ ఫ్రూట్ 900, సీతాఫలం 100, నిమ్మ 110, అల్లనేరేడు 40, దానిమ్మ 265, మునగ 1000, ఆయిల్ పామ్ 57 మొక్కలు అవసరమవుతాయి.



పొలం గట్లపై నాటిన కొబ్బరి మొక్కలు

పండ్ల తోటల పెంపకమే లక్ష్యం

జిల్లాలో ఈ ఏడు 700 ఎకరాల్లో ఉద్యానవన పంటలను సాగు చేయాలన్నది లక్ష్యం. ఇప్పటి వరకు 334.55 ఎకరాలను గుర్తించారు. ఇందుల్లో పండ్ల తోటలను పెంచేందుకు 174 మంది రైతులు ముందుకు వచ్చారు. మిగతా 365.45 ఎకరాలను త్వరలో గుర్తిస్తారు. ఆత్మకూరు మండలంలో 60 ఎకరాలు, భీమదేవరపల్లిలో 75 ఎకరాలు, దామెరలో 52 ఎకరాలు, ధర్మసాగర్‌లో 65 ఎకరాలు, ఎల్కతుర్తిలో 65 ఎకరాలు, హసన్‌పర్తిలో 50 ఎకరాలు, ఐనవోలులో 60 ఎకరాలు, కమలాపూర్‌లో 60 ఎకరాలు, నడికూడలో 50 ఎకరాలు, పరకాలలో 38 ఎకరాలు, శాయంపేటలో 75 ఎకరాలు, వేలేరులో 50 ఎకరాల్లో తోటలను పెంచాలన్నది లక్ష్యం.



మాణిక్యాపూర్ గ్రామంలో చేపట్టిన మామిడి తోటల పెంపకం

ఈజీఎస్ కింద..

ఈజీఎస్ కింద ఒక్కో ఉద్యానవన పంటకయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. మునగ ఒక ఎకరం, మిగతా పంటలకు అయిదేసి ఎకరాల వరకు సాగు చేసుకోవచ్చు. ఈజీఎస్ కింద కూలీల వేతనం, మెటీరియల్ కలుపుకొని మొత్తం ఖర్చు మునగ రూ.1,01,899, మామిడి రూ.64,864, జీడిమామిడి రూ.64,864, సపోట రూ.56,661, జామా రూ.38,996, ఆయిల్‌పామ్ రూ. 53,078, చింత రూ.38,996, కొబ్బరి బ్లాక్ రూ.1,25,127, కొబ్బరి బండ్ రూ. 48,173, బత్తాయి రూ.76,244, నిమ్మ రూ.81,306, జామ రూ.81,973, సీతాఫలం రూ.1,16,376, నారింజ రూ.1,89,258, ఆపిల్ బేర్ రూ.1,20,418, కొరండ బండ్ రూ.1,14,600, డ్రాగన్ ఫ్రూట్ రూ.2,69,129. పండ్ల తోటల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల పాటు సాయం అందించనున్నది. మూడేళ్ల తర్వాత పంట చేతికి వస్తుంది. చేతికి వచ్చిన పంటలను అమ్ముకోవడానికి మార్కెటింగ్ సౌకర్యాన్ని కూడా ప్రభుత్వమే కల్పిస్తుంది. పండ్ల తోటల పెంపకానికి సంబంధించి మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలు తవ్వేందుకు రూ 233.32, మొక్కలు నాటేందుకు రూ. 43.53 జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఆర్థిక సాయాన్ని అందజేస్తుంది. అలాగే మొక్కలు ఎదిగేలా నీటిని అందించేందుకు సైతం ఆర్థికంగా చేయూతనిస్తుంది.

ఎవరు అర్హులు అంటే ?

ఉపాధి కూలీలుగా నమోదు చేసుకున్న అయిదు ఎకరాల భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులు. ఉపాధి హామీ జాబ్ కార్డు తప్పనిసరి. జాబ్‌కార్డు లేనివారు కూడా ముందుకు వస్తే వారికి అధికారులు కార్డు ఇప్పిస్తారు. అయిదెకరాల్లోపు ఉన్న సన్నకారు రైతులు అర్హులు. ముఖ్యంగా సాగునీటి వసతి ఉండాలి. తోటలు పెంచేందుకు బిందు సేద్యంపై రాయితీ ఇస్తారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, మిగతా వారికి 90 శాతం రాయితీపై పరికరాలు ఇవ్వనున్నారు. పండ్ల తోటలను పెంచేందుకు ఆసక్తి ఉన్న రైతులు స్థానిక ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

'ఉపాధి హామీ'లో ఏ తోటలంటే..

ఉపాధి హామీ పథకంలో భాగంగా మామిడి, జామ, మునగ, సీతాఫలం, సపోటా, బత్తాయి, అల్లనేరేడు, నారింజ, ఆయిల్‌పామ్ తోటలు బ్లాక్ ప్లాంటేషన్, గట్లపై పెంచేందుకు నేరేడు, కొబ్బరి, చింత, సీతాఫలం తోటల పెంపకానికి రాయితీలు ఇవ్వనున్నారు. పండ్ల తోటల సాగు కోసం గుంతలు తీయడం, మొక్కల కొనుగోలు, వాటిని నాటడానికి ఊతకర్రలు కట్టడానికి, ఎరువులకు నెలనెలా పర్యవేక్షణకు మూడేళ్ల పాటు ఉపాధి హామీ పథకం నుంచి నిధులు ఇస్తారు. అలాగే ఆయిల్‌పామ్‌కు బిందు సేద్యం సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నది.

విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తాం
- గ్రామీణాభివృద్ధి, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- ఏటూరునాగారంలో రూ. 4.20 కోట్లతో బస్ డిపోకు శంకుస్థాపన

ఏటూరునాగారం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల భవనంలో నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, పాఠశాల యూనిఫామ్‌లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఏటూరునాగారం ప్రభుత్వ పాఠశాలకు ఇప్పటికే 10 కంప్యూటర్లను అందజేయడం జరిగిందని, రానున్న రోజుల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు మరో 150 కంప్యూటర్లు అందజేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆమె వెల్లడించారు.



విద్యార్థులకు యూనిఫామ్ అందిస్తున్న చేస్తున్న మంత్రి సీతక్క

గ్రామీణ ప్రాంతాలన్నింటికీ బస్సు సౌకర్యం

మారుమూల గ్రామీణ ప్రాంతాలన్నింటికీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకులవారి ఘణపురంలో రూ. 4 కోట్ల 20 లక్షల వ్యయంతో చేపట్టనున్న బస్ డిపో నిర్మాణ పనులకు ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, ఏఎస్పీ శివం ఉపాధ్యాయలతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఏటూరునాగారంలో బస్ డిపోతో పాటు రూ. 50 లక్షలతో మంగపేట మండలంలో బస్టాండ్ నిర్మాణం, కలెక్టరేట్‌కు వచ్చేవారి సౌకర్యార్థం ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ ప్రాంతంలో బస్టాండ్ మంజూరు చేసిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

గోవిందరావుపేట మండలం పసర సమీపం నుంచి ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని టేకులగూడెం వరకు రూ. 400 కోట్లతో జాతీయ రహదారి మంజూరైందని, త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు. ములుగు జిల్లా కేంద్రానికి సుమారు 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో బస్సు డిపోలు ఉన్నాయని, ఏటూరునాగారంలో బస్ డిపో ఏర్పాటు చేయడం ద్వారా ములుగుతో పాటు ఏటూరునాగారం డివిజన్ పరిధిలోని చుట్టుపక్కల గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడుతుందన్నారు. మంజూరైన బస్ డిపో, మంగపేటలో బస్టాండ్ నిర్మాణ పనులను మేడారం జాతర నాటికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ప్రజా ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని, ఇందిరమ్మ ఇళ్లను సైతం మహిళల పేరు మీదనే మంజూరు చేస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ గిరిజన భవన్‌లో ఏటూరునాగారం, తాడ్వాయి, కన్నాయిగూడెం, మంగపేట మండలాలకు చెందిన నిరుపేదలకు ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి మంజూరైన పత్రాలను మంత్రి అందజేశారు.

కార్యక్రమంలో ములుగు అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ, డీఆర్‌డీవో సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, ఆర్టీసీ ఆర్ఎం విజయభాను, డిప్యూటీ ఆర్ఎం కిరణ్, చీఫ్ ఇంజనీర్ భాస్కర్, ఐటీడీఏ ఏపీవో వసంతరావు, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడ చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, ఎమ్డీ. ముజామిల్, వావిలాల చిన్నఎల్లయ్య, ఎమ్డీ. గౌస్, ఖలీల్ ఖాన్, సరికొప్పుల శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే ఏటూరునాగారంలో 'అమ్మ మాట- అంగన్వాడీ బాట' కార్యక్రమాన్ని సీతక్క ప్రారంభించింది. చిన్నారులకు ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను అందించడమే లక్ష్యమని మంత్రి అన్నారు.

గిరిజన సంప్రదాయాలకు పెద్దపీట

» ఎమ్మెల్యే శ్రీహరి » సీతాతండాలో ట్రైబల్ మ్యూజియానికి స్థల పరిశీలన



సీతాతండాలో ట్రైబల్ మ్యూజియం కోసం స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

చిలుపూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం మండలంలోని దేశాయితండా పరిధి సీతాతండాలో ఏర్పాటు చేయనున్న గిరిజన ఆద్యకళా మ్యూజియం కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు, కళలను భావితరాలకు అందించడంలో మ్యూజియాలు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. మ్యూజియం ఆవశ్యకతను సీఎం దృష్టికి తీసుకెళ్లి అత్యధిక నిధులు మంజూరు చేయిస్తానన్నారు. డీపీఆర్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు చిన్నపెండ్యాలలో అగ్రిమాల్‌ను ప్రారంభించారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న 'అమ్మమాట - అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ జే తిరుమల్‌రావు, చిలుపూర్ గుట్ట దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పీ శ్రీధర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేశ్, పోలెపల్లి రంజిత్‌రెడ్డి, బొమ్మిశెట్టి బాలరాజు, మాజీ సర్పంచ్‌లు లింగారెడ్డి, సమ్మయ్య, దామోదర్, యాదవరెడ్డి, సంపత్‌కుమార్, నాయకులు రాజ్‌కుమార్, హరిబాబు, బుచ్చికొమురయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పీసీ ఘోష్ కమిషన్ ఎదుట కేసీఆర్ అబద్ధాలు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టి. శ్రీనివాసరావు

మహబూబాబాద్ టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత లోపంపై పీసీ ఘోష్ కమిషన్ ఎదుట మాజీ సీఎం కేసీఆర్ అన్ని అబద్ధాలే చెప్పారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. మహబూబాబాద్‌లోని వీరభవన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్న సమయంలో 'కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇంజనీర్‌ను నేనే... మేస్త్రీని నేనే'... అని చెప్పుకున్న కేసీఆర్... అది కూలిపోయే సమయంలో తనకేమీ సంబంధం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నిర్ణయం క్యాబినెట్‌ది... నిర్వహణ అధికారులదని చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రూ.లక్ష కోట్ల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసి కాళేశ్వరం నిర్మించారని తద్వారా ఎకరం భూమికి చుక్క నీరివ్వలేదని మండిపడ్డారు.

మావోయిస్టులు పంథా మార్చుకోవాలి

మావోయిస్టులు తమ పంథాను మార్చుకుని తుపాకి ద్వారా కాకుండా ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడాలని శ్రీనివాసరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. మావోయిస్టులు, కమ్యూనిస్టులు ఏకమై ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌తో అమాయక గిరిజనులను ఎన్‌కౌంటర్ పేరిట కాల్చి చంపుతున్నారని ఇది సరియైన విధానం కాదన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బీ విజయసారథి, జిల్లా సహాయ కార్యదర్శులు బీ అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, మామిండ్ల సాంబలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆశల గల్లంతు

(5వ పేజీ తరువాయి)

చేయడం వివాదంగా మారింది. రూ.50వేల రుణం తీసుకుంటే ప్రభుత్వం 100శాతం రాయితీ ఇస్తుంది. అలాంటప్పుడు సిబిల్ స్కోర్ ఎందుకని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. గరిష్ఠంగా రూ.4లక్షల రుణం తీసుకున్నప్పటికీ ప్రభుత్వం 70శాతం రాయితీ అంటే రూ.2.80లక్షల మాఫీ చేస్తుంది. ఇక బ్యాంకుకు చెల్లించాల్సింది కేవలం రూ.1.20లక్షలే. సిబిల్ స్కోర్ పేరుతో చాలామంది దరఖాస్తులు తొలగించినట్లుగా ప్రచారం జరుగుతోంది. ములుగు జిల్లాలో 3,518మంది దరఖాస్తు చేసుకుంటే.. వివిధ కారణాలతో 1,459మంది దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా ప్రతీ జిల్లాల్లో 30శాతం నుంచి 45శాతం వరకు దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. వీటితో పాటు గతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు తీసుకున్నప్పటికీ, తిరిగి వారిని కొన్ని చోట్ల అధికారులు ఎంపిక చేశారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగలేదని ప్రభుత్వం భావిస్తున్న క్రమంలోనే యువవికాసం ప్రొసీడింగ్స్ పంపిణీని నిలిపి వేసిందనే ప్రచారం ఉంది.

మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం భావిస్తోందని సమాచారం. వీటితో పాటుగా అత్యధికంగా దరఖాస్తులు 4వ గ్రేడ్‌లోని రూ.4లక్షల రుణం కోసం రావటం.. ఆ యూనిట్లు తక్కువగా ఉండటంతో లబ్ధిదారుల ఎంపిక సమస్యగా మారినట్లుగా తెలుస్తోంది. ఎమ్మెల్యేలపై గ్రేడ్-4 యూనిట్ల కోసం కేడర్ నుంచి ఒత్తిడి వస్తుండటంతో అధికారులకు సిఫార్సులు పెరిగినట్లుగా సమాచారం. దీంతో ఒకరికి ఇచ్చి, మరొకరికి ఇవ్వకుండా కేడర్ దూరమవుతుందనే ఆందోళనతో ప్రజాప్రతనిధుల నుంచి వ్యక్తమైనట్లుగా తెలిసింది. అన్ని పరిశీలించాలకే ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకం ప్రొసిడింగ్స్ పంపిణీ వాయిదా వేసిందనే చర్చ జరుగుతోంది.

స్థానిక ఎన్నికల కోసమే వాయిదా ?

జూలై, ఆగస్టు నెలల్లో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో యువవికాసం పథకం ద్వారా లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందనే ప్రచారం కూడా ఉంది. దరఖాస్తుల భారీగా రావటం.. యూనిట్లు తక్కువగా ఉండటంతో, రుణం అందని నిరుద్యోగ యువత నుంచి వ్యతిరేకత వస్తుందనే ఆందోళనలో ప్రభుత్వం ఉంది.

ఉదాహరణకు ములుగు జిల్లాలో బీసీల నుంచి 1,855మంది దరఖాస్తు చేసుకుంటే 102 యూనిట్లు మాత్రమే మంజూరయ్యాయి. ఎస్టీలు 838మంది దరఖాస్తు చేసుకుంటే 271 యూనిట్లే మంజూరు అయ్యాయి. రుణసాయం అందని నిరుద్యోగుల నుంచి వ్యతిరేకత వస్తుందనే ఆందోళన కాంగ్రెస్ నేతల్లో వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు రాజీవ్ యువవికాస్ పథకాన్ని నిలిపి వేయటమా? లేక మరిన్ని యూనిట్లను పెంచి అర్హులైన అందరికీ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా కార్యచరణ రూపొందించటమా? అనే దానిపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందనే ప్రచారం ఉంది.

భూగర్భ జలాల పెంపు భేష్

రాఘవపురం గ్రామాన్ని కేంద్ర బృందం సందర్శన



రాఘవపురం గ్రామంలో ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పాలకుర్తి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా పాలకుర్తి మండలం రాఘవపురం గ్రామాన్ని గురువారం కేంద్ర బృందం సందర్శించింది. కేంద్ర జలశక్తి పురస్కారాల కోసం దేశవ్యాప్తంగా గ్రామాలను పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా జనగామ జిల్లా పాలకుర్తి మండలం రాఘవాపురం గ్రామాన్ని కేంద్ర భూగర్భ జలవనరుల శాఖ శాస్త్రవేత్త పీ యాదయ్య, కేంద్ర నీటి కమిషన్ సబ్ డివిజనల్ ఇంజనీర్ డీ చైతన్య సందర్శించారు. పదేళ్లలో భూగర్భ జలాలను పెంచడానికి చేపట్టిన పనులను కేంద్ర బృందం పరిశీలించింది. గ్రామంలో అధికారులు జలశక్తి పురస్కారానికి ప్రామాణికమైన అంశాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా యాదయ్య, చైతన్య మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ నిధులతో 120 నీటి కుంటలు, 2 చెక్ డ్యామ్‌లు, 2 చెరువుల్లో మట్టి తీసి నీటి సామర్థ్యం పెరుగుదలకు చేపట్టిన అభివృద్ధి పనులు భేషుగ్గా ఉన్నాయన్నారు. దేశంలోనే 30 గ్రామాలను ఎంపిక చేశామని తెలంగాణలో జనగాం జిల్లా పాలకుర్తి మండలంలోని రాఘవాపురం గ్రామం ఎంపికైనట్లు తెలిపారు. గ్రామంలో వంద శాతం ఇంకుడుగుంతలు, వంద శాతం మరుగుదొడ్లు నిర్మాణం పూర్తయిన గ్రామం అని దీనిని పరిశీలించేందుకు సందర్శించామని పేర్కొన్నారు. గ్రామంలో చేపట్టిన ప్రతీ అంశాన్ని పరిగణనలోకి తీసుకొని పరిశీలించామని తెలిపారు. నివేదికను కేంద్ర భూగర్భ జలవనరుల శాఖకు అందజేస్తామని తెలిపారు. వారి వెంట డీఆర్‌డీవో పీడీ వసంత, ఎంపీడీవో ఆవుల రాములు, ఏపీవో మంజుల, ఎంపీవో రవీందర్, కార్యదర్శులు కే వెంకటేశ్వచారి, యుగేందర్, శిరీష, మహేందర్, మహేశ్, లింగయ్య, ప్రియాంక తదితరులు ఉన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్ (ఆంధ్రజ్యోతి): కేంద్ర జలశక్తి అభియాన్ పథకంలో భాగంగా అమలు అవుతున్న వివిధ పనులను జలశక్తి అభియాన్ టీమ్ సభ్యుడు, శాస్త్రవేత్త వెంకటగిరి గురువారం అక్కపల్లిగూడెం, రంగరాయగూడెం, ఇప్పగూడెం, మీదికొండ గ్రామాల్లో పర్యటించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా భూగర్భ జలాలను పెంచడంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇంకుడుగుంతలు, కమ్యూనిటీ సోఫిట్, మాజిక్ సోఫిట్, లూజ్, బోల్డ్ స్ట్రక్చర్స్, గ్యాబిన్ స్ట్రక్చర్లు, చెక్ డ్యామ్ పనులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయశ్రీ, ఎంపీవో నర్సింగరావు, సెక్రటరీలు భరత అవినాష్, నరేష్, ఇర్ఫాన్, వాటర్‌షెడ్ ప్రాజెక్టు అధికారి వీరన్న, ఏపీవో ప్రేమయ్య, టీఏ జాంబ, ఫీల్డ్ అసిస్టెంట్ మందపురం కవిత తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన ట్రెయినీ ఐఏఎస్‌లు

మహదేవపూర్/ మహదేవపూర్ రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో 2024 బ్యాచ్ ట్రెయినీ ఐఏఎస్‌లు గురువారం పర్యటించారు. ముందుగా కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాళేశ్వర అంతరాష్ట్ర వంతెనను పరిశీలించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్‌ను సందర్శించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీని సందర్శించారు. ఈ బృందంలో సౌరబ్ శర్మ, సలోని చోబ్రా, హర్ష చౌదరి, కెరోలిన్, చింగ్తయానమావి, కొయ్యడ ప్రణయ్ కుమార్‌తో పాటు మహదేవపూర్ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, లైసన్ ఆఫీసర్ అబ్బాస్, కోర్సు డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న ట్రెయినీ ఐఏఎస్‌ల బృందం

పేదల గుడిసెలు తొలగించవద్దు

హనుమకొండ చౌరస్తా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : హసన్‌పర్తి వద్ద ఎస్సారెస్పీ స్థలానికి అనుకొని ఏళ్లుగా నివాసముంటున్న పేదల గుడిసెలు తొలగించవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూలీ పనులు, చేతి వృత్తులు చేసుకుంటూ ఇంటి కిరాయిలు కట్టలేని స్థితిలో ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలను ఖాళీ చేయాలని ఎస్సారెస్పీ అధికారులు, సిబ్బంది భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడి పేదల గుడిసెలు తొలగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

రైల్వే స్టేషన్‌లో తనిఖీ

కాజీపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాజీపేట జంక్షన్‌లో గురువారం రైల్వే సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. సౌత్ వెస్టర్న్ రైల్వే అధికారులు గురువారం కాజీపేటకు చేరుకుని రైల్వే ట్రాక్‌లు, ఆర్ఆర్ఐ, క్రూలాబీ, సిగ్నలింగ్ సిస్టమ్ పై క్షుణ్ణంగా పరిశీలించారు. రైల్వేలో సేఫ్టీ సిస్టమ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని ఉద్యోగులకు సూచించారు.



అంబేద్కర్ భవన్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

'ఆపద మిత్ర'లు సహాయకరంగా ఉండాలి

వడ్డెపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆపదలో ఉన్నవారికి ఆపద మిత్ర వలంటీర్లు సహాయం చేయడాన్ని బాధ్యతగా స్వీకరించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. గురువారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా అగ్ని మాపక శాఖ ఆధ్వర్యంలో 12 రోజుల పాటు నిర్వహించిన ఆపద మిత్ర వలంటీర్ల శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రావీణ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. తమ చుట్ట పక్కల ఉన్న ప్రాంతాల్లో ఆపద మిత్ర వలంటీర్లు ఏవైనా అనుకోని విపత్తులు, ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు. వలంటీర్లు ఎంతో మంది జీవితాలను మార్చగలరనే నమ్మకం ఉందన్నారు. ప్రకృతి విపత్తులే కాకుండా రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు బాధితులకు సహాయం చేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమని అన్నారు. ఆపద మిత్ర వలంటీర్లు సమాజానికి ఉత్తమ సేవలు అందించాలని పిలుపునిచ్చారు. పాము కాటు, కుక్కకాటు గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వలంటీర్లకు ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి నాగరాజు, నెహ్రూ యువకేంద్ర డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల, పరకాల మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా మేనేజర్ జయశ్రీ, సైకాలజిస్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఆపద మిత్ర వలంటీర్లకు సర్టిఫికెట్లు, ఐడీ కార్డులను కలెక్టర్ చేతులమీదుగా పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న సుందరకాండ నృత్య రూపకం



సుందరకాండ నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

హనుమకొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో గురువారం నృత్యోత్సవం కనులపండువగా జరిగింది. నాట్య గురువు బొంపెల్లి సుధీర్‌రావు నేతృత్వంలో నడుస్తున్న సద్గురు శివానంద నృత్యమాల, భాషా, సాంస్కృతిక శాఖ సంయుక్తాధ్వర్యంలో జరిగిన ఈ నృత్యోత్సవాన్ని వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ప్రారంభించారు. మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, సద్గురు శ్రీ శివానంద నృత్యమాల, శివానంద కల్చరల్ ట్రస్ట్ అధ్యక్షుడు, ప్రముఖ చార్టర్డ్ ఎకౌంటెంట్ త్రిపురనేని గోపీచంద్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. శివానంద నృత్యమాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువు బొంపెల్లి సుధీర్ రావు నేతృత్వంలో ఆయన శిష్యబృందం ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో సుందరకాండను ఇతి వృత్తంగా తీసుకొని ఒక ప్రత్యేక నృత్య విభావరిని ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. శాస్త్రీయ నృత్యకళలకు జీవంపోసి వాటిని పదికాలాల పాటు బతికించేందుకు కృషి చేస్తున్న శివానంద నృత్యమాలను, ఈ పాఠశాల వ్యవవస్థాపకుడు బొంపెల్లి సుధీర్‌రావును అభినందించారు. మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. కళలకు కాణాచి వరంగల్ అని, ఆ పేరును సద్గురు శివానంద నృత్య మాల నిలబెడుతోందని అన్నారు. కళాభిమానులతో కాళోజీ కళా క్షేత్రం కిక్కిరిసి పోయింది.

సుజనహిత చిట్‌ఫండ్స్ వార్షికోత్సవం



సుజనహిత సంస్థ చైర్మన్ బండారి శేఖర్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎండీ గుడిపాటి జనార్ధన్, ఉద్యోగులు

వడ్డెపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని సుజనహిత చిట్‌ఫండ్స్ 6వ వార్షికోత్సవాన్ని గురువారం సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ చైర్మన్ బండారి శేఖర్‌గౌడ్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరేళ్ల నుంచి ఖాతాదారుల పొదుపులో విశ్వసనీయ భాగస్వామిగా ఉంటూ వారి ఆర్థిక అవసరాలను తీరుస్తూ నమ్మకంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. రాబోయే కాలంలో కూడా ఖాతాదారులకు నమ్మకంగా ఉంటూ వారి ఆర్థిక లక్ష్యాలను సాధించడంలో తోడ్పాటు అందిస్తామని పేర్కొన్నారు. తమ సంస్థ ఖాతాదారులకు సకాలంలో ప్రైజ్ మనీ అందిస్తూ, పారదర్శకంగా, నిబద్ధతతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఏడో వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఖాతాదారులకు, మార్కెటింగ్ మిత్రులకు, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గుడిపాటి జనార్ధన్‌తో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పుస్తకాలు విక్రయించొద్దు

ఎంఈవో బండారు మనోజ్‌కుమార్

మడికొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్ విక్రయించరాదని కాజీపేట మండల విద్యాశాఖాధికారి బండారు మనోజ్‌కుమార్ తెలిపారు. గురువారం మడికొండలోని ఏకశిల ఉన్నత పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తున్న సమాచారం మేరకు ఎంఈవో పాఠశాలకు వెళ్లి పుస్తకాలు నిల్వ ఉంచిన గదికి తాళం వేసి యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో పుస్తకాలు, ఇతర వస్తువులు విక్రయించడం చట్టవిరుద్ధమని, ఎవరైనా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు.

వంద రోజుల ప్రణాళికను జయప్రదం చేయాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- నగరంలోని పలు డివిజన్లలో పర్యటన

వరంగల్ కార్పొరేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మున్సిపాలిటీల పరిధిలోని పలు ప్రాంతాల్లో శుభ్రత, పరిశుభ్రత ప్రధాన లక్ష్యంగా చేపట్టిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాలు జయప్రదం చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. గురువారం బల్దియా పరిధిలోని 43వ డివిజన్ రంగశాయిపేట, సత్యనారాయణ కాలనీలలో ఉదయం పర్యటించారు. శానిటేషన్ సిబ్బందితో కలిసి కాలనీలలో కమిషనర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కాలనీలో నివసించే ప్రజలు తడి- పొడి చెత్తను వేరు వేరుగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ అరుణ విక్టర్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, శానిటరి సూపర్‌వైజర్ పసునూరి భాస్కర్, శానిటరి ఇన్‌స్పెక్టర్ ఈసం శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కాజీపేటలో 'స్వనిధి సే సమృద్ధి' కార్యక్రమం

గ్రేటర్ వరంగల్ నగర పాలక పరిధిలోని కాజీపేట కమ్యూనిటీ రిసోర్స్ సెంటర్ (సీఆర్‌సీ)లో గురువారం నిర్వహించిన 'స్వనిధి సే సమృద్ధి' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హజరై మాట్లాడారు. ఈ నెల 9 నుంచి 14 వరకు వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా స్ట్రీట్ వెండర్స్‌తో పాటు వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా టీబర్ కార్డులు, రేషన్ కార్డులతో పాటు వివిధ స్కీంలు గురించి ప్రతీ నెల రెండోవారంలో డివిజన్‌లవారిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, డీసీఎం రజితారాణి, ఏడీ ఎంసీ వెంకటరెడ్డి, సీవోలు రమేష్, శ్రీనివాసులు, శ్రీలతతో పాటు టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులు, చిరువ్యాపారులు పాల్గొన్నారు.



కాజీపేట కమ్యూనిటీ హాల్ వద్ద మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని

ఒత్తిడి తగ్గింపునకు క్రీడలు దోహదం

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి
- విద్యుత్ ఉద్యోగుల క్రీడల ప్రారంభం

రాంనగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడి తగ్గింపునకు క్రీడలు దోహదపడుతాయని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. స్పోర్ట్స్ కౌన్సిల్ వరంగల్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్‌లకు సంబంధించిన ఇంటర్ సర్కిల్ కబడ్డీ, బాల్ బాడ్మింటన్ పోటీలను గురువారం జేఎన్ఎస్ స్టేడియంలో సీఎండీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించడంలో భాగంగా ఒత్తిడి తగ్గించుకోవడానికి ఆటలు ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. ఈ క్రీడల ద్వారా విద్యుత్ శాఖ ఉద్యోగుల మధ్య స్నేహ పూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఉద్యోగులు సోదరభావంతో ముందుకెళ్లాలన్నారు. అనంతరం క్రీడాకారులను సీఎండీ పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుపతి రెడ్డి, హనుమకొండ ఎస్ఈ, స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ టి. మధుసూదన్‌రావు, డీఈ టెక్నికల్ విజేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎన్. జగన్నాథ్, ట్రెజరీ సంతోష్, కౌన్సిల్ మెంబర్స్ యాకూబ్ పాష, సునిల్‌కుమార్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లను రిలీజ్ చేయాలి

ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లను యుద్ధ ప్రతిపాదికన రిలీజ్ చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ కార్పొరేట్ కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలతో సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లకు సర్కిళ్ల వారిగా మెటీరియల్‌ను అందుబాటులో పెట్టామని, త్వరితగతిన మంజూరు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఉండేటట్లు చూడాలన్నారు. కొత్త సబ్‌స్టేషన్ల పనులు వేగవంతం చేయాలన్నారు. పట్టణాల్లో ఎక్కడైతే 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల అవసరం ఉన్నాయో.. దానికి సంబంధించిన ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. బ్రేక్‌డౌన్స్, ట్రిప్పింగ్స్ లేకుండా ప్రతీ నెల ఫీడర్ల నిర్వహణ చేపట్టాలన్నారు. 33 కేవీ అండ్ 11 కేవీ స్తంభాలకు యూనిక్ పోల్ నంబర్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు సదర్‌లాల్, మధుసూదన్, సీఈ రాజ్ చౌహాన్, జీఎంలు ఉత్తమ్, సురేందర్, డీఈ అనిల్‌కుమార్, ప్రభావతి పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

పెన్షన్‌ను వెంటనే విడుదల చేయాలి

రాష్ట్ర పెన్షనర్ల సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు వీరస్వామి

వడ్డెపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు నిలిపివేసిన పెన్షన్లను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు గుండా వీరస్వామి, జిల్లా అధ్యక్షుడు ఇ. నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌస్ రోడ్డులోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా పెన్షనర్ల సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. 85 ఏళ్లు దాటిన పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు స్వయంగా ఇచ్చినప్పటికీ, మీ సేవా ప్రభుత్వ యాప్ ద్వారా సమర్పించినప్పటికీ ఫిజికల్ వెరిఫికేషన్ కోసం ఆఫీసుకు రాలేదని, ఫోన్, వీడియో కాల్ ద్వారా వెరిఫికేషన్‌కు అందుబాటులో లేరని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పెన్షన్లు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్లు ఎన్నో ఆర్థిక బాధలను ఎదుర్కొంటున్నారని అన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పురుషోత్తం రావు, నాయకులు సమ్మారెడ్డి, సింగారెడ్డి, కిష్టయ్య, ఆగయ్య, చంద్రశేఖర్‌రావు పాల్గొని మాట్లాడారు.

ఉద్యోగాలు సాధించాలి

కేయూ క్యాంపస్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి ఉద్యోగాలను సాధించాలని సుబేదారిలోని వర్సిటీ మహిళా పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సుంకరి జ్యోతి ఆకాంక్షించారు. గురువారం కేయూ మహిళా పీజీ కళాశాలలో విద్యార్థులకు మ్యాజిక్ బస్ ఇండియా సహకారంతో 7 రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ జ్యోతి మాట్లాడారు. కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు సాధించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతోందని చెప్పారు. విద్యార్థులు మంచి నైపుణ్యాలు పెంచుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు. త్వరలోనే కళాశాలలో ప్రాంగణ నియామకాలు చేపడుతామని అన్నారు. కళాశాల ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. కళాశాల ఎంబీఏ, ఎంసీఏ, ఎంఏసీ కంప్యూటర్స్ చదివిన విద్యార్థులకు లాంగ్వేజ్, కమ్యూనికేషన్ స్కిల్స్ మాక్ ఇంటర్వ్యూ, డిసిషన్ మేకింగ్ స్కిల్స్ రెస్యూమ్ రైటింగ్ నైపుణ్యాలను కల్పించారని చెప్పారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందచేసి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు 'ఓబీసీల పోరుబాట' పుస్తకావిష్కరణ

వడ్డెపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, హైకోర్టు న్యాయవాది పృథ్వీరాజ్‌సింగ్ సంయుక్తంగా రచించిన 'ఓబీసీల పోరుబాట' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఈ నెల 14న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు వర్సిటీ ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఆవిష్కరించనున్నట్లు బీసీ జన అధికార సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పద్మజాదేవి తెలిపారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఓబీసీల పోరుబాట పుస్తకానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆలయ ఫౌండేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు పరికిపండ్ల వేణు, బీసీ నేతలు బి.కనకలక్ష్మి, నాయిని సరస్వతిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీలు ఈటల రాజేందర్, ఆర్ కృష్ణయ్య, ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, దాసోజు శ్రవణ్, ఎమ్మార్పీఎస్ అధినేత మంద కుమార్ మాదిగ తదితరులు హాజరవుతారని వరంగల్ ఉమ్మడి జిల్లాలోని బీసీ నేతలు రాజకీయాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీసీ నేతలు హైమావతి, భార్గవి, భవాని, రాధిక, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పురుషోత్తమచార్య సేవలు అమూల్యం



స్మారక పురస్కారాన్ని స్వీకరిస్తున్న సింగారాచార్య

హనుమకొండ కల్చరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉభయ వేదాంత పండితుడిగా శైష్ణవ సంప్రదాయ పరిరక్షకుడిగా భవిష్యత్ తరాలకు సంప్రదాయ విషయాలను తన రచనల ద్వారా అందజేసిన సముద్రాల పురుషోత్తమచార్య సేవలు అమూల్యమని వక్తలు కొనియాడారు. గత జూలై 9న అనారోగ్యంతో మృతి చెందిన ఎక్సైజ్ కాలనీ వెంకటేశ్వర ఆలయ స్థానచార్యుడు పురుషోత్తమచార్య 90 వసంతాల జయంతి (తిరుక్షతోత్సవం) గురువారం వెంకటేశ్వర ఆలయంలో వైభవంగా జరిగాయి. కాలనీ వాసులతో పాటు పెద్ద సంఖ్యలో ఇతర ప్రాంతాల నుంచి కూడా వైష్ణవ పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా నర్సాపురానికి చెందిన టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు సంచాలకుడిగా పని చేసిన పండిత రత్న, దివ్య ప్రబంధ వ్యాఖ్యన చతురినిగా పేరు గడించిన ఇప సింగారాచార్య స్వామికి పురుషోత్తమచార్య తొలి స్మారక ధార్మిక పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఉభయ వేదాంత పండితులు కండ్లకుంట శ్రీనివాసచార్య సముద్రాల శఠగోపాచార్య, హైదరాబాద్‌కు చెందిన గోవర్ధనం స్వామినాథచార్య, లక్ష్మణచార్య తదితర అనేక మంది ప్రముఖులు స్థానికులు పురుషోత్తమచార్య సేవలను ఆలయ అభివృద్ధిలో ఆయన పాత్రను మననం చేసుకున్నారు. రామచంద్రంమూర్తి, కృష్ణమూర్తి, వంశీకృష్ణమాచార్య, సుధీర్, యాదమ్మ, మాధవి తదితర కుటుంబ సభ్యులు, స్వామివారి శిష్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కేయూ క్యాంపస్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ప్రాంతంలోని అనుమతి లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. హనుమకొండ ఎంఈవో కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా స్టాలిన్, మంద శ్రీకాంత్‌లు మాట్లాడుతూ.. హనుమకొండ ప్రాంతంలో అనుమతిలేని పాఠశాలలను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. నగరంలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా పుట్టగొడుగుల్లా వస్తున్నాయని అన్నారు. అనుమతి లేని పాఠశాలల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు సాయికుమార్, అభిషేక్, ప్రదీప్, రూపేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడికి రూ.3.5 లక్షల ఎల్‌వోసీ అందజేత

మడికొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మడికొండకు చెందిన దువ్వ శ్రీనివాస్-లలిత కుమారుడు దువ్వ గణేష్ చెవి సంబంధిత సమస్యతో ఇబ్బంది పడుతూ హైదరాబాద్‌లోని ఈఎన్‌టీ ఆస్పత్రిలో చేరాడు. విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తక్షణమే స్పందించి బాలుడి చికిత్స కోసం రూ.3.5లక్షలు ఎల్‌వోసీ మంజూరు చేయించారు. గురువారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో ఎల్‌వోసీని బాధితుడి తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కాంగ్రెస్ నాయకులు కుర్ల మోహన్, వస్కుల శంకర్, బైరి లింగమూర్తి, వస్కుల నాగరాజు తదితరుల పాల్గొన్నారు.

అహ్మదాబాద్ విమాన దుర్ఘటన బాధాకరం

హనుమకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి బయల్దేరిన ఎయిర్ ఇండియా విమానం గురువారం కూలిపోవడంపై మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. విమాన ప్రమాదంలో మృతిచెందిన ప్రయాణికులు, సిబ్బంది, వైద్య కళాశాల విద్యార్థుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను కోరారు.

సోమిడిలో పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

కాజీపేట (ఆంధ్రజ్యోతి) : కాజీపేట సోమిడి మంతుర్తి ఐలయ్య కాలనీలో గురువారం పైప్‌లైన్ పనులకు స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీరజాలీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ.. తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా నూతన పైప్‌లైన్ నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. వివిధ కాలనీలలో పైప్ లైన్ లీకేజీలు అరికట్టేందుకు నూతన పైప్‌లైన్ పనులు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానికులు మంతుర్తి తిరుపతి, నీలక్క, దాస్, రఫీ, సురేశ్, నాగరాజు, రవి, రాము, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత డివిజన్ కోసం పాటుపడాలి

హనుమకొండ చౌరస్తా (ఆంధ్రజ్యోతి): 10వ డివిజన్‌ను ప్లాస్టిక్ రహిత డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో హనుమకొండ 10వ డివిజన్ ఉబిలిబేస్‌లో చేపట్టిన 100రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమ ర్యాలీలో వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరుతూ వెంకటేశ్వర్లు జీడబ్ల్యూఎంసీ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుమార్, సతీష్, జాఫర్‌ఖాన్, జీడబ్ల్యూఎంసీ జవాన్లు భూపతి రమేష్, బొజ్జ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పలు డివిజన్లలో 'అమ్మ మాట- అంగన్‌వాడీ బాట'

వడ్డెపల్లి (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ 60వ డివిజన్‌లోని హనుమకొండ ప్రాజెక్టు పరిధిలో గల వడ్డెపల్లి సెక్టార్‌లో కుమ్మరివాడ సెంటర్‌లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్ జ్యోతి ఆధ్వర్యంలో గురువారం అమ్మ మాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, డాక్టర్లు మాలిక, రజిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ (ఆంధ్రజ్యోతి) : 'అమ్మ మాట - అంగన్‌వాడీ బాట' భాగంగా గురువారం 53వ డివిజన్‌లోని లష్కర్ సింగారంలో అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు స్వరూప, అన్వర్‌బి, సంధ్య, ప్రభావతి, రజియా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సుబేదారి సీఐగా రంజిత్ కుమార్ బాధ్యతలు స్వీకరణ

హనుమకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారి సీఐగా ఎం.రంజిత్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన రంజిత్‌కుమార్ ఇటీవల బదిలీల్లో భాగంగా సుబేదారి సీఐగా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ పి.సత్యనారాయణరెడ్డి వరంగల్ టాస్క్‌ఫోర్స్ సీఐగా బదిలీపై వెళ్లారు. గురువారం రంజిత్‌కుమార్ బాధ్యతలు స్వీకరించడంతో పోలీసు సిబ్బంది రంజిత్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న రంజిత్‌కుమార్

విద్యుదాఘాతంతో ఆరు పాడి గేదెలు మృతి

హసన్‌పర్తి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో ఆరు పాడి గేదెలు మృతి చెందిన ఘటన మల్లారెడ్డిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు రైతులకు సుమారు రూ.6 లక్షల వరకు నష్టం జరిగినట్లు స్థానికులు తెలిపారు. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే.. మండలంలోని మల్లారెడ్డిపల్లికి చెందిన బూరుగు నవీన్, బూరుగు సందీప్, బూరుగు కుమార్, కుంబం భగవాన్‌రెడ్డికి చెందిన ఒక్కో పాడి గేదెతో పాటు బూరుగు రమేష్‌కు చెందిన రెండు పాడి గేదెలు గురువారం మల్లారెడ్డిపల్లి రెవెన్యూ శివారులోని గుండా వెంకట్‌కు చెందిన వ్యవసాయ భూమిలో మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నాయి. అవి వాటిని తాకగానే ఆరు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.లక్ష చొప్పున సుమారు రూ.6 లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో పాడి గేదెలు మృతి చెందడం పట్ల గ్రామస్థులు మండి పడుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు తక్షణమే స్పందించి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా తక్షణ చర్యలు తీసుకొని విద్యుత్ లైన్‌ల క్రమబద్ధీకరణతో పాటు మిడిల్ పోల్స్ వేయాలని, అలాగే బాధితులను ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. మృతి చెందిన పాడి గేదెలకు పశువైద్యాధికారి పంచనామా నిర్వహించి రిపోర్టును జిల్లా అధికారులకు అందజేసినట్లు తెలిపారు.


ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న బాధితులు



మల్లారెడ్డిపల్లిలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గేదెలు

సద్బోధ

వైఫల్యాలను స్వీకరిద్దాం



మానవుడి ఎదుగుదల, పరిణామ క్రమంలో అనేకసార్లు వైఫల్యాలు ఎదురవడం సహజం. వైఫల్యం కచ్చితంగా మనల్ని కుంగదీస్తుంది. కొన్నిసార్లు మానసిక ఒత్తిడి నుంచి ఆత్మహత్య వరకూ... దాని పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. కానీ వైఫల్యానికి ఒక సానుకూలమైన కోణం కూడా ఉంది. దాని నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. కొత్త ఆలోచనలు చేయవచ్చు. కొత్త ఆశలు చిగురింపజేసుకోవచ్చు. ఇవన్నీ మన ప్రయాణానికి కొత్త దిశను అందిస్తాయి.

సమస్యలు శత్రువులు కాదు....

మన జీవితాల్లో విజయం కన్నా వైఫల్యమే ఎక్కువ సార్లు ఎదురవుతుందనేది ఒక వాస్తవం. కాబట్టి, వైఫల్యాలకు కుంగిపోకుండా, వాటి నుంచి పాఠాలు నేర్చుకోవాలి, ముందుకి సాగుతూ ఉండాలి. మనం విఫలమైనప్పుడు... అంతకు ముందు చేసిన తప్పులు మళ్ళీ చెయ్యకుండా జాగ్రత్త పడాలి. మన తప్పుల నుంచి మనం నేర్చుకున్నంతకాలం... అవి మనకి ఎలాంటి హానీ చెయ్యలేవు. విజయవంతమైన వ్యక్తులు కూడా విఫలమైన వ్యక్తుల్లాగానే వైఫల్యాలు ఎదుర్కొంటూ ఉంటారనేది నమ్మడం కష్టమైనప్పటికీ అది వాస్తవం. కానీ తేడా ఏమిటంటే... వాళ్ళు తమను తాము మెరుగుపరుచుకొని, తమ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకొని ప్రగతి దిశగా ముందుకు సాగుతూ ఉంటారు. ఎందుకంటే విజయం అనేది వైఫల్యానికి అవతలి చివర్లో ఉంటుంది. విజేతలు తమ విజయంకోసం సాగించిన పయనంలో అనేకసార్లు విఫలమైనవారే. కానీ వాళ్ళు ఒక వైఫల్యంగా తమను ఎన్నటికీ పరిగణించుకోరు. మహా భక్తురాలు, కవయిత్రి మీరాబాయి ఒక రాణి. ఆమె భర్తను కోల్పోయిన తరువాత బంధువులు ఎంతగానో వేధించారు, హింసించారు. చిత్తోడ్‌గఢ్ రాజమందిరాన్ని విడిచి ఆమె బయటకు పోవాల్సి వచ్చింది. కానీ ఈ ప్రతికూలతను ఒక అవకాశంగా ఆమె మార్చుకుంది. బృందావనానికి వెళ్ళి, అక్కడే నివసిస్తూ ఆధ్యాత్మిక సంపదను పోగుచేసుకుంది. కాబట్టి గొప్పవారు తమకు ఎదురైన కష్టాలకు కుంగిపోరు. తమ అంతరంగాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఒక అవకాశంగా దాన్ని మలచుకుంటారు. సమస్యలు మనకు శత్రువులు కాదు. అవి నేర్చుకోవడానికి మనకు అనేక అవకాశాలు ఇస్తాయి. కొత్త దృక్పథంతో జీవితాన్ని చూసేలా చేస్తాయి. ఆత్మశోధనకు ఆస్కారం కల్పిస్తాయి. మనలో దాగి ఉన్న సామర్థ్యాలను బయటకు తీయడానికి దోహదం చేస్తాయి.

ఎదుగుదలే శాశ్వతం

"లోకహానౌ చింతా న కార్యా నివేదితాత్మ లోక వేద శీలత్వాత్... భక్తుడు తనను, ఈ లోకాన్ని, ఇక్కడ చేసే కర్మలను, తన ప్రవర్తనను... ఇలా అన్నిటినీ ఆ పరమాత్మకే సమర్పిస్తాడు. కాబట్టి అతను ఎటువంటి కష్టాలకు, దుఃఖాలకు చలించడు. వాటిలో దేవుడి కృపనే దర్శిస్తాడు" అన్నాడు నారద మహర్షి తన 'భక్తి సూత్రాల'లో. కష్టాల్లో కూడా దైవికమైన ఆశీర్వాదం అంతర్లీనంగా ఉందని నారద మహర్షి మనకు ఉపదేశిస్తున్నాడు. ప్రతికూలమైన పరిస్థితుల్లో మనం ప్రాపంచికమైన విషయాలకు దూరంగా జరుగుతాం. అలాంటి కష్ట సమయాల్లో భగవంతుణ్ణి మీ మనసులో స్మరించుకోండి. మీ ప్రవర్తనలను మార్చుకోవడానికి ప్రయత్నించండి. భౌతికమైన లక్ష్యాలను పెంచుకోవడం మన లక్ష్యం అయితే... ప్రతికూల పరిస్థితులను సహజంగానే ఎదుర్కోవలసి వస్తుంది. కానీ మనం ఆధ్యాత్మికమైన పురోగతిని కోరుకున్నప్పుడు... ప్రతికూలతలను ఎదుగుదలకు అవకాశాలుగా చూడడం నేర్చుకుంటాం. కష్టాల వల్ల కలిగే బాధ తాత్కాలికమని, వాటిని ఎదుర్కొని, పరిష్కరించుకోవడం ద్వారా మనలో సంభవించే ఎదుగుదల శాశ్వతమని ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి.

• స్వామి ముక్తానంద
జేకేయోగ్ వ్యవస్థాపకుడు

దైవమార్గం

అంతరంగంతో వినాలి



మంచి ఉపమానాలతో, సామాన్యులకైనా చక్కగా అర్థమయ్యేలా హితవు చెప్పేవాడు ఏసు క్రీస్తు. ఆయన బోధల్లో వెల్లడించే ఎంతటి నిగూఢ సత్యమైనా సులువుగా అవగతమయ్యేది. అలాంటి కథల్లో ఇది ఒకటి. "ఆధ్యాత్మిక విషయాలు మామూలు చెవులతో వింటే గ్రహించడం కష్టం. వాటిని ఆత్మీయమైన అంతరంగంతో వినాలి" అంటూ ఈ కథను ఆయన ప్రారంభించాడు.

ఒక రైతు తన భూమిని దున్ని, విత్తనాలు చల్లడానికి సిద్ధమయ్యాడు. అతను విత్తనాలు చల్లుతూ ఉంటే... వాటిలో కొన్ని దారి పక్కన పడిపోయాయి. పక్షులు వచ్చి వాటిని మింగేశాయి. మరి కొన్ని మట్టి ఎక్కువగా లేని రాతి నేలలో పడ్డాయి. అవి ఎండకు మాడి పోయాయి. ఇంకొన్ని ముళ్ళ పొదల్లో పడ్డాయి. ఆ పొదలు వాటిని ఎదగనివ్వకుండా చేశాయి. మిగిలినవి సారవంతమైన నేల మీద పడ్డాయి. అవి ఒక్కొక్కటీ ముప్పై మొదలు నూరింతల వరకూ ఫలించాయి.

అలాగే ఒక వ్యక్తి ఎంతోమందికి నీతిసారాన్ని బోధిస్తున్నప్పటికీ... వాటిని గ్రహించే విషయంలో వ్యత్యాసాలు ఉంటాయి. అందరూ వాటిని వింటారు. కానీ కొందరి మనసుల్లో తిష్ట వేసుకొని ఉన్న చెడ్డ బుద్ధి వాటిని పక్కకు నెట్టేస్తుంది. దారి పక్కన పడిన విత్తనాలు అలాంటివే. మరి కొందరి మనసుసుల్లో ఆ మాటలు బాగా నాటుకోవు. అవి రాతి నేల మీద పడిన విత్తనాల్లాంటివి. ఇంకొందరు ఆ బోధలను విన్నప్పటికీ... ఐహిక బంధాలు, ధన వ్యామోహాలు వాటిని అణచివేస్తాయి. ఇవి ముళ్ల పొదల్లో పడిన విత్తనాలు. బోధను చక్కగా విని, వాటిని బాగా అర్థం చేసుకొని, పాటించేవారు కొందరు ఉంటారు. వారు సారవంతమైన నేలలో పడిన విత్తనాల్లా ప్రయోజకులవుతారు. అందరూ ఆ విధంగా కావాలనేది ఏసు ఆకాంక్ష.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

గీతాసారం

కోరికను, కోపాన్ని వదులుకోవాలంటే..



ప్రతి తుపానుకు దాని కేంద్రంలో ఒక ప్రశాంతమైన నేత్రం ఉంటుంది. అలాగే మన కోరికలు, కోపం అనే తుపానుకు కూడా... కోరికలు, క్రోధం లేని ఒక కేంద్రం మన మనసులోనే ఉంటుంది. ఆ కేంద్రాన్ని చేరుకోవడమే మోక్షం. ఈ ప్రక్రియలో... కోరికలకు మూల కారణమైన 'నేను' అనే భావనను తృణీకరించడానికి ఎంతో ధైర్యం కావాలి. రోజువారీ జీవితంలో ఈ విషయాన్ని ఆచరణలోకి తీసుకురావడానికి రెండు సులభమైన పద్ధతులను పాటించవచ్చు. మొదటిది... గతంలో మనం కోరికతో నిండిన అవస్థను గాని, కోపం తెప్పించిన ఒక పరిస్థితిని గాని గుర్తుకు తెచ్చుకొని, ఒక సాక్షిగా గమనించాలి. 'అన్ని జీవుల్లో ఉన్న ఆత్మ ఒక్కటే. కానీ ప్రతి ఒక్కరూ ఒకే సత్యాన్ని అనేక విధాలుగా గ్రహిస్తారు' అనే మెరుగైన అవగాహనతో పరిస్థితిని విశ్లేషించాలి.

"కామ క్రోధ రహితులకు, చిత్తవృత్తులను జయించినవారికి, పరబ్రహ్మమైన పరమాత్మ సాక్షాత్కారాన్ని పొందిన జ్ఞానులకూ అన్నిటిలోనూ ఆ పరమాత్మే గోచరిస్తాడు" అని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు చెప్పాడు. మరి 'కోరికలు' అనే వ్యాధి నుంచి, 'కోపం' అనే వెర్రితనం నుంచి స్వేచ్ఛ పొందడం ఎలా? భారతీయ సంప్రదాయాలు జీవితాన్ని 'లీల' అంటే 'కేవలం ఒక నాటకం' అని చెప్పాయి. అందులో ఏ విషయాన్నీ తీవ్రంగా పరిగణించవలసిన అవసరం లేదు. ఏడు నుంచి పది రోజుల పాటు మనం ఒక నాటకంలో నటిస్తున్నట్టు భావించి... దేన్నీ తీవ్రంగా తీసుకోకుండా... ఉల్లాస మనఃస్థితిలో ఉండడం అనేది రెండో మార్గం. ఇది ఒక నటుడు నాటకం కోసం కోరికను, కోపాన్ని అరువు తెచ్చుకొని, వాటిని అనుభూతి చెందడం లాంటిదే. ఒకసారి వాటిపై పట్టు సాధించిన తరువాత... మనం సుఖదుఃఖాల్లాంటి ఇంద్రియాల జాలంలో చిక్కినా కూడా... నెమ్మదిగా కోరికను, కోపాన్ని అప్పటికప్పుడే వదులుకోవడం నేర్చుకుంటాం. అంటే వర్తమానంలోనే పరమ స్వేచ్ఛను పొందడం, లేదా మోక్షాన్ని పొందడం ఎలాగో తెలుసుకుంటాం.


చివరి అడుగు పరమాత్మను శరణువేడడం. "భగవంతుడు యజ్ఞాలకు, తపస్సులకు భోక్త, సమస్త లోకాలకు, లోకేశ్వరులకు అధిపతి, సమస్త ప్రాణులకు ఆత్మీయుడు, అంటే అవ్యాజమైన దయ కలిగినవాడు, పరమ ప్రేమ స్వరూపుడు. ఈ భగవత్ తత్త్వాన్ని ఎరిగిన భక్తులకు పరమ శాంతి లభిస్తుంది" అని శ్రీకృష్ణుడు చెప్పాడు.


కె.శివప్రసాద్

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఏపీ సీఎం చంద్రబాబుతో 15న సినీ ప్రముఖుల భేటీ

• పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఉండవల్లిలోని సీఎం నివాసానికి 30మంది



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో తెలుగు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు ఈ నెల 15న సమావేశం కాబోతున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4గంటలకు చిత్ర పరిశ్రమ తరపున దాదాపు 30మంది ప్రముఖులు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లనున్నారు. సినీ ఇండస్ట్రీ అభివృద్ధి, సినిమా థియేటర్ల నిర్వహణ, చిత్ర పరిశ్రమలోని సమస్యలు, తాజా పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా టాలీవుడ్ పెద్దలు ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలవకపోవడంపై పవన్ అంతకుముందు అసహనం వ్యక్తం చేశారు. 'రిటర్న్ గిఫ్ట్ ఇచ్చినందుకు థ్యాంక్స్' అంటూ డిప్యూటీ సీఎం చేసిన ఘాటు వ్యాఖ్యలు ఇండస్ట్రీలో కలకలం సృష్టించాయి. సినీ నిర్మాతలు కేవలం తమ సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరల పెంపునకు మాత్రమే ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నారని, సినీ పరిశ్రమ అభివృద్ధికి సంఘటితంగా ప్రభుత్వం వద్దకు రావట్లేదన్నారు. ఇకపై వ్యక్తులు ఇచ్చే వినతుల్ని పట్టించుకోబోమని, అసోసియేషన్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని కూడా పవన్ ఆ సమయంలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో పలువురు చిత్ర ప్రముఖులు పవన్ కల్యాణ్‌ను సంప్రదించి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నించారు. ముఖ్యమంత్రితో చర్చించి సినీ పరిశ్రమ అభివృద్ధికి అందరం పాటుపడదాం అని పవన్ సూచించడంతో చలన చిత్ర రంగ ప్రముఖులు చంద్రబాబుతో ఆదివారం భేటీ కానున్నారు.

-అమరావతి, (ఆంధ్రజ్యోతి)

వేడుకను విజయవంతం చేయండి

-దిల్ రాజు



పద్నాలుగు సంవత్సరాల తర్వాత నిర్వహిస్తోన్న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల వేడుకను విజయవంతం చేయాలని ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు కోరారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'విమాన ప్రమాద దుర్ఘటన కారణంగా మంత్రి కోమటిరెడ్డి ఈ కార్యక్రమానికి రాలేకపోయారు. ఈనెల 14న హైటెక్స్‌లో నిర్వహిస్తోన్న అవార్డుల బహూకరణ కార్యక్రమాన్ని ఐఅండ్‌పీఆర్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. 2014 నుంచి 2023 వరకు ప్రతి ఉత్తమ చిత్రానికి హీరో, హీరోయిన్, దర్శకుడు, నిర్మాతలకు కలిపి నాలుగు అవార్డులను ప్రదానం చేస్తున్నాం. ఇలా ప్రతి ఏడాదిలో మూడు ఉత్తమ చిత్రాలకు అందజేస్తున్నాం. 2024 సంవత్సరానికి ప్రకటించిన అన్ని అవార్డులను కూడా ఇస్తున్నాం' అని దిల్ రాజు తెలిపారు.

అద్భుతమైన ఓపెనింగ్స్ వస్తాయనే నమ్మకం ఉంది

- సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్మోహన్



'ఓ అపర కుబేరుడు, బిచ్చగాడికి మధ్య ఇంటిలిజెన్స్ మైండ్ గేమ్ నేపథ్యంలో సాగే చిత్రం 'కుబేర'. అసలు వారిద్దరూ ఒకరికొకరు ఎలా తారసపడ్డారు, వారి మధ్య పోరుకు దారి తీసిన పరిస్థితులు ఏమిటి? అనేది ఆసక్తికరంగా ఉంటుంది. ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న హిందీలో కూడా పాపులర్ స్టార్స్. అందుకే మా చిత్రాన్ని హిందీలో కూడా డబ్ చేసి విడుదల చేస్తున్నాం. మొత్తం 1600కు పైగా థియేటర్లలో విడుదల చేస్తున్నాం. అద్భుతమైన ఓపెనింగ్స్ వస్తాయనే నమ్మకం ఉంది' అని నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్మోహన్‌రావు అన్నారు. వారిద్దరూ నిర్మాతలుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన 'కుబేర' చిత్రం ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వారిద్దరూ మీడియాతో ముచ్చటించారు.

- శేఖర్ కమ్ముల మాకు చాలా ఇష్టమైన డైరెక్టర్. ఆయన మంచి ఎమోషన్స్‌తో ఆడియన్స్‌ని టచ్ చేస్తూ ఉండే సినిమాలు తీస్తారు. 'లవ్ స్టోరీ' చిత్రం తర్వాత శేఖర్ కమ్ముల 'కుబేర' కథను మాకు చెప్పారు. తర్వాత ధనుష్ కూడా ఓకే చేయడంతో సినిమా మొదలుపెట్టాం. 'కుబేర' సినిమా అద్భుతంగా వచ్చింది. భావోద్వేగాలతో పాటు వాణిజ్యహంగులు కలబోసిన చిత్రం ఇది. ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇస్తుంది.
- తన గత చిత్రాలకు భిన్నంగా ఈ సారి అగ్రతారలతో శేఖర్ ఈ సినిమాను తెరకెక్కించారు. ఇదొక డిఫరెంట్ మూవీ. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని ఈ సినిమాను తెరకెక్కించారు. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది. సినిమాలో అధికభాగం రియల్ లొకేషన్లలో చిత్రీకరించడం సవాల్‌గా అనిపించింది. ముంబైలోని మురికివాడలు, డంపింగ్ యార్డ్స్‌లో చిత్రీకరణ జరిపాం. ఇందులో ధనుష్ బిచ్చగాడిగా సాహసోపేతమైన పాత్రలో నటించారు. ఆయన ఆహార్యం, లుక్, భాష, ఎమోషన్స్ బాగా కుదిరాయి. ధనుష్‌ను తప్ప ఈ పాత్రలో మరొకర్ని ఊహించుకోలేం. ఈ చిత్రంలో ధనుష్ రెండు పాటలు పాడారు. దేవిశ్రీ నేపథ్య సంగీతం సినిమాకు ప్రత్యేకాకర్షణ. నాగార్జున అభినయం ప్రధానాకర్షణగా నిలుస్తుంది. శేఖర్ కమ్ములతో మరో సినిమా చేస్తున్నాం.

యుద్ధభూమిలో యోధుడు



గోపీచంద్ కథానాయకుడిగా సంకల్ప్‌రెడ్డి దర్శకత్వంలో చారిత్రక నేపథ్యంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'గోపీచంద్ 33-వర్కింగ్ టైటిల్. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో రూపొందించిన భారీసెట్లో చిత్రీకరణ జరుగుతోంది. గోపీచంద్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం చిత్ర బృందం పోస్టర్‌ను, గ్లింప్స్‌ను విడుదల చేసింది. గోపీచంద్ విభిన్నమైన లుక్‌లో కనిపించారు. యుద్ధభూమిలో వీరతిలకం ధరించిన యోధుడిగా ఆయన కనిపించారు. ఏడో శతాబ్దానికి చెందిన ఇప్పటివరకూ ఎవరూ స్పృశించని ఓ పాయింట్‌తో సంకల్ప్‌రెడ్డి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని యూనిట్ తెలిపింది.

మిత్రమండలి వినోదం



ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన తారాగణంగా తెరకెక్కుతోన్న చిత్రం 'మిత్రమండలి'. నిహారిక ఎన్.ఎం కథానాయిక. విజయేందర్ ఎస్. దర్శకత్వంలో కల్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. నిర్మాత బన్నీ వాసు, బీవీ వర్క్స్‌తో కలసి సమర్పిస్తున్నారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్మాత అల్లు అరవింద్ 'మిత్రమండలి' టీజర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'బన్నీ వాసు సమర్పిస్తున్న తొలి చిత్రం ఇది. టీజర్ చాలా బావుంది. దర్శకుడిలో ఎంతో ప్రతిభ ఉందని అర్థమవుతోంది. ఈ చిత్రం ఘన విజయం సాధించాలి' అని ఆకాంక్షించారు. బన్నీ వాసు మాట్లాడుతూ 'వినోదాత్మకంగా, ఉల్లాసంగా సాగే నలుగురు స్నేహితుల కథ ఇది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం. థియేటర్లకు వచ్చి మనస్ఫూర్తిగా నవ్వుకోండి' అన్నారు. 'ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే కంటెంట్‌తో వస్తున్నాం' అని విజయేందర్ ఎస్. అన్నారు. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే చిత్రమిదని నిర్మాతలు తెలిపారు.

గద్దర్ ఫిల్మ్ అవార్డులను తక్షణమే నిలిపివేయాలి

గద్దర్ ఫిల్మ్ అవార్డులను ఆపాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించామని తెలంగాణ సినిమా వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ ఫిల్మ్ అవార్డులను ఆంధ్రా సినిమాలకు ఇవ్వవద్దని హైకోర్టులో పిటిషన్ వేశామని, శుక్రవారం వాదనలు వినిపించబోతున్నామని వారు చెప్పారు. కోర్టు ద్వారా తెలంగాణ సినిమాకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నామన్నారు.

-బర్కత్‌పుర, (ఆంధ్రజ్యోతి)

సీనియర్ నిర్మాత మహేంద్ర కన్నుమూత



తెలుగు చిత్ర పరిశ్రమలో మరో విషాదం చోటు చేసుకుంది. దర్శకుడు రవికుమార్ చౌదరి మరణించిన 24 గంటలు కాకముందే సీనియర్ నిర్మాత, ఎ.ఎ.ఆర్ట్స్ అధినేత కావూరి మహేంద్ర(79) గురువారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంతకాలంగా గుండె సంబంధమైన సమస్యలతో బాధపడుతున్న మహేంద్ర తన స్వస్థలమైన గుంటూరులోని రమేశ్ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. నటుడు, నిర్మాత మాదాల రవి ఆయనకు అల్లుడు. కుమారుడు జీతూ కొన్నేళ్ల క్రితమే మరణించారు. ప్రొడక్షన్ మేనేజర్‌గా కెరీర్ ప్రారంభించిన మహేంద్ర తర్వాత నిర్మాణరంగంలోకి ప్రవేశించి గీతా ఆర్ట్ పిక్చర్స్, ఎ.ఎ. ఆర్ట్స్ బేనర్లపై 36 చిత్రాలు నిర్మించారు. 1977లో వచ్చిన 'ప్రేమించి పెళ్లి చేసుకో' నిర్మాతగా మహేంద్ర తొలి సినిమా. రాజశేఖర్ హీరోగా నటించిన 'అర్జున' ఆయన చివరి చిత్రం.

బిజినెస్

వరంగల్ ● శుక్రవారం 13 జూన్ 2025

మెర్సిడెస్ బెంజ్.. ఏఎంజీ జీ63 కలెక్టర్



ధర రూ.4.30 కోట్లు

న్యూఢిల్లీ: జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్.. భారత మార్కెట్లో మరిన్ని కస్టమైజ్డ్ మోడళ్లను ప్రవేశపెట్టేందుకు సన్నద్ధమవుతోంది. బెంగళూరులోని గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రం ద్వారా ఈ ప్రత్యేక ఎడిషన్ కార్లను తీసుకురానున్నట్లు మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ వెల్లడించారు. ఇందులో భాగంగానే గురువారం మెర్సిడెస్.. ఏఎంజీ జీ63 కలెక్టర్ పేరుతో ప్రత్యేక ఎడిషన్‌ను విడుదల చేసింది. దీని ధర రూ.4.30 కోట్లు (ఎక్స్‌షోరూమ్). ప్రత్యేక ఎడిషన్‌లో భాగంగా కేవలం 30 కార్లను మాత్రమే కంపెనీ మార్కెట్లోకి విడుదల చేయనుంది. కాగా వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా మరిన్ని కస్టమైజ్డ్ మోడళ్లను, ప్రత్యేక ఫీచర్లతో తీసుకురానున్నట్లు అయ్యర్ తెలిపారు.

విదేశాల్లో 'ఎఫ్‌డీ'లపై నిషేధం?

విదేశాలకు సొమ్ము బదిలీ నిబంధనలు కఠినతరం చేసే యోచనలో ఆర్‌బీఐ

న్యూఢిల్లీ: భారతీయులు విదేశాలకు పంపే సొమ్ము (ఓవర్సీస్ రెమిటెన్స్)కు సంబంధించిన నిబంధనలను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కఠినతరం చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దేశం బయటికి పంపిన సొమ్ముతో విదేశీ కరెన్సీల్లో లాకిన్ పీరియడ్‌తో కూడిన ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) చేయడం లేదా వడ్డీ ఆర్జిత అకౌంట్లో జమ చేయడాన్ని నిషేధించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో ఆర్‌బీఐ చర్చలు కొనసాగిస్తోందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇది దేశ సంపదను విదేశాలకు బదిలీ చేయడం లాంటిదేనని ఆ వర్గాలు పేర్కొన్నాయి. మన దేశవాసులు విదేశాల్లో తమ పేరు మీదే కాదు, ఇతరుల పేరున కూడా సొమ్ము డిపాజిట్ చేయకుండా ఆర్‌బీఐ నిబంధనలను కట్టుదిట్టం చేయాలని భావిస్తోందని వారు తెలిపారు. కాగా ఈ తరహా సొమ్ము బదిలీలకు అడ్డుకట్ట వేసేందుకు ఆర్‌బీఐ లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)ను సవరించనున్నట్లు తెలిసింది.



ఏడాదిలో రూ.2.14 కోట్లు పంపొచ్చు..

ఇటీవలి కాలంలో విదేశాలకు సొమ్ము బదిలీలు భారీగా పెరిగాయి. కొందరు ఎల్ఆర్ఎస్ మార్గంలో తమ సంపదను క్రమంగా విదేశాలకు తరలిస్తున్నారని ఆర్‌బీఐ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే, ఇది మన విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలకు గండికొట్టడమే కాకుండా రూపాయి మారకం విలువలో ఒడుదుడుకులకూ కారణమవుతోంది. ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ ద్వారా భారతీయులు ఉన్నత విద్య, ప్రయాణం, విదేశీ స్టాక్ మార్కెట్ లేదా బాండ్లలో పెట్టుబడులు లేదా వైద్య అవసరాల కోసం ఏదైనా ఆర్థిక సంవత్సరంలో 2.5 లక్షల డాలర్ల (దాదాపు రూ.2.14 కోట్లు) వరకు సొమ్మును బయటికి దేశానికి బదిలీ చేయవచ్చు.

మార్చిలో 17.32 కోట్ల డాలర్ల విదేశీ కరెన్సీ డిపాజిట్లు

ఆర్‌బీఐ డేటా ప్రకారం.. ఈ ఫిబ్రవరిలో భారతీయుల ఫారిన్ కరెన్సీ డిపాజిట్లు 5.162 కోట్ల డాలర్లుగా నమోదు కాగా.. మార్చిలో 17.32 కోట్ల డాలర్లకు పెరిగాయి. ఆర్థిక సంవత్సరం చివరి నెల కావడంతో సాధారణంగానే మార్చిలో భారతీయుల విదేశీ రెమిటెన్స్‌లు భారీగా పెరుగుతాయని ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారతీయులు దాదాపు 3,000 కోట్ల డాలర్లు విదేశాలకు పంపించారు. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24)లో పంపిన 3,100 కోట్ల డాలర్లతో పోలిస్తే మాత్రం గత సారి విదేశీ రెమిటెన్స్‌లు స్వల్పంగా తగ్గాయి.

మార్కెట్ క్రాష్

- సెన్సెక్స్ 823 పాయింట్లు పతనం
- మళ్లీ 25,000 దిగువకి నిఫ్టీ
- రూ.6 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం భారీగా పతనమయ్యాయి. పశ్చిమాసియాలోని ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో బలహీన ట్రెండ్ ఇందుకు ప్రధాన కారణం. ముడి చమురు ధరల పెరుగుదల, చాలా కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతున్నాయన్న ఆందోళనలు, ట్రంప్ ఏకపక్ష సుంకాల పెంపు యోచనలో ఉన్నారన్న వార్తలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ, వీక్లీ డెరివేటివ్ కాంట్రాక్టుల కాలపరిమితి ముగింపు కూడా మార్కెట్‌పై ఒత్తిడిని పెంచాయి. ఈ నేపథ్యంలో మదుపరులు ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లలో పెద్ద ఎత్తున అమ్మకాలకు పాల్పడటంతో సెన్సెక్స్ ఒక దశలో 992 పాయింట్ల వరకు క్షీణించింది. చివరికి సూచీ 823.16 పాయింట్ల (1 శాతం) నష్టంతో 81,691.98 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 253.20 పాయింట్లు (1.01 శాతం) కోల్పోయి 24,888.20 వద్దకు జారుకుంది. ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.98 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.449.58 లక్షల కోట్లకు (5.26 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 27 నష్టపోయాయి.

తాన్లా షేర్ల బైబ్యాక్: హైదరాబాద్‌కు చెందిన తాన్లా ప్లాట్‌ఫామ్స్ మరోసారి మార్కెట్ నుంచి సొంత షేర్లను తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేయనుంది. ఈ నెల 16న (సోమవారం) కంపెనీ బోర్డు సమావేశమై బైబ్యాక్ ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోనుంది. ఈ నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో ఒకదశలో 12 శాతం ఎగబాకింది. చివరికి 9.18 శాతం వృద్ధితో రూ.679.35 వద్ద ముగిసింది. తాన్లా షేర్ల బైబ్యాక్ చేయటం గడిచిన ఐదేళ్లలో ఇది మూడోసారి. కంపెనీ 2020లో రూ.154 కోట్లు, 2022లో రూ.170 కోట్ల విలువైన షేర్లను బైబ్యాక్ చేసింది.

బోయింగ్ షేరు ధమాల్

గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం కొద్ది నిమిషాలకే కుప్పకూలింది. దాంతో ఆ విమానంలో ప్రయాణిస్తున్న 242 మందిలో 241 మంది చనిపోయారు. ఈ ఘోర ప్రమాదం నేపథ్యంలో అమెరికా మార్కెట్లో బోయింగ్ షేరు గురువారం ప్రారంభ ట్రేడింగ్‌లో 5 శాతం వరకు క్షీణించింది. మార్కెట్ ప్రారంభానికి ముందు ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో 8 శాతం వరకు పతనమైంది. ఈ ఘటనతో అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి విమానాల రాకపోకలకూ అంతరాయం కలిగింది. దాంతో దేశీయ లిస్టెడ్ ఎయిర్‌లైన్స్ ఇండిగో షేరు బీఎస్ఈలో 2.65 శాతం నష్టపోగా.. స్పైస్‌జెట్ షేరు 1.78 శాతం క్షీణించింది. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నిర్వహణ సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు ధర కూడా 1.54 శాతం తగ్గింది.

ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి ద్రవ్యోల్బణం

మే నెలలో 2.82 శాతం

న్యూఢిల్లీ: కొన్ని వారాలుగా అదుపులో ఉన్న ఆహార, నిత్యావసర వస్తువుల ధరలు మే నెలలో మరింతగా దిగొచ్చాయి. ఫలితంగా రిటైల్ ద్రవ్యోల్బణం 2.82 శాతానికి తగ్గింది. ఇది ఆరేళ్ల కనిష్ఠ స్థాయి. 2019 ఫిబ్రవరిలో నమోదైన కనిష్ఠ స్థాయి 2.57 శాతం తర్వాత ద్రవ్యోల్బణం ఈ స్థాయికి దిగి రావడం ఇదే ప్రథమం. ఇది ఏప్రిల్‌లో 3.16 శాతం ఉండగా గత ఏడాది మే నెలలో 4.8 శాతంగా ఉంది.

తెలంగాణలో అత్యంత కనిష్ఠం

ప్రాంతాల వారీగా చూసినట్టయితే రిటైల్ ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో 2.59 శాతం, పట్టణ ప్రాంతాల్లో 3.07 శాతంగా నమోదైంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలవారీగా చూసినా తెలంగాణలో రిటైల్ ద్రవ్యోల్బణం అత్యంత కనిష్ఠ స్థాయి 0.55 శాతంగా నమోదైంది.

జీఎస్‌కేతో భారత్ బయోటెక్ జట్టు

సంయుక్తంగా డయేరియా వ్యాక్సిన్ తయారీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అంతర్జాతీయ ఫార్మా దిగ్గజం జీఎస్‌కే పీఎల్‌సీతో హైదరాబాద్ కేంద్రంగా ఉన్న భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (బీబీఐఎల్) భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా బ్యాక్టీరియా ద్వారా వ్యాపించే అధిక తీవ్రత గల అతిసార (డయేరియా) వ్యాధి (షిగెలోసిస్) కట్టడికి ఉపయోగించే వ్యాక్సిన్‌ను తయారు చేయనుంది. ఆల్ట్‌సోన్‌ఫ్లెక్స్ 1-2-3 పేరిట జీఎస్‌కే ఇప్పటికే రూపొందించిన ఈ వ్యాక్సిన్ ప్రస్తుతం క్లినికల్ ట్రయల్స్ దశలో ఉంది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన వ్యాక్సిన్ ఇది. ప్రస్తుతం ప్రపంచ మార్కెట్లో అధికారిక లైసెన్స్ గల షిగెల్లా వ్యాక్సిన్ ఏదీ లేదు. బ్యాక్టీరియా ద్వారా ఈ అతిసార వ్యాధి తీవ్రంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో అల్పాదాయ, మధ్యాదాయ దేశాలకు శాస్త్రీయంగా అభివృద్ధి చేసిన వ్యాక్సిన్ ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ కృష్ణ ఎల్లా అన్నారు.

ఇరు సంస్థల మధ్య కుదిరిన అంగీకారం ప్రకారం భారత్ బయోటెక్ మూడో దశ క్లినికల్ ట్రయల్స్ నిర్వహించడం, నియంత్రణాపరమైన అనుమతులు సాధించడంతో పాటు భారీ ఎత్తున ఉత్పత్తి కార్యకలాపాలు నిర్వహిస్తుంది. క్లినికల్ ట్రయల్స్ డిజైనింగ్, తయారీ కార్యకలాపాల కోసం విదేశీ నిధుల సమీకరణ, వాణిజ్యీకరణ వ్యూహాలను జీఎస్‌కే పర్యవేక్షిస్తుంది.

ఎంఐపీఎస్‌తో సైయెంట్ భాగస్వామ్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఏఎస్ఐసీ (అప్లికేషన్-స్పెసిఫిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్), ఏఎస్ఎస్‌పీ (అప్లికేషన్-స్పెసిఫిక్ స్టాండర్డ్ ప్రోడక్ట్) అభివృద్ధి కోసం హైదరాబాద్‌కు చెందిన సైయెంట్ సెమీ కండక్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్.. ఆర్ఐఎస్‌సీ-వీ ప్రాసెసర్ ఐపీల తయారీలోని అంతర్జాతీయ దిగ్గజం ఎంఐపీఎస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. తమ భాగస్వామ్యంలో ఆటోమోటివ్, ఇండస్ట్రియల్, డేటా సెంటర్ విభాగాల కోసం సురక్షితమైన, రియల్ టైమ్ అప్లికేషన్స్ రూపొందించగలుగుతామని సైయెంట్ తెలిపింది.

ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	100	విజయవాడ	109
వరంగల్	100	గుంటూరు	112
కరీంనగర్	100	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	103
కర్నూలు	100	నెల్లూరు	108
విశాఖపట్నం	96	అనంతపురం	108
గోదావరి	109		

నవంబరు నుంచి ట్రూజెట్ టేకాఫ్!

విశాఖ కేంద్రంగా కార్యకలాపాలు

న్యూఢిల్లీ: ప్రాంతీయ విమానయాన సంస్థ ట్రూజెట్ (గతంలో టర్బో మేఘా ఎయిర్‌వేస్) టేకాఫ్‌కు సిద్ధమవుతోంది. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి ఇందుకోసం ఇప్పటికే అనుమతి సంపాదించింది. 2015-22 మధ్య కాలంలో ప్రాంతీయ విమానయాన సంస్థగా ట్రూజెట్ దేశంలో విమాన సర్వీసులు నిర్వహించింది. అయితే కొవిడ్‌తో తలెత్తిన ఆర్థిక ఇబ్బందుల కారణంగా 2022 ఫిబ్రవరిలో కార్యకలాపాలు నిలిపివేసింది. విమాన సర్వీసులను తిరిగి ప్రారంభించేందుకు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) నుంచి ఎయిర్ ఆపరేటర్స్ అనుమతి (ఏఓపీ) కోసం ట్రూజెట్ దరఖాస్తు చేసింది. ఈ అనుమతి లభిస్తే ఈ ఏడాది నవంబరు నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం కేంద్రం గా తన సర్వీసులు ప్రారంభించాలని ట్రూజెట్ యోచిస్తున్నట్టు సమాచారం. గతంలో ట్రూజెట్.. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించింది.

రూ.200 కోట్ల పెట్టుబడి: విమాన సర్వీసుల పునరుద్ధరణ కోసం ట్రూజెట్ యాజమాన్యం రూ.200 కోట్ల వరకు పెట్టుబడులు సమీకరించినట్టు సమాచారం. తొలుత ఒక ఎయిర్‌బస్ ఏ320 విమానంతో విమాన సర్వీసులు ప్రారంభించాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది. తర్వాత ఏటీఆర్ రకం విమానాలు సమకూర్చుకోవాలని కంపెనీ భావిస్తోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)			
13వ తేదీ		విజయవాడ	535
హైదరాబాద్	540	గోదావరి	535
వరంగల్	542	విశాఖపట్నం	550
చిత్తూరు	613	డజను గుడ్లు రూ. 78	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,200 ▲	91,000 ▲	1,18,900 ▼
విజయవాడ	98,000 ▼	90,150 ▼	1,05,000 ▼
విశాఖపట్నం	1,00,810 ▲	91,000 ▲	1,18,900 ▼
రాజమండ్రి	99,270 ▲	90,100 ▼	1,11,500 ▲
ప్రొద్దుటూరు	96,900 ▲	89,150 ▲	1,04,000 ▲
ముంబై	97,455 ▲	89 ,269 ▲	1,05,498 ▲

వింబుల్డన్ ప్రైజ్‌మనీ.. రూ. 625 కోట్లు

లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ ప్రైజ్‌మనీతోపాటు విజేతలకు అందించే మొత్తం భారీగా పెరిగింది. ఈ టోర్నమెంట్ మొత్తం ప్రైజ్‌మనీ ఏకంగా రూ. 625 కోట్లకు చేరగా..పురుషులు, మహిళల సింగిల్స్ చాంపియన్లు ఒక్కొక్కరికి రూ. 34 కోట్లు ప్రదానం చేయనున్నారు. ఈ వివరాల్ని ఆల్ ఇంగ్లండ్ క్లబ్ నిర్వాహకులు గురువారం ప్రకటించారు. ఓవరాల్ ప్రైజ్‌మనీ గత ఏడాది కంటే రూ. 58 కోట్లు పెరిగింది. తొలి రౌండ్ పరాజితులు రూ. రూ. 76.77 లక్షలు అందుకోనున్నారు.

సిఫ్ట్ కౌర్‌కు కాంస్యం



మ్యూనిచ్: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భారత షూటర్ సిఫ్ట్ కౌర్ సమ్రా కాంస్య పతకం సాధించింది. గురువారం జరిగిన మహిళల 50 మీ. రైఫిల్ త్రీ పొజిషన్ ఫైనల్లో తీవ్ర పోటీ ఎదుర్కొన్న సిఫ్ట్ 453.1 పాయింట్లతో మూడో స్థానం దక్కించుకుంది. నార్వేకు చెందిన జీనెట్ హెగ్ డ్యూస్టాడ్ (466.9) స్వర్ణం, ఎమీలీ జేగీ (స్విట్జర్లాండ్, 464.8) రజత పతకాలు సాధించారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 592 పాయింట్లు స్కోరు చేసిన కౌర్ రెండో స్థానంతో ఎనిమిది మంది షూటర్ల ఫైనల్లోకి అడుగుపెట్టింది. ఇక..ఈ విభాగంలో బరిలో దిగిన ఇతర భారత షూటర్లు ఆషీ చౌక్సీ (589) 11వ, అంజుమ్ మౌద్గిల్ (586) 27వ, శ్రియాంకా సాదంగి (582) 53వ స్థానాలలో నిలిచారు. కాగా ఈ ఏడాది ఆరంభంలో బ్యూనస్ ఎయిర్స్‌లో జరిగిన ప్రపంచ కప్‌లో సిఫ్ట్ కౌర్ పసిడి పతకం కొల్లగొట్టింది.

వచ్చే జనవరిలో భారత టూర్‌కు కివీస్?

న్యూఢిల్లీ: న్యూజిలాండ్ జట్టు వచ్చే ఏడాది జనవరిలో భారత్‌లో పర్యటించనున్నట్టు సమాచారం. ఈ టూర్‌లో కివీస్ 3 వన్డేలు, 5 టీ20ల సిరీస్‌లు ఆడే అవకాశం ఉంది. టీ20 వరల్డ్‌కప్‌నకు ఈ సిరీస్ సన్నాహకంగా ఉపకరిస్తుందని కివీస్ భావిస్తోందట. గత ఏడాది భారత్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌ను కివీస్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది.

స్పోర్ట్స్

ఇంగ్లండ్ టూర్‌కు శ్రీచరణి, అరుంధతి

టీ20, వన్డేలకు మహిళల జట్ల ఎంపిక





న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌లకు ఎంపిక చేసిన భారత మహిళల జట్లలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నల్లపురెడ్డి శ్రీచరణి, తెలంగాణ క్రీడాకారిణి అరుంధతి రెడ్డిలకు చోటు దక్కింది. ఇంగ్లండ్ పర్యటన కోసం గురువారం ప్రకటించిన జట్టులో గాయపడిన సురుచి ఉపాధ్యాయ్ స్థానాన్ని లెఫ్టామ్ స్పిన్నర్ రాధా యాదవ్‌తో భర్తీ చేశారు. ఈ నెల 28 నుంచి జరిగే టూర్‌లో ఇంగ్లండ్‌తో భారత్ ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది.

జట్లు ఇవే..

టీ20 జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా, రిచా ఘోష్, యాస్తిక భాటియా (ఇద్దరూ వికెట్ కీపర్లు), హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, స్నేహ్ రాణా, శ్రీచరణి, అమన్‌జోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి, సయాలి, రాధా యాదవ్.

వన్డే జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, ప్రతికా రావల్, హర్లీన్, జెమీమా, రిచా ఘోష్, యాస్తిక భాటియా (ఇద్దరూ వికెట్ కీపర్లు), తేజల్, దీప్తి శర్మ, స్నేహ్ రాణా, శ్రీచరణి, అమన్‌జోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి, సయాలి, రాధా యాదవ్.

ఇంగ్లండ్ టూర్ షెడ్యూల్..		
జూన్ 28	తొలి టీ20	నాటింగ్‌హామ్
జూలై 1	రెండో టీ20	బ్రిస్టల్
జూలై 4	మూడో టీ20	ఓవల్
జూలై 9	నాలుగో టీ20	మాంచెస్టర్
జూలై 12	ఐదో టీ20	బర్మింగ్‌హామ్
	వన్డే సిరీస్	
జూలై 16	తొలి వన్డే	సౌతాంప్టన్
జూలై 19	రెండో వన్డే	లార్డ్స్
జూలై 22	మూడో వన్డే	చెస్టర్ లి స్ట్రీట్

● భారత్‌కు వరుసగా నాలుగో ఓటమి

ఆమ్‌స్టెల్వీన్ (నెదర్లాండ్స్): ప్రొ.హాకీ లీగ్ యూరప్ అంచెలో భారత జట్టు వరుసగా నాలుగో పరాజయాన్ని మూటగట్టుకుంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో అర్జెంటీనా 2-1తో భారత్‌పై గెలుపొందింది.

తుదిజట్టు కూర్పుపైనే దృష్టంతా..!

నేడు భారత జట్ల మధ్య ప్రాక్టీస్ మ్యాచ్

బెకెన్‌హామ్ (కెంట్): ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌కు ముందు ఏకైక ప్రాక్టీస్ మ్యాచ్‌కు భారత సీనియర్ జట్టు సిద్ధమైంది. శుక్రవారం నుంచి జరిగే నాలుగు రోజుల అనధికార టెస్ట్‌లో భారత్-ఎతో టీమిండియా తలపడనుంది. భారత ప్లేయర్ల మధ్య అంతర్గత మ్యాచ్ కావడంతో.. టెస్ట్ జట్టు కూర్పుపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంది. శుభ్‌మన్ గిల్ సారథ్యానికి ఈ మ్యాచ్ ఓ పరీక్షగానే చెప్పుకోవాలి. ఇక, తుది జట్టులో జడేజా లేదా కుల్దీప్‌లో ఎవరిని తీసుకోవాలనేదానిపై కోచ్ గౌతమ్ గంభీర్ ఓ నిర్ణయానికి రావచ్చు. మరోవైపు ఆరు నెలల తర్వాత టెస్ట్ మ్యాచ్ ఆడుతున్న పేసర్ బుమ్రా ఫిట్‌నెస్‌ను నిశితంగా గమనించనున్నారు. వెన్నెముక గాయంతో విశ్రాంతి తీసుకొన్న బుమ్రా ఐపీఎల్‌లో బరిలోకి దిగాడు. ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణల్లో ఎవరు కెప్టెన్ నమ్మకాన్ని గెల్చుకుంటారో ఈ మ్యాచ్‌తో బయటపడనుంది. అలాగే తెలుగు కుర్రాడు నితీష్ కుమార్ రెడ్డి, ఇంగ్లండ్‌లో ఆడిన అనుభవం ఉన్న శార్దూల్ ఠాకూర్‌లలో ఎవరు బెర్త్ దక్కించుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. మొత్తంగా బ్యాటర్లకు బ్యాటింగ్ ప్రాక్టీస్‌తోపాటు బౌలర్లు లయను అందుకోవడానికి ఈ మ్యాచ్ ఎంతో ఉపయోగపడనుంది.

ఇదే సరైన సమయం



ప్రతీ బంతికీ పోరాడండి

భారత ఆటగాళ్లకు కోచ్ గంభీర్ సలహా

లండన్: ఇంగ్లండ్ పర్యటనకు ఎంపికైన భారత ఆటగాళ్లు సత్తా నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉండాలంటూ ప్రధాన కోచ్ గౌతం గంభీర్ సూచించాడు. స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలతో పాటు స్పిన్నర్ అశ్విన్ లేకుండానే టీమిండియా ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ ఆడనున్న విషయం తెలిసిందే. ఈసందర్భంగా ఆటగాళ్లంతా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు రావాలని పిలుపునిచ్చాడు. ఈనెల 20 నుంచి సిరీస్ జరుగనుంది. 'ఈ టూర్‌ను మనం రెండు రకాలుగా చూడవచ్చు. మొదటిది ముగ్గురు అత్యంత అనుభవజ్ఞులైన ఆటగాళ్లు లేకుండానే బరిలోకి దిగనున్నాం. రెండోది దేశం కోసం ప్రత్యేకంగా ఏదైనా చేయడానికి మనకు ఓ అద్భుతమైన అవకాశం దక్కింది. ప్రస్తుత జట్టులో తమను తాము నిరూపించుకోవాలనే తపన, నిబద్ధత కనిపిస్తున్నాయి. అయితే ఈ టూర్‌ను చిరస్మరణీయం చేసుకోవాలంటే మనం సౌకర్యవంతమైన జోన్ నుంచి బయటకు రావాల్సిందే. ప్రతి రోజు, ప్రతీ సెషన్, ప్రతీ గంట, ప్రతీ బంతికి కూడా పోరాడితేనే ఫలితం దక్కించుకుంటాం' అని ప్రాక్టీస్ సందర్భంగా జట్టు సభ్యులతో గంభీర్ అన్నాడు.

అదృష్టవంతుణ్ణి..

టెస్టుల్లో రీఎంట్రీపై కరుణ్ నాయర్



లండన్: ఎనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ టెస్ట్‌ల్లో ఆడే అవకాశం లభించడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని కరుణ్ నాయర్ చెప్పాడు. 33 ఏళ్ల నాయర్ ఇంగ్లండ్ లయన్స్‌తో తొలి అనధికార టెస్ట్‌లో భారత్ 'ఎ' తరపున డబుల్ సెంచరీ చేయడం ద్వారా..ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్‌కు తుది జట్టులో చోటుకు బలంగా రేస్‌లో నిలిచాడు. 'చాలాకాలం తర్వాత టెస్ట్‌లు ఆడే అవకాశం రానుండడం గొప్ప అనుభూతి కలిగిస్తోంది' అని కరుణ్ అన్నాడు. 2018లో ఇంగ్లండ్ పర్యటనకు భారత జట్టులో నాయర్ ఉన్నాడు. కానీ అప్పుడు జరిగిన ఐదు టెస్ట్‌లకూ అతడు బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఇక..గత సీజన్‌లో తన అద్భుత బ్యాటింగ్‌తో విదర్భ రంజీ టైటిల్ గెలవడంలో కరుణ్ కీలకపాత్ర పోషించాడు.

రసవత్తరం..

- రెండో రోజూ 14 వికెట్లు
- 138కే కుప్పకూలిన దక్షిణాఫ్రికా
- దెబ్బతీసిన పేసర్ కమిన్స్
- ఆధిక్యంలో ఆస్ట్రేలియా
- రెండో ఇన్నింగ్స్ 144/8



కమిన్స్ (6/28)

1 ఐసీసీ టోర్నమెంట్ ఫైనల్లో ఎక్కువ వికెట్లు తీసిన బౌలర్‌గా కమిన్స్ (12). అలాగే లార్డ్స్ మైదానంలో ఉత్తమ బౌలింగ్ ప్రదర్శన (6/28) కనబర్చిన కెప్టెన్‌గానూ నిలిచాడు. ఇక తాజా డబ్ల్యూటీసీ సీజన్‌లో ఎక్కువ వికెట్లు (78) పడగొట్టిన బౌలర్‌గా బుమ్రా (77)ను సైతం అధిగమించాడు.

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్స్ ఫైనల్ అత్యంత రసవత్తరంగా మారింది. రెండో రోజు కూడా 14 వికెట్లతో ఇరు జట్ల బౌలర్లు రాజ్యమేలారు. అయితే ఓవరాల్‌గా డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా 218 పరుగుల కీలక ఆధిపత్యంతో పైచేయిలో ఉంది. పిచ్‌తీరును బట్టి చూస్తే మూడో రోజే ఈ టెస్టులో విజేత ఖరారయ్యే అవకాశం కనిపిస్తోంది. పేసర్ కమిన్స్ (6/28) పదునైన బంతులతో దక్షిణాఫ్రికా వెన్నువిరిచాడు. దీంతో ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 138 పరుగులకే కుప్పకూలింది. ఫలితంగా ఆసీస్‌కు 74 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది. మిడిలార్డర్‌లో బెడింగమ్ (45), కెప్టెన్ బవుమా (36) మాత్రమే రాణించారు. స్టార్క్‌కు రెండు, హాజెల్‌వుడ్‌కు ఓ వికెట్ దక్కింది. 43/4 ఓవర్‌నైట్ స్కోరుతో గురువారం రెండో రోజు ఆటను ఆరంభించిన సఫారీలు కమిన్స్‌ను ఎదుర్కోవడంలో విఫలమయ్యారు. తొలి సెషన్‌లో బవుమా వికెట్ మాత్రమే కోల్పోగా ఐదో వికెట్‌కు బెడింగమ్‌తో అత్యధికంగా 64 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత కమిన్స్ విజృంభణకు 8.1 ఓవర్లలోనే ఆలౌట్ అయ్యింది. మొత్తంగా చివరి ఆరు వికెట్లలో ఐదుగురిని అతనే పెవిలియన్‌కు చేర్చగా.. కేశవ్ (7) రనౌటయ్యాడు. మరోవైపు టెస్టుల్లో కమిన్స్ 300 వికెట్లను సైతం పూర్తి చేసుకున్నాడు.

ఆదుకున్న క్యారీ: రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ ఆట ముగిసే సమయానికి 8 వికెట్లకు 144 పరుగులు చేసింది. క్రీజులో స్టార్క్ (16 బ్యాటింగ్), లియోన్ (1 బ్యాటింగ్) ఉన్నారు. పేసర్లు ఎన్‌గిడి (3/35), రబాడ (3/44) విజృంభించడంతో ఓ దశలో ఆసీస్ 73/7 స్కోరుతో ఇబ్బందుల్లో పడింది. అయితే క్యారీ (43) అండగా నిలవడంతో జట్టు కోలుకుంది. అతడికి స్టార్క్ సహకరించడంతో ఎనిమిదో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యం జత చేరింది. అలాగే ఆధిక్యం కూడా 200 దాటి సఫారీలకు సవాల్ విసిరింది.

సంక్షిప్త స్కోర్లు: ఆసీస్ తొలి ఇన్నింగ్స్: 212; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 138 ఆలౌట్** (బెడింగమ్ 45, బవుమా 36; కమిన్స్ 6/28, స్టార్క్ 2/41); **ఆసీస్ రెండో ఇన్నింగ్స్:** 144/8 (క్యారీ 43, లబుషేన్ 22; ఎన్‌గిడి 3/35, రబాడ 3/44).

బెడింగమ్ అవుటా? నాటౌటా?



డబ్ల్యూటీసీ ఫైనల్ రెండో రోజు ఆటలో అరుదైన సన్నివేశం చోటు చేసుకుంది. లంచ్ బ్రేక్‌కు ముందు 49వ ఓవర్‌లో పేసర్ వెబ్‌స్టర్ వేసిన బంతిని దక్షిణాఫ్రికా బ్యాటర్ డేవిడ్ బెడింగమ్ డిఫెన్స్ ఆడాడు. అయితే బంతి ఇన్‌సైడ్ ఎడ్జ్ తీసుకుని తన ప్యాడ్‌కు తాకింది. ఆ తర్వాత బాల్ కింద పడే సమయంలో కీపర్ క్యారీ క్యాచ్ కోసం ముందుకు వచ్చాడు. కానీ ఇంతలోనే బెడింగమ్ దాన్ని అందుకుని కింద పడేశాడు. దీంతో బంతిని చేత్తో ముట్టుకున్నాడనే కారణంతో ఆసీస్ అప్పీల్ చేసింది. కానీ ఫీల్డ్ అంపైర్లు నాటౌట్‌గా ప్రకటించారు. నిబంధనల ప్రకారం ఫీల్డర్‌ను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుని బంతిని ఆపితేనే బ్యాటర్‌ను అవుట్‌గా ప్రకటిస్తారు. ఇక్కడ బెడింగమ్‌కు అలాంటి ఉద్దేశం లేదని అంపైర్లు భావించారు. అలాగే బంతి ప్యాడ్‌లో చిక్కుకున్నాక డెడ్‌గా ప్రకటిస్తారని కామెంటేటర్ హేడెన్ తెలిపాడు.



మరణ విహంగం



గుజరాత్‌లో ఘోర విమాన ప్రమాదం 290 మంది దుర్మరణం

ఘటనా స్థలంలో మృతదేహం



ఆకాశమే కూలినంత శబ్దం.. భారీ విస్ఫోటనం.. కన్ను మూసి తెరిచే సరికి అంతా విధ్వంసం.. తెగిపడ్డ తలలు, ముక్కలైన శరీరాలు.. మాంసపు ముద్దలు.. 90 శాతానికి పైగా కాలిపోయిన మృత దేహాలు..

ఎటు చూసినా చిందరవందరగా పడి ఉన్న విమాన శకలాలు.. పేలుడు, అగ్నికీలల ధాటికి కమ్మేసిన పొగ.. మంటల్లో కాలి నల్లగా మసి బారిన భవనాలు.. కాలి బూడిదైన చెట్లు, వాహనాలు..!!

ఆ ప్రాంతాన్ని చూసిన వారెవరైనా సరే ఒక్క క్షణం నిశ్చేష్టులయ్యేంత భయోత్పాతం. ఎయిరిండియా విమాన ప్రమాదం తర్వాత బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ మెస్, పరిసర ప్రాంతాల వద్ద పరిస్థితి ఇది.

భయానకం.. బీభత్సం!

ప్రమాదం అనంతరం అంబులెన్సు, ఫైరింజన్ల సైరన్ల మోతతో ఆ ప్రాంతంలో ఉద్విగ్న వాతావరణం నెలకొనగా.. సహాయక చర్యలు జరుగుతున్న కొద్దీ.. ఆ ప్రాంతాన్ని మృత్యుదేవత కబళించిందేమో అనేలా పరిణామాలు మారాయి.

విమానం కూలి పేలుడు సంభవించి అగ్నికీలలు ఎగసిపడుతుండగా.. ఆకాశాన్నే మింగేసే అంత నల్లటి దట్టమైన పొగ ఆ ప్రాంతాన్ని కమ్మేసింది. మెస్ భవనం పైకప్పు కూలిపోయి.. ఆ భవనం పూర్తిగా ధ్వంసమవ్వగా.. మెస్ వంట గదిలోని సామగ్రి, వస్తువులు కూడా బుగ్గి అయ్యాయి.

విమానం టేకాఫ్ అయిన కాసేపటికే ప్రమాద జరగ్గా.. విమానంలోని భారీగా ఉన్న ఇంధనం వల్ల పేలుడు తీవ్రత కూడా అధికంగా ఉంది. మెస్ భవనంతోపాటు చుట్టు పక్కల ఉన్న కొన్ని భవనాలకు కూడా మంటలు అంటుకున్నాయి. మెస్ భవనం చుట్టుపక్కల నిలిపి ఉంచిన వాహనాలు, పరిసరాల్లోని చెట్లు కాలిపోయాయి.





ప్రమాదంలో ధ్వంసమైన బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ మెస్ భవనం, మృతదేహాలను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

అహ్మదాబాద్, జూన్12: గుజరాత్‌లో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌లోని గాట్విక్‌కు బయలుదేరిన ఎయిరిండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం(ఏఐ-171) కూలిపోయిన ఘటనలో 290మంది దుర్మరణంపాలయ్యారు. టేకాఫ్ సమయంలో సీటు బెల్టులు పెట్టుకున్న ప్రయాణికుల మృతదేహాలు.. భారీ ప్రమాదంతో కాలిపోయి, చెల్లా చెదురుగా మృతదేహాలు పడిపోయాయి. కాలిపోయి, బిగుసుకుపోయిన స్థితిలో రోడ్డుపై మృతదేహాలు కనిపించాయి. కొందరి శరీరాలు పూర్తిగా అగ్నికి ఆహుతవ్వగా.. తల, కాళ్లు, చేతులు విడిపోయి కనిపించాయి. కడపటి వార్తలందేసరికి 50మృతదేహాలు మాత్రమే లభ్యమైనట్లు అధికారులు తెలిపారు. మిగతా వారి మృతదేహాలు పూర్తిగా కాలిపోయే ప్రమాద మున్నందున.. సంఘటనా స్థలి వద్ద నమూనాల సేకరణ జరిగే నిమిత్తం సైన్యంతో పహారా ఏర్పాటు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో 230 మంది ప్రయాణికులు, ఇద్దరు పైలట్లు, 10 మంది విమాన సిబ్బంది ఉన్నారు. వారిలో భారత సంతతికి చెందిన బ్రిటిష్ పౌరుడు రమేశ్ విశ్వాస్‌కుమార్, మరో ప్రయాణికుడు మినహా.. మిగతా వారంతా చనిపోయారు. మృతుల్లో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ కూడా ఉన్నారు. విమానం టేకాఫ్ అయిన 59 సెకన్లలోనే ప్రమాదం చోటుచేసుకున్నట్లు విమానాశ్రయంలోని సీసీటీవీ ఫుటేజీ స్పష్టం చేస్తోంది. అహ్మదాబాద్ పోలీసు కమిషనర్ జీఎస్ మాలిక్, కేంద్ర విమానయాన వర్గాల కథనం ప్రకారం.. ఎయిరిండియా విమానం అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 1.38కి టేకాఫ్ అయ్యింది. సెకన్ల వ్యవధిలోనే.. విమానం 825 అడుగులకు ఎగిరాక.. పైలట్ కెప్టెన్ సుమిత్ సభర్వాల్ 'మేడే కాల్(సహాయాన్ని కోరడం)' ఇచ్చారు. దీంతో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ) సిబ్బంది స్పందించేలోగా విమానం 625అడుగుల ఎత్తుకు పడిపోయింది. అప్పటి నుంచి పైలట్ల ద్వారా సంకేతాలు కట్ అయ్యాయి. టేకాఫ్ అయిన 59వ సెకనుకు.. విమానం మేఘానీనగర్ క్యాంప్ ప్రాంతంలోని జనావాసాలపై కుప్పకూలిపోయింది. ఓ వైద్య కళాశాల హాస్టల్ భవనంపై పడింది. భవనానికి ముందువైపు విమానం తోకభాగం, వెనకవైపు తల భాగం ఉండడాన్ని బట్టి, ప్రమాద తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అంతకు ముందు విమానం ఓ చెట్టును ఢీకొన్నట్లు అధికారులు చెబుతున్నారు. "పెద్ద ఎత్తున వ్యాపించిన మంటల కారణంగా ఎవరినీ రక్షించలేకపోయాం" అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. చూస్తుండగానే.. ఆ ప్రాంతంలో మంటలు వ్యాపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దట్టమైన పొగ ఐదారు కిలోమీటర్ల దూరం వరకు కనిపించిందని పేర్కొన్నారు. బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్‌కు ఇంధన సామర్థ్యం ఎక్కువ(1.25 లక్షల లీటర్లు)గా ఉంటుంది. ఫుల్ ట్యాంక్ కారణంగా భారీ పేలుడు సంభవించడమే కాకుండా.. మంటలు వేగంగా వ్యాపించాయి. రంగంలోకి దిగిన ఫైరింజన్లు గంటపాటు శ్రమించి, మంటలను ఆర్పివేసినా.. భారీ ప్రాణనష్టం చోటుచేసుకుంది. దుర్ఘటన జరిగిన సమయంలో ఆ విమానంలో 230 మంది ప్రయాణికులు, 10 మంది విమాన సిబ్బంది, పైలట్ కెప్టెన్ సుమిత్ సభర్వాల్, కోపైలట్/ఫస్ట్ ఆఫీసర్ క్లైవ్ కుందర్ ఉన్నారు. 169 మంది భారతీయులు, 53మంది బ్రిటిష్ పౌరులు, ఏడుగురు పోర్చుగీస్ పాస్‌పోర్టు హోల్డర్లు, ఒక కెనెడియన్ ఉన్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. మెడికల్ కాలేజీ విద్యార్థులకు సరిగ్గా 1-2గంటల మధ్య మధ్యాహ్న భోజన సమయం కావడంతో.. మెడికోలు హాస్టల్ పైఅంతస్తులోని మెస్‌లో భోజనం చేస్తున్నారు. అదే సమయంలో విమానం పడడంతో 50 మంది మృతిచెందినట్లు దైనిక్ భాస్కర్ గుజరాతీఎడిషన్ 'దివ్య భాస్కర్' పేర్కొంది. పదుల సంఖ్యలో గాయపడినట్లు రిపోర్ట్ చేసింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అహ్మదాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ముందు జాగ్రత్త చర్యగా వడోదరలోని సయాజీ ఆస్పత్రి నుంచి 137 యూనిట్ల రక్త నిల్వలను తెప్పించినట్లు అధికారులు తెలిపారు. అయితే, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. సహాయక చర్యల కోసం ఆరు ఎన్‌డీఆర్ఎఫ్, రెండు బీఎస్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ప్రమాదంపై సమీక్ష నిర్వహించారు. సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని చెప్పారు. ఈ ప్రమాదానికి బాధ్యులను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.



విమానం కూలిన ప్రాంతం నుంచి వస్తున్న పొగ

ఏఏఐబీ, డీజీసీఏ దర్యాప్తు

విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ) రంగంలోకి దిగిందని పౌర విమానయాన శాఖ వెల్లడించింది. ఏఏఐబీ డీజీ, ఇతర అధికారులు సంఘటనాస్థలికి చేరుకుని, పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై సమీక్ష నిర్వహించారు. అటు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) కూడా ప్రమాదంపై దర్యాప్తును ప్రారంభించింది. ప్రమాదానికి కారణాలింకా తెలియరాలేదని పేర్కొంది. కెప్టెన్ సుమిత్ సభర్వాల్‌కు 8,200గంటలు, కోపైలట్‌కు 1,100 గంటల మేర విమానాలను నడిపిన అనుభవం ఉందని వివరించింది. అహ్మదాబాద్ విమానాశ్రయంలోని రన్‌వే 23 నుంచి విమానం గాల్లోకి ఎగిరిన కొద్దిసేపట్లోనే విమానం కూలిపోయినట్లు వివరించింది. పైలట్ 'మేడే కాల్' ఇచ్చిన కాసేపటికే.. ఏటీసీ సిబ్బంది మార్గదర్శనం చేస్తుండగా సిగ్నల్స్ తెగిపోయాయని వెల్లడించింది. ఈ ప్రమాదంపై సమాచారం కోసం హాట్‌లైన్ నంబర్ 1800-5691444నుఏర్పాటు చేసినట్లు తెలిపింది. ప్రమాదం జరిగిన తర్వాత విమానాశ్రయంలో సేవలను నిలిపివేశామని, సాయంత్రం 4 గంటల సమయంలో పునరుద్ధరించినట్లు వెల్లడించింది. పౌరవిమానయాన సంస్థ ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ప్రయాణికుల కుటుంబ సభ్యులు 011-24610843, 9650391589, 9978405304, 070-23251900, 9974111327లకు ఫోన్ చేసి, వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొంది.

దర్యాప్తునకు సహకరిస్తాం: అమెరికా

విమాన ప్రమాదంపై దర్యాప్తునకు భారత అధికారులకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్ఏఏ) తెలిపింది. నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీబోర్డు బృందాలు దర్యాప్తునకు సహకరిస్తాయని పేర్కొంది.

మొత్తం ప్రయాణికులు	: 230
భారతీయులు	: 169
బ్రిటిషర్లు	: 53
పోర్చుగీసు పౌరులు	: 7
కెనెడియన్లు	: 1
విమాన సిబ్బంది	: 12
పైలట్, కోపైలట్	: 2
సీనియర్ సిబ్బంది	: 2
ఇతర క్రూ సభ్యులు	: 8
పైలట్ అనుభవం	: 8,200 గంటలు
కో పైలట్ అనుభవం	: 1,100 గంటలు

ప్రమాదానికి గురైన విమానం వివరాలు

ఫ్లైట్ నంబర్	: ఏఐ171/ఏఐసీ171
విమానయాన సంస్థ	: ఎయిరిండియా
ఎయిర్‌క్రాఫ్ట్ పేరు	: బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్
బయల్దేరిన స్థానం	: అహ్మదాబాద్
గమ్యస్థానం	: లండన్
ఎన్నిగంటల్లో చేరాలి	: 9 గంటల 2 నిమిషాలు
గ్రౌండ్ స్పీడ్	: 174 కేటీఎస్
వెర్టికల్ స్పీడ్	: 896 ఎఫ్‌పీఎం

మృతదేహాల గుర్తింపునకు డీఎన్ఏ పరీక్షలు

మృతదేహాలతో అహ్మదాబాద్ ప్రభుత్వాస్పత్రి మార్చురీ నిండిపోయింది. ఓ వైపు బంధుమిత్రుల ఆర్తనాదాలు, మరోవైపు క్షతగాత్రుల హాహాకారాలతో ఆస్పత్రి ప్రాంగణంలో భయానక పరిస్థితులు కనిపించాయి. విమాన ప్రమాదంలో మృతిచెందిన 241 మందిని గుర్తించేందుకు సాయంత్రం 5 గంటల నుంచి ఆస్పత్రిలో డీఎన్ఏ పరీక్షలను ప్రారంభించారు. డీఎన్ఏ నమూనాలు ఇచ్చేందుకు మృతుల బంధుమిత్రులు బాధాతప్త హృదయాలతో క్యూలైన్‌లో నిలబడ్డ దృశ్యాలు అక్కడి వారిని కలిచివేశాయి. డీఎన్ఏ నమూనాల సేకరణకు సమయం పడుతుందని గుజరాత్ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ధనుంజయ్ ద్వివేది మీడియాకు తెలిపారు. మృతుల తల్లిదండ్రులు లేదా పిల్లలు లేదా సమీప రక్తసంబంధీకులు నమూనాలను ఇవ్వాలని కోరారు. చికిత్స పొందుతున్న మెడికోల పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు.



ప్రమాదం జరిగిన తీరును కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు వివరిస్తున్న రామ్మోహన్ నాయుడు

హుటాహుటిన అహ్మదాబాద్‌కు రామ్మోహన్ నాయుడు

అమరావతి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాదం ఘటన తెలిసిన వెంటనే విజయవాడలో ఉన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో అహ్మదాబాద్ బయలుదేరి వెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహించ తలపెట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొనేందుకు విజయవాడకు వచ్చిన ఆయన... దుర్ఘటన విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన బయలుదేరి అహ్మదాబాద్ వెళ్లారు. ప్రమాదస్థలానికి చేరుకుని, అక్కడ పరిస్థితిని పర్యవేక్షించారు.

ఆ గణేశుడే రక్షించాడు

ప్రమాదానికి గురైన విమానం ఎక్కలేకపోయిన ఓ మహిళ భావోద్వేగం

ట్రాఫిక్‌లో చిక్కుకుని విమానాశ్రయానికి 10 నిమిషాలు ఆలస్యంగా చేరుకోవడమే ఓ మహిళకు వరమైంది. ఎయిరిండియా విమానాన్ని ఎక్కలేకపోవడంతో ఆమె ప్రాణాలతో మిగిలింది. ఇలా 10 నిమిషాల ఆలస్యం భూమి చౌహాన్ అనే మహిళ ప్రాణాన్ని నిలబెట్టింది. భర్తతో కలిసి లండన్‌లో నివాసముంటున్న భూమి చౌహాన్ రెండేళ్ల తర్వాత ఇటీవల స్వదేశానికి వచ్చారు. పనులు ముగించుకుని ఒంటరిగా లండన్ తిరుగుప్రయాణమైన ఆమె.. ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానం ఎక్కాల్సింది. కానీ, విమానాశ్రయానికి 10 నిమిషాలు ఆలస్యంగా చేరుకోవడంతో ఫ్లైట్ మిస్సయ్యారు. అయితే, ప్రమాద వార్త తెలిసిన వెంటనే తన నోట మాట రాలేదని భూమి చౌహాన్ విలేకరులతో అన్నారు. తాను పూజించే వినాయకుడే తనని రక్షించాడని ఆమె భావోద్వేగంగా చెప్పారు.



మృత్యుంజయుడు.. రమేశ్



ఘోర ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానంలోని ఓ ప్రయాణికుడు ప్రాణాలతో బయటపడ్డాడు. వందల మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన నుంచి తప్పించుకున్న రమేశ్ విశ్వాస్‌కుమార్(40) మృత్యుంజయుడిగా నిలిచాడు. విమానం నేలకూలిన వెంటనే బయటికొచ్చిన రమేశ్.. ప్రాణభయంతో ఘటనాస్థలి నుంచి దూరంగా వెళుతుండగా చుట్టుపక్కల వారు అతనిని వీడియో కూడా తీశారు. విమానంలో 11ఏ సీటులో కూర్చున్న రమేశ్.. బోర్డింగ్ పాస్ ఇంకా అతని వద్దే ఉంది. "విమానం టేకాఫ్ అయిన 30 సెకండ్లకు పెద్ద శబ్దం వచ్చింది. ఆ వెంటనే విమానం కూలిపోయింది. కళ్లు తెరిచి చూసేసరికి నా చుట్టూ మృతదేహాలే ఉన్నాయి. వెంటనే పైకి లేచి పరుగెత్తా" అని రమేశ్ పేర్కొన్నారు. ప్రమాదంలో రమేశ్ కళ్లు, వీపు, కాళ్లు, చేతులకు గాయాలవ్వగా.. కొన్ని శరీర భాగాలకు కాలిన గాయాలయ్యాయి. కాగా, భవన నిర్మాణ కార్మికుడైన రమేశ్ భలియా... బ్రిటన్ పౌరుడు. 20 ఏళ్లుగా లండన్‌లోనే ఉంటున్న ఆయన కుటుంబసభ్యులను కలిసేందుకు ఇటీవల భారత్‌కు వచ్చిన రమేశ్, అతని సోదరుడు అజయ్‌కుమార్(45)తో కలిసి లండన్ తిరుగు ప్రయాణమయ్యారు. ప్రమాదం తర్వాత అజయ్ ఆచూకీ తెలియరాలేదు. కాగా, ఈ ప్రమాదం నుంచి మరో వ్యక్తి కూడా ప్రాణాలతో బయటపడినట్లు తెలిసింది. అయితే, ఆ వివరాలు తెలియాల్సి ఉంది.

మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం

బీజే వైద్య కళాశాల హాస్టల్ భవనాన్ని పునర్నిర్మించి ఇస్తాం: టాటా గ్రూపు

న్యూఢిల్లీ/ముంబై, జూన్ 12: అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతుల కుటుంబాలకు టాటా గ్రూపు రూ.కోటి చొప్పున నష్టపరిహారం ప్రకటించింది. గాయపడినవారికి ఉచిత వైద్య సహాయం అందిస్తామని తెలిపింది. విమానం కూలడంతో ధ్వంసమైన బీజే వైద్య కళాశాల హాస్టల్ భవనాన్ని పునర్నిర్మించి ఇస్తామని పేర్కొంది. ఈ మేరకు టాటా సన్స్ ఛైర్‌పర్సన్ చంద్రశేఖరన్ ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారికి సహాయం అందించడంపై దృష్టి కేంద్రీకరించామని, ఇందుకోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామన్నారు. ఘటనా స్థలంలో సహాయ బృందాలతో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. పెను విషాదంతో ఎయిరిండియా ఎంతో వేదనను అనుభవిస్తోందని ఆ సంస్థ సీఈవో, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ పేర్కొన్నారు. సహాయ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తమ సంస్థ తరఫు నుంచి ప్రత్యేక బృందాలు అహ్మదాబాద్ చేరుకున్నాయని తెలిపారు.

అన్ని విభాగాలతో కలిసి నిరంతరం పనిచేస్తున్నాం

» బాధిత కుటుంబాలకు సహకరిస్తున్నాం: అదానీ

అహ్మదాబాద్, జూన్ 12 : విమాన ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని అదానీగ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధితుల కుటుంబాలకు ప్రగాఢసానుభూతి తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ నిర్విరామంగా పనిచేస్తున్నామని, బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తూ మద్దతుగా నిలుస్తున్నామని అదానీ ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, అహ్మదాబాద్ విమానాశ్రయ నిర్వహణను అదానీ గ్రూపు చూస్తోంది. ప్రమాదం జరిగినందున ఎయిర్‌పోర్టులో విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు.



ప్రమాదం తర్వాత విమాన శకలాలను పరిశీలిస్తున్న సహాయక సిబ్బంది

అదే చివరి సిగ్నల్...!

ఫ్లైట్ రాడార్ నుంచి కీలక సమాచారం

ఎయిర్ ట్రాఫిక్‌ను రియల్‌టైమ్‌లో చూపించే లైవ్ ఫ్లైట్ ట్రాకర్ ఫ్లైట్ రాడార్.. ఈ ప్రమాదానికి సంబంధించి కొంత కీలక డేటాను అందించింది. 'టేకాఫ్ అయిన కొన్ని సెకన్ల తర్వాత ఆ విమానం నుంచి మాకు చివరి సిగ్నల్ అందింది. బోయింగ్ 787-8 ప్రమాదంలో ఉన్నట్టు తెలిసింది' అని ఫ్లైట్ రాడార్ ఎక్స్‌లో ట్వీట్ చేసింది. ప్రమాద సమయంలో విమానం భూమి నుంచి 625 అడుగుల ఎత్తులో ఉన్నట్టు ఫ్లైట్ రాడార్ డేటా సూచిస్తోంది. విమానం వెర్టికల్ స్పీడ్ 896 ఫీట్ పర్ మినిట్‌గా నమోదైంది.



మృత్యు ప్రయాణం



డ్రీమ్‌లైనర్.. డిజాస్టర్!

బోయింగ్ 787 విమానం అత్యాధునికం.. **సాంకేతిక సమస్యలూ అత్యధికం!**

- హైడ్రాలిక్ లీక్, బ్యాటరీ సమస్యలతో పలుమార్లు అత్యవసర ల్యాండింగ్
- నాణ్యత, భద్రతా అంశాల్లో అనేక లోపాలు
- పలు విమానయాన సంస్థల ఫిర్యాదులు..

కుప్పకూలడం మాత్రం ఇదే తొలిసారి!



(సెంట్రల్ డెస్క్)

బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్.. అత్యాధునికమైన, ఇంధన సామర్థ్యం కలిగిన విమానంగా పేరుపొందింది. అమెరికాకు చెందిన బోయింగ్ సంస్థ తయారు చేసిన ఈ భారీ విమానంలో ఒకేసారి 242-290 మంది వరకు ప్రయాణించవచ్చు. దీని పొడవు 57 మీటర్లు, రెక్కల పొడవు 60 మీటర్లు, ఎత్తు 17 మీటర్లు. 2011లో బోయింగ్ దీన్ని మార్కెట్‌లోకి తెచ్చింది. పలు విమానయాన సంస్థలు ఖండాంతర ప్రయాణాలకు ఈ డ్రీమ్‌లైనర్లను వినియోగిస్తుంటాయి. విమాన బాడీని 50 శాతం కంటే ఎక్కువ కార్బన్ ఫైబర్ సమ్మేళనాలతో నిర్మించారు. ఇది ఉక్కు కంటే బలంగా, అల్యూమినియం కంటే తేలికగా ఉంటుంది. ఫలితంగా విమానం బరువు తగ్గి, ఇంధన సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఇది పర్యావరణహిత విమానంగా పేరు పొందింది. ఇందులో రెండు హై బైపాస్ టర్బో ఫ్యాన్ ఇంజన్లు ఉంటాయి. జీఈఎన్ఎక్స్ లేదా రోల్స్‌రాయిస్ ట్రెంట్ 1000 ఇంజన్లను వినియోగిస్తారు. వీటి వల్ల బోయింగ్ 767తో పోలిస్తే 20 శాతం ఎక్కువ ఇంధన సామర్థ్యం ఉంటుంది. ఈ విమానం ఏకధాటిగా 13,530 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. 2011లో ఈ విమానం వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. బోయింగ్ సంస్థ ఈ డ్రీమ్‌లైనర్ విమానాన్ని 2009లో తయారు చేసింది. ఇప్పటి వరకు ప్రపంచంలోని పలు విమానయాన సంస్థలకు 1000కి పైగా విమానాలను సరఫరా చేసింది. సాంకేతికతంగా అధునాతన ఫీచర్లు ఉన్నప్పటికీ బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ అనేక వివాదాలు కూడా ఎదుర్కొంది. తయారీ నాణ్యత, భద్రతాపరమైన అంశాల్లో బోయింగ్ రాజీ పడుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. సీట్లు వదులుగా ఉండడం, పిన్స్ సరిగా ఏర్పాటు చేయకపోవడం, నట్లు, బోల్టులు గట్టిగా బిగించకపోవడం, భద్రత లేని ఫ్యూయల్ లైన్ క్లాంపులు వంటి సమస్యలు ఉన్నాయని, తయారీలో నాణ్యతా ప్రమాణాలు దారుణంగా ఉన్నాయని కేఎల్ఎం సహా పలు విమానయాన సంస్థలు ఆరోపించాయి. అంతర్జాతీయంగా ఈ డ్రీమ్‌లైనర్‌లోని సాంకేతిక సమస్యలపై పలు విమానయాన సంస్థలు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నాయి. బోయింగ్‌కు చెందిన నార్త్ చార్లటన్ ప్లాంట్‌లో 2019 నుంచి క్వాలిటీ కంట్రోల్ సమస్యలపై డ్రీమ్‌లైనర్‌ను తనిఖీలు చేస్తూనే ఉన్నారు.

- అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియాకు చెందిన డ్రీమ్‌లైనర్ విమానం టేకాఫ్ అయిన నిమిషాల్లోనే కుప్పకూలింది. ఈ విమానంలో 242 మంది ఉన్నారు. ప్రమాద ఘటన నేపథ్యంలో బోయింగ్ విమానాల భద్రత మరోసారి చర్చనీయాంశమైంది. డ్రీమ్‌లైనర్‌లో ఇప్పటికే పలుమార్లు సాంకేతిక సమస్యలు తలెత్తినా.. విమానం కూలిపోవడం మాత్రం ఇదే తొలిసారి.

సాంకేతిక సమస్యలెన్నో..

బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం హైడ్రాలిక్ లీక్ సమస్యలు, బ్యాటరీ సమస్యలతో ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయిన సందర్భాలు ఉన్నాయి. బోయింగ్ మాజీ ఇంజనీర్, ప్రజావేగు సామ్ సలేపూర్ న్యూయార్క్ టైమ్స్, సీఎన్ఎన్ వంటి మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో గతంలో డ్రీమ్‌లైనర్ విమానంపై ఆరోపణలు చేశారు. బోయింగ్ 777, 787 మోడల్ విమానాల నిర్మాణంలో నాణ్యత లోపించిందని ఆరోపించారు. దీర్ఘకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఈ విమానాల తయారీని పూర్తిగా నిలిపేయాలని డిమాండ్ చేశారు.

ఆరు నెలల కిందట కూడా..

అహ్మదాబాద్‌లో కుప్పలికూన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానంలో ఆర్నెల్ల కిందట కూడా తీవ్రమైన సాంకేతిక సమస్యలు తలెత్తినట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఎయిరిండియాకు చెందిన ఏఐ-171 విమానం అహ్మదాబాద్- లండన్ గాట్విక్ మార్గంలో తిరుగుతుంది. గత డిసెంబరులో కూడా భారీ సాంకేతిక సమస్య తలెత్తడంతో విమానాన్ని అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. దాంతో నిర్వహణ లోపాలు, విమాన భద్రతా ప్రక్రియలో లోపాలపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. అయితే, తనిఖీల అనంతరం మళ్లీ విమానాన్ని నడిపేందుకు అనుమతులు ఇచ్చారు. కాగా, ప్రయాణీలకు అసౌకర్యం, విమాన భద్రత చర్యల్లో నిర్లక్ష్యం వహించినందుకు గాను ఎయిరిండియాకు డీజీసీఏ పలుమార్లు షోకాజ్ నోటీసులివ్వడంతో పాటు జరిమానాలు కూడా విధించింది.

గతంలో జరిగిన ఘటనలివీ..

ఈ ఏడాది ఆరంభంలో వాషింగ్టన్ నుంచి బయల్దేరిన డ్రీమ్‌లైనర్ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో లాగోస్‌లో అత్యవసరంగా దించారు. అమెరికా ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ విమానంలో 245 మంది ప్రయాణికులు, ఎనిమిది మంది సిబ్బంది, ముగ్గురు పైలట్లు ఉన్నారు. ఐవరీ కోస్ట్ గగనతలంలో ఉండగా విమానం హఠాత్తుగా నియంత్రణ కోల్పోయి వేగంగా కిందకు పడిపోతుండడంతో ప్రయాణికులు భయంతో వణికిపోయారు. ఈ ఘటనలో ఆరుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి.

గత ఏడాది సెప్టెంబరులో ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787 విమానం ఢిల్లీ నుంచి బర్మింగ్‌హాం వెళ్తుండగా సాంకేతిక సమస్యలు తలెత్తడంతో మాస్కోలో దించారు. విమానం సురక్షితంగా దిగడంతో 258 మంది ప్రయాణికులు, 17 మంది సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

గత ఏడాది జూలైలో ఎయిరిండియాకే చెందిన డ్రీమ్‌లైనర్ ఢిల్లీ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్తుండగా కార్గో ఏరియాలో సమస్యను గుర్తించిన పైలట్లు ముందుజాగ్రత్తగా సైబీరియాలో ల్యాండ్ చేశారు.

గత ఏడాది మేలో న్యూజిలాండ్‌కు చెందిన విమానం కాక్‌పిట్‌లో సమస్యలు తలెత్తడంతో హఠాత్తుగా కొన్ని వేల అడుగులు కిందకు పడిపోయింది. ఆ ఘటనలో 50 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. దీంతో 787 డ్రీమ్‌లైనర్ విమానాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని బోయింగ్ సంస్థ విమానయాన సంస్థలకు సూచించింది.

మరింత సమాచారం అందాల్సి ఉంది: బోయింగ్

బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం కూలిన ఘటనపై ప్రాథమిక సమాచారం మాత్రమే వచ్చిందని బోయింగ్ సంస్థ తెలిపింది. మరింత సమాచారం అందాల్సి ఉందని పేర్కొంది. ఈ విషయమై ఎయిరిండియాతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపింది. ప్రమాదం ఘటన తెలిసిన వెంటనే కంపెనీ షేర్లు అమెరికా ప్రి-మార్కెట్‌లో భారీగా పతనమయ్యాయి.

"

విమానం గాల్లోకి లేచినట్లే.. ప్రణాళికల తాలూకు కలలు, ఊహలు గాల్లోకి లేచి.. ఆ ఫ్లైట్ ముక్కలైనట్లుగానే అర్ధంతరంగా చిద్రమైపోయాయి. ఆప్తుల కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపాయి. పెళ్లయ్యాక భర్త దగ్గరికి వెళుతూ యువతి, మామగారి పెద్దకర్మ కోసం వెళుతూ ఏడాదిన్నర కుమారుడి సహా ఓ మహిళ, భారత పర్యటనలోని తీపిజ్ఞాపకాలను మూటగట్టుకొని స్వదేశానికి బయలుదేరిన యూకే యువకుడు మరలిరాని లోకాలకు శాశ్వతంగా తరలిపోయారు.



ప్రమాద స్థలంలో అంబులెన్సులు

పెళ్లయ్యాక తొలిసారి భర్త దగ్గరకు వెళుతూ..

రాజస్థాన్‌కు చెందిన యువతి దుర్మరణం

పెళ్లయ్యాక.. తొలిసారి తన భర్త దగ్గరకు వెళుతూ రాజస్థాన్‌కు చెందిన నవ వధువు తిరిగిరాని లోకాలకు చేరింది. రాజస్థాన్‌కు చెందిన బలోత్రా జిల్లాకు చెందిన మదన్ సింగ్ రాజ్‌పుత్ కుమార్తె ఖుష్బూ వివాహం జనవరి 18న లండన్‌లో ఉంటున్న వైద్యుడు రాజ్‌పురోహిత్‌తో జరిగింది. పెళ్లయినప్పటి నుంచి స్వదేశంలోని అత్తింట్లో ఉంటున్న ఖుష్బూ, తొలిసారి భర్త రాజ్‌పురోహిత్ వద్దకు వెళ్లేందుకు లండన్ బయలుదేరింది. ప్రమాదం గురించి తెలిసి.. కుటుంబసభ్యులు, గ్రామస్థులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

నా కూతురు.. మనుమడు ఎక్కడ?

పుణెవాసి కన్నీటి పర్యంతం..

ఉదయం తొమ్మిదింటికే కూతురుతో మాట్లాడాను.. ఇప్పుడామె గురించి తెలియడం లేదు అని పుణెకు చెందిన మనీశ్ కన్నీటిపర్యంతమయ్యాడు. అహ్మదాబాద్ విమానంలో మనీశ్ కూతురు యశా, ఆమె ఏడాదిన్నర కుమారుడు రుద్ర, యశా అత్తగారు ఉన్నట్లు చెప్పారు. ఇప్పుడు వీరి ఆచూకీ గురించి ఎవ్వరూ చెప్పడం లేదని, ఇప్పటివరకు అధికారులెవరూ తమను సంప్రదించలేదని మనీశ్ వాపోయాడు. ఆస్పత్రిని ముఖ్యమంత్రి సందర్శించిన తర్వాతే లోపలికి అనుమతిస్తామని బాధితులకు చెబుతున్నారని చెప్పాడు. యూకేలో ఉంటున్న తన కూతురు మామగారు నెలక్రితం అహ్మదాబాద్‌లో చనిపోయారని, 22న జరగాల్సిన కర్మక్రియలకు హాజరయ్యేందుకు బయలుదేరారని చెప్పాడు.



మృతుల కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు

భారత్‌లో ఇదే చివరి రాత్రి..

ఇన్‌స్టాలో యూకే యువకుడి పోస్టు

జామీ మీక్! యోగా పట్ల గొప్ప ఆసక్తిగల ఈ బ్రిటన్ యువకుడు.. 'భారత్‌లో ఇదే చివరి రాత్రి' అని పోస్టు పెట్టాడు గానీ.. తన జీవితంలోనే 'చివరిది' అని ఊహించలేకపోయాడు. తన భారత పర్యటనను ముగించుకొని జామీ గురువారం లండన్ విమానం ఎక్కాడు. అంతకుముందు భారత్‌లో తాను చవిచూసిన మధురమైన జ్ఞాపకాలను క్రోడీకరిస్తూ 'గుడ్‌బై ఇండియా' అని భావోద్వేగపూరితమైన పోస్టు పెట్టాడు. భారత్‌లో తాను ఊహించని గొప్ప అనుభూతిని పొందానని.. మనసు కదిలించే జ్ఞాపకాలతో యూకే వెళుతున్నానంటూ 'గుడ్‌బై ఇండియా' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నాడు. భారత్‌లో చివరిరోజు.. గుజరాతీ థాలీ రుచి చూడటం.. హోటల్‌లో ఓ రాత్రి గడపడం అద్భుతం అని రాసుకొచ్చాడు.

పెళ్లికి హాజరై తిరిగి వెళుతూ..

రెండేళ్లపాప సహా తల్లీకూతుళ్ల దుర్మరణం

జసాధికాబెన్ మహ్మద్, మియాన్ షెత్వాలా తల్లీకూతుళ్లు. షెత్వాలాకు రెండేళ్ల పాప కూడా ఉంది. వీరు లండన్‌లో ఉంటున్నారు. ఈ తల్లీకూతుళ్లు పాపతో కలిసి ఓ పెళ్లికని భారత్‌కొచ్చారు. గురువారం విమానంలో తిరుగుప్రయాణమై ప్రమాదంలో మృతిచెందారు. చోటా ఉదేపూర్‌కు చెందిన 32 ఏళ్ల నాన్సీ చిత్రేశ్ పటేల్‌కు ఇటీవలే పెళ్లయింది. ఒంటరిగా విమానంలో బయటుదేరింది. వడోదరకు చెందిన దంపతులు నీరజ్, అపర్ణ.. గాంధీనగర్‌కు చెందిన గౌరవ్ భాయ్, కల్యాణిబెన్ దంపతులు.. సూరత్‌కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు... అఖిల్ అబ్దుల్లా (32), హనా అఖిల్ నానబావా (31), హనా కుమార్తె సారా ఆఖిల్ ప్రాణాలొదిలారు.

ప్రమాద దృశ్యాలు కలచివేస్తున్నాయి

: బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారతీయులతో పాటు అనేక మంది బ్రిటన్ పౌరులు ప్రయాణిస్తున్న విమాన ప్రమాద దృశ్యాలు కలచివేస్తున్నాయని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నానని, బ్రిటన్‌కు చెందిన ప్రయాణికుల కుటుంబాలకు అండగా ఉంటామని ఒక ప్రకటనలో తెలిపారు. వారికి సహాయ కార్యక్రమాల కోసం ఢిల్లీ, లండన్‌లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ లామీ పేర్కొన్నారు. భారత్‌లోని హై కమిషన్ అక్కడి అధికారులతో కలిసి పనిచేస్తోందని సోషల్ మీడియాలో తెలిపారు. 020 7008 5000 నంబరుతో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామన్నారు.

విమాన ప్రమాద మృతుల కుటుంబాలకు... మాంట్రియల్ ఒప్పందం ప్రకారం బీమా సొమ్ము!

విమాన ప్రమాద మృతుల కుటుంబాలకు బీమా సొమ్మును మాంట్రియల్ ఒప్పందం ప్రకారం చెల్లిస్తారని నిపుణులు పేర్కొంటున్నారు. ఆ ఒప్పందంలో భారత్ కూడా భాగస్వామి. మొదటగా వివిధ దేశాల మధ్య 1999లో ఈ ఒప్పందం కుదిరినా భారత్ 2009లో చేరింది. దీని ప్రకారం విమానయాన సంస్థ ప్రయాణికులకు ఎంత సొమ్ము చెల్లించాలనేది వారు ఏ దేశానికి చెందిన వారనే అంశంపై ఆధారపడి ఉంటుందని ప్రుడెంట్ ఇన్సురెన్స్ బ్రోకర్స్ వైస్ ప్రెసిడెంట్ హితేష్ గిరోత్రా తెలిపారు. వయసు, వృత్తి వంటి ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఎయిర్‌లైన్స్ సంస్థ అప్పటికప్పుడు నష్టపరిహారం ప్రకటించినప్పటికీ మాంట్రియల్ ఒప్పందం ప్రకారం సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని హౌడెన్ (ఇండియా) ఎండీ, సీఈవో అమిత్ అగర్వాల్ పేర్కొన్నారు.





మాటలకందని విషాదం

- విమాన ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి
- మనసును కలచివేస్తోంది: రాష్ట్రపతి ముర్ము
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం రేవంత్

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఇతర రాష్ట్రాల సీఎంలు, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, పలువురు సినీ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ హృదయ విదారక ఘటన మాటలకందని విషాదమని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. సహాయ చర్యలపై మంత్రులు, అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే ప్రధాని కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు తక్షణమే అవసరమైన సహాయం అందించాలని ప్రధాని ఆదేశించారు. మోదీ శుక్రవారం ప్రమాదస్థలిని సందర్శిస్తారు. ఏపీలోని విజయవాడలో ఎన్డీయే ప్రభుత్వ మొదటి వార్షికోత్సవ కార్యక్రమాలకు హాజరైన రామ్మోహన్ నాయుడు... విమాన ప్రమాద వార్త తెలిసిన వెంటనే అహ్మదాబాద్‌కు బయలుదేరారు. ఈ ప్రమాదం మనసును కలచివేస్తోందని రాష్ట్రపతి ముర్ము తెలిపారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం మద్దతుగా నిలుస్తుందన్నారు. విమాన ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని తెలిపారు. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, జీ కిషన్‌రెడ్డి, బండి సంజయ్, శివరాజ్ సింగ్ చౌహాన్, పీయూష్ గోయెల్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి తదితరులు విమాన ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రయాణికులు, స్థానికులతో పాటు వైద్య విద్యార్థులు మరణించడం కలచివేస్తోందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. కేటీఆర్, హరీశ్‌రావు, బీజేపీ ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్ తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంతాప సూచకంగా గురువారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరగాల్సిన పలు కార్యక్రమాలను రద్దు చేశారు. ఈ ప్రమాదంపై విమానయాన సంస్థలు ఇండిగో, స్పైస్‌జెట్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ఈ కష్ట సమయంలో ఎయిరిండియాకు మద్దతుగా నిలుస్తామని పేర్కొన్నాయి. ఈ పెను విషాదం గుండెను పిండేస్తోందని బాలీవుడ్ నటులు అక్షయ్ కుమార్, అలియా భట్, విక్కీ కౌశల్, కరీనా కపూర్ తదితరులు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

ప్రమాదాల బోయింగ్..!

ఎగిరే శవపేటికల్లా విమానాలు.. కొన్నేళ్లుగా వరుసగా దుర్ఘటనలు.. నాణ్యత, భద్రతా ప్రమాణాల్లో లోపాలు

- ఆ సంస్థ ఉద్యోగులే స్వయంగా బయటపెట్టినా మారని తీరు
- సునీతా విలియమ్స్ ఐఎస్ఎస్‌లో చిక్కుకుపోవడానికీ ఇదే కారణం
- ప్రస్తుతం భారత ఎయిర్‌లైన్స్ సంస్థల వద్ద 185 బోయింగ్ విమానాలు.. మరో 645 విమానాలకు ఆర్డర్లు



అహ్మదాబాద్‌లో విమానం కూలిపోయిన ఘటనతో బోయింగ్ సంస్థ విమానాల పనితీరుపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. ఇటీవలికాలంలో విమానాల్లో సాంకేతిక లోపాల నుంచి తలుపులు ఊడిపోవడం వంటి నిర్మాణ లోపాల దాకా వరుస ఘటనలు ఆ విమానాల భద్రతా ప్రమాణాలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. వాస్తవానికి బోయింగ్ సంస్థలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులే.. విమానాల భద్రతా ప్రమాణాల పట్ల ఆ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును బయటపెట్టారు. ఆ ఘటనలతో అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) బోయింగ్ విమానాల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. ఈ క్రమంలో భద్రతా ప్రమాణాల లోపాన్ని అంగీకరిస్తూ.. బోయింగ్ సీఈవో డేవ్ కాల్హోన్ తన పదవికి రాజీనామా చేశారు. సంస్థలో 737 విమానాల విభాగం చీఫ్ ఎడ్ క్లార్క్ కూడా వైదొలిగారు.

సీఈవోలు మారినా.. భద్రత లేక..

వాస్తవానికి డేవ్ కాల్హోన్‌కు ముందు డెన్నిస్ ములెన్‌బర్గ్ బోయింగ్ సీఈవోగా పనిచేశారు. 2018, 2019లలో రెండు 737 మ్యాక్స్ 8 విమానాలు కూలిపోయి 346 మంది మరణించడంతో.. బోయింగ్ విమానాల భద్రతపై విమర్శలు చెలరేగాయి. ఆ రెండు విమానాలు కూడా టేకాఫ్ అయిన కొన్ని నిమిషాల్లోనే కూలిపోవడం గమనార్హం. దీనితోబోయింగ్ సంస్థ డెన్నిస్ ములెన్‌బర్గ్‌ను తొలగించింది. సీఈవోగా డేవ్ కాల్హోన్‌ను నియమించింది. భద్రతా ప్రమాణాలను పెంచి సంస్థపై నమ్మకాన్ని తిరిగి నిలబెడతానంటూ పదవిని చేపట్టిన ఆయన.. అదే భద్రతా లోపంతో రాజీనామా చేయడం గమనార్హం. 2024 జనవరిలో అమెరికాలోని అలాస్కాలో ప్రయాణిస్తున్న బోయింగ్ 737 మ్యాక్స్ 9 విమానం గాలిలో ఉండగానే దాని డోర్ ఊడిపోయింది. అదే ఏడాది డిసెంబర్‌లో దక్షిణ కొరియాలో బోయింగ్ 737-800 విమానం కూలిపోయి 179 మంది చనిపోయారు. తాజాగా అహ్మదాబాద్‌లో బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం కూలిపోయింది. ప్రస్తుతం బోయింగ్ సీఈవోగా కెల్లీ ఓర్ట్‌బెర్గ్ పనిచేస్తున్నారు.


సునీతా విలియమ్స్ చిక్కుకుపోవడానికీ..

భారత సంతతి నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌లు తొమ్మిది నెలలపాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చిక్కుకుపోవడానికి కూడా బోయింగ్ సంస్థ వైఫల్యమే కారణం. బోయింగ్ సంస్థకు చెందిన స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో థ్రస్టర్లు సరిగా పనిచేయకపోవడం, హీలియం లీకేజీ సమస్యలు తలెత్తాయి. వాటిని సరిదిద్దడానికి బోయింగ్, నాసా ఎంతగా ప్రయత్నించినా వీలుకాలేదు. చివరికి ఎలాన్ మస్క్ స్పేస్ ఎక్స్ సంస్థకు చెందిన క్రూ-9 మిషన్ సాయంతో వారిని భూమ్మీదికి తీసుకురావాల్సి వచ్చింది.

మన ఎయిర్‌లైన్స్‌లో బోయింగ్ విమానాలెన్నో..

ప్రస్తుతం మన దేశ ఎయిర్‌లైన్స్ సంస్థలు సుమారు 185 బోయింగ్ విమానాలను వినియోగిస్తున్నాయి. బోయింగ్ 737 మ్యాక్స్, 777-200 ఎల్ఆర్, 777-300ఈఆర్, 787-8 డ్రీమ్‌లైనర్, 787-9 డ్రీమ్‌లైనర్ విమానాలను వాడుతున్నాయి. విదేశాలకు సర్వీసులు నిర్వహించే ఎయిర్ ఇండియా వద్ద మొత్తం 198 విమానాలుంటే అందులో 40 బోయింగ్‌వే, దేశీయ సర్వీసులు నిర్వహించే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వద్ద ఉన్న మొత్తం 104 విమానాలూ బోయింగ్‌వే. ఇండిగో సంస్థ 437 విమానాలతో సర్వీసులు నిర్వహిస్తుండగా అందులో ఎనిమిది, స్పైస్‌జెట్ వద్ద ఉన్న 62 విమానాల్లో 33 విమానాలు (లీజుకు తీసుకున్నవి కలిపి) బోయింగ్ కంపెనీవే. అంతేకాదు ఈ సంస్థలు పెద్ద సంఖ్యలో బోయింగ్ విమానాల కోసం ఆర్డర్లు కూడా పెట్టాయి. ఎయిర్ ఇండియా సుమారు 290 విమానాలకు ఆర్డర్ పెట్టింది. స్పైస్‌జెట్ గతంలోనే 205 విమానాలకు ఆర్డర్ పెట్టగా.. గత ఏడాది డిసెంబర్ నాటికి 13 విమానాలు డెలివరీ అయ్యాయి. తర్వాత స్పైస్‌జెట్‌కు ఆర్థిక ఇబ్బందులతో నిలిచిపోయింది. విమానాల కొనుగోలును పునరుద్ధరించుకోవాలని తాజాగా ఆ సంస్థ నిర్ణయించింది. ఇక కొత్తగా వచ్చిన ఆకాశ ఎయిర్ సంస్థ కూడా 150 బోయింగ్ విమానాల కోసం ఆర్డర్ చేసింది.

\- సెంట్రల్ డెస్క్



ఎయిరిండియా విమాన ప్రమాదంలో రాజస్థాన్‌కు చెందిన ఐదుగురు సభ్యుల ఓ కుటుంబం దుర్మరణం చెందింది. రాజస్థాన్‌లోని బన్సవారాలో పేరొందిన వైద్యురాలైన డాక్టర్ కోని వ్యాస్.. తన భర్త ప్రదీప్ జోషి, తమ ముగ్గురు పిల్లలతో కలిసి లండన్‌లో స్థిరపడాలని ఎంతోకాలంగా అనుకుంటున్నారు. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి కావడంతో రెండ్రోజుల క్రితమే వ్యాస్ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. లండన్ వెళ్లేందుకు కుటుంబం అంతా కలిసి అహ్మదాబాద్‌లో గురువారం విమానం ఎక్కారు. ఆ వెంటనే వారంతా ఓ సెల్ఫీ తీసుకుని కుటుంబసభ్యులు, స్నేహితులకు పంపి తమ ఆనందాన్ని పంచుకున్నారు. కాసేపటికే ఆ విమానం కూలడంతో వారంతా లోకాన్ని వీడారు.

మిగతా సర్వీసులపై ప్రభావం

అహ్మదాబాద్, జూన్ 12: గుజరాత్‌లోని అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి లండన్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా ఏఐ-171 విమానం బయలుదేరిన కొద్ది క్షణాల్లోనే కూలిపోవడంతో మిగతా విమాన సర్వీసులపై ప్రభావం పడింది. ప్రయాణ సమయాల్లో తాజా మార్పులకు సంబంధించి ప్రయాణికులు తమ ఎయిర్‌లైన్స్ సంస్థలను సంప్రదించాలంటూ అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ అధికారులు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రయాణికులు ఇప్పటికే బుక్ చేసుకున్న టికెట్ల తాలూకు మొత్తాన్ని తమ వెబ్‌సైట్ ద్వారా తిరిగి పొందవచ్చని ఇండిగో ఎక్స్‌లో పోస్ట్ చేసింది. టికెట్‌లు మళ్లీ బుక్ చేసుకోవాలని కూడా సూచించింది. తదుపరి నోటీసు వచ్చేవరకు అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో అన్ని విమాన సర్వీసులను నిలిపివేసినట్లు స్పైస్ జెట్ ప్రకటించింది. విమానాలకు సంబంధించిన తాజా సమాచారం తమ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవాలని సూచించింది. మరోవైపు కోల్‌కతా నుంచి బయలుదేరి అహ్మదాబాద్‌లో దిగాల్సిన ఇండిగో 6ఈ- 318 విమానం.. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం నేపథ్యంలో తిరిగి వెనక్కు కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి ల్యాండయింది. మధ్యాహ్నం 1:49కు కోల్‌కతా నుంచి అహ్మదాబాద్‌కు బయలుదేరి తిరిగి కోల్‌కతాలో 2:52కు దిగింది.

ప్రయాణికుల కుటుంబ సభ్యుల కోసం సహాయక విమానాలు

విమాన ప్రమాదంలో మరణించిన ప్రయాణికులు, సిబ్బంది కుటుంబ సభ్యుల కోసం ఎయిర్ ఇండియా రెండు ప్రత్యేక విమానాలు నడపనుంది. ఢిల్లీ, ముంబై నుంచి అహ్మదాబాద్‌కు సహాయక విమాన సర్వీసులు ఏర్పాటు చేసింది.



కాబోయే డాక్టర్లు.. కల చెదిరి..



హాస్టల్ మెస్‌పై విమానం కూలడంతో పెద్ద సంఖ్యలో వైద్య విద్యార్థులు మృతి!



హాస్టల్ మెస్‌లో చెల్లాచెదురైన కంచాలు

భోజనం చేస్తూనే కన్నుమూసిన కొందరు

భవనంలో ఎటు చూసినా విధ్వంసమే..

అహ్మదాబాద్, జూన్ 12: వారంతా కాబోయే వైద్యులు.. ప్రమాదంలో ఉన్నవారికి ప్రాణం పోసి కాపాడేవారు.. సరదాగా మాట్లాడుకుంటూ మధ్యాహ్న భోజనం చేస్తున్నారు.. ఉన్నట్టుండి ఆ భవనంపై విమానం కుప్పకూలడంతో వారు కన్న కలలు చెదిరిపోయాయి. భోజనం చేస్తున్న కొందరు వైద్య విద్యార్థులు అలాగే ప్రాణాలు కోల్పోగా.. శిథిలాలు మీద పడి చాలా మంది తీవ్రంగా గాయపడ్డారు. మిగతా వారంతా కంచాల్లో ఆహారాన్ని ఎలా ఉన్నది అలా వదిలేసి భయంతో పరుగులు పెట్టారు. అహ్మదాబాద్‌లోని బీజే వైద్య కళాశాల హాస్టల్ భవనంపై ఎయిరిండియా విమానం కూలిపోయినప్పటి హృదయ విదారక దృశ్యమిది. ప్రమాదం జరిగిన సమయంలో నాలుగో అంతస్తులోని మెస్‌లో 60మందికి పైగా వైద్య విద్యార్థులు, పీజీ చేస్తున్న రెసిడెంట్ వైద్యులు భోజనం చేస్తున్నారని అంచనా. వీరిలో చాలా మంది ఆచూకీ తెలియలేదు. శిథిలాలను తొలగిస్తూ మృతదేహాలను వెలికి తీస్తున్నారు. ఇప్పటివరకు ఐదు మృతదేహాలను గుర్తించారు. కొందరు క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. "చాలా మంది వైద్య విద్యార్థులు, పీజీ వైద్యుల ఆచూకీ లభించడం లేదు. కొందరి మృతదేహాలను మాత్రం గుర్తించారు. ఇక్కడి పరిస్థితిని చూస్తుంటే 50 మంది వరకు మరణించి ఉంటారు." అని బీజే వైద్య కళాశాలకు చెందిన వైద్యుడు కెవ్లిన్ నిర్వాన్ పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో 50 మంది వైద్య విద్యార్థులు మృతిచెందినట్టుగా దైనిక్ భాస్కర్ వార్తా సంస్థ తమ వెబ్ సైట్‌లో పేర్కొంది.



విలపిస్తున్న మృతుల బంధువులు

కిందకు దూకేసిన కొందరు..

ఇక ఇదే భవనంలోని మిగతా అంతస్తుల్లో రెసిడెంట్ వైద్యులు కుటుంబాలతో నివసిస్తున్నారు. విమానం కుప్పకూలి, మంటలు చెలరేగడంతో రెండు, మూడో అంతస్తుల్లోని కొంత భాగం కూడా ధ్వంసమైంది. దీనితో ఆయా కుటుంబాల వారు కూడా మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కొందరు రెండు, మూడో అంతస్తుల నుంచి కిందికి దూకేసినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. "నేను, నా జూనియర్ డాక్టర్ గాయపడ్డాం. మరో 30-40 మందికి తీవ్రగాయాలయ్యాయి. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు చెబుతున్నారు" అని డాక్టర్ శ్యామ్ గోవింద్ తెలిపారు. ఇక తన కుమారుడు లంచ్ బ్రేక్ కోసమని క్యాంటీన్‌కు వెళ్లాడని, ప్రమాదం జరగడంతో రెండో అంతస్తు నుంచి కిందికి దూకేశాడని ఓ వైద్య విద్యార్థి తల్లి రమీలా వెల్లడించారు.

ఎటు చూసినా విధ్వంసమే

విమానం కుప్పకూలడం, భారీగా మంటలు చెలరేగడంతో.. హాస్టల్ భవనంలో మెస్ సహా చాలా భాగం తీవ్రంగా ధ్వంసమైంది. దీనికి సంబంధించి వైద్య విద్యార్థులు, సహాయక చర్యల్లో పాల్గొన్న స్థానికులు తీసిన వీడియోలు, ఫొటోలు వైరల్‌గా మారాయి. అందులో ఎటు చూసినా కూలిపోయి, చెల్లాచెదురుగా పడిన భవన పైకప్పు, గోడల శిథిలాలు, విమానం భాగాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలు కనిపిస్తున్నాయి. విమానం తోక భాగం కొంత ఆ భవనం నాలుగో అంతస్తులోకి చొచ్చుకెళ్లి, పైనుంచి వేలాడుతూ కనిపిస్తోంది. మెస్‌లోని కొన్ని టేబుళ్లపై కంచాలు, వాటిలో మిగిలి ఉన్న ఆహారం దుర్ఘటనతో నెలకొన్న విషాదానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. కాగా, భారత వైద్య రంగంలో ఇదొక దారుణ విషాదమని, భవిష్యత్తు వైద్యులను కోల్పోవడం బాధాకరమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధి ధ్రువ్ చౌహాన్ పేర్కొన్నారు.

గాల్లో ప్రాణాలు!

దేశ చరిత్రలో వినాశకరమైన విమాన ప్రమాదాల జాబితా ఇదీ...

- **2020 ఆగస్టు 7** ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం దుబాయ్ నుంచి కేరళలోని కోజికోడ్ చేరుకుంది. అక్కడి ల్యాండ్ అవుతుండగా వర్షం కారణంగా అదుపుతప్పి రన్‌వే నుంచి జారిపోయింది. టేబుల్‌టాప్ రన్‌వేను దాటి పక్కనే ఉన్న లోయలో పడి పోయింది. విమానంలో 190 మంది ఉండగా 21 మంది ప్రాణాలు కోల్పోయారు.
- **2010 మే 22న** దుబాయ్ నుంచి వచ్చిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన బోయింగ్ విమానం కర్ణాటకలోని మంగళూరు విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుండగా టేబుల్‌టాప్ రన్‌వేకు అవతల ఉన్న లోయలో పడిపోవడంతో 158 మంది ప్రాణాలు కోల్పోయారు.
- **2000 జూలై 17న** అలయన్స్ ఎయిర్ సంస్థకు చెందిన బోయింగ్ విమానం బిహార్‌లోని పాట్నాలో ల్యాండ్ అవుతున్న సమయంలో అదుపుతప్పి జనావాసాలపై కూలిపోయింది. ఈ ఘటనలో విమానంలో ఉన్న 55 మందితో పాటు కింద ఉన్న మరో ఐదుగురు మరణించారు.
- **1996 నవంబరు 12న** హరియాణా సమీపంలోని చార్ఖి దాద్రి సమీపంలో సౌదీకి చెందిన బోయింగ్ 747 విమానం, కజకిస్థాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఇల్యూషిన్ ఇల్-76 విమానం ఢీకొన్న ఘటనలో 349 మంది ప్రాణాలు కోల్పోయారు. కజకిస్థాన్ విమానం నిర్దేశించిన ఎత్తు కంటే కిందకు దిగడంతో ప్రమాదం సంభవించింది.
- **1991 ఆగస్టు 16న** కోల్‌కతా నుంచి ఇంఫాల్‌కు వెళ్తున్న ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం నావిగేషన్ లోపం కారణంగా కొండల్లో కూలిపోవడంతో 59 మంది ప్రయాణికులు మరణించారు.
- **1990 ఫిబ్రవరి 14న** ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం బెంగళూరులోని హెచ్ఏఎల్ విమానాశ్రయానికి చేరుకుంటుండగా కూలిపోయింది. ప్రమాద సమయంలో విమానంలో ఉన్న 146 మందిలో 92 మంది మృతిచెందారు.
- **1988 అక్టోబరు 19న** ముంబై నుంచి అహ్మదాబాద్ వస్తున్న బోయింగ్ 737-200 విమానం పొగమంచు కారణంగా విమానాశ్రయానికి సమీపంలో చెట్లను ఢీకొని కూలిపోయింది. విమానంలో ఉన్న 135 మందిలో 133 మంది దుర్మరణం చెందారు.
- **1985 జూన్ 23న** మాంట్రియల్- లండన్ ఎయిరిండియా కనిష్క విమానం ఐర్లాండ్ సమీపంలో నేలకు 31 వేల అడుగుల ఎత్తున పేలిపోయింది. 1984లో ఆపరేషన్ బ్లూస్టార్‌కు ప్రతీకారంగా సిక్కు ఉగ్రవాదులు ఈ విమానంలో సూటుకేసు బాంబు అమర్చారు. మొత్తం 329 మంది మరణించారు.
- **1982 జూన్ 21న** కౌలాలంపూర్ నుంచి ముంబైకి వస్తున్న బోయింగ్ విమానం భారీ వర్షం కారణంగా ముంబైలోని శాంతాక్రాజ్ విమానాశ్రయంలో ల్యాండింగ్ అవుతుండగా కూలిపోయింది. ఈ ఘటనలో 58 మంది మృతిచెందారు.
- **1978 జనవరి 1న** ముంబైనుంచి దుబాయ్ వెళ్తున్న ఎయిరిండియా బోయింగ్ 747 విమానం అరేబియా సముద్రంలో కూలిపోయింది. 213 మంది ప్రయాణికులు మృత్యువాత పడ్డారు.
- **1976 అక్టోబరు 12న** ముంబై నుంచి మద్రాస్ వెళ్తున్న ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఇంజన్ వైఫల్యంతో టేకాఫ్ అయిన కొద్దిసేపటికి కూలిపోవడంతో 54 మంది ప్రాణాలు కోల్పోయారు.

మెడికల్ కాలేజీ ప్రాంగణంలో విమాన శకలాలు





ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

అసలేం జరిగింది!?

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై భిన్నాభిప్రాయాలు

న్యూఢిల్లీ, జూన్ 12: అహ్మదాబాద్‌లో బోయింగ్ 787 విమానం కూలిన ఘటనపై నిపుణులు పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. అలాగే భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. టేకాఫ్ అయిన వెంటనే కూలిపోవడానికి గల కారణాలు అంతుచిక్కడం లేదని అంటున్నారు. అయితే మాజీ పైలట్ ఎహసాన్ ఖలీద్ మాత్రం విమానం ల్యాండింగ్ గేర్ కిందకు ఉండడంపై అనుమానం వ్యక్తం చేశారు. పైలట్ ఏటీసీకి 'మేడే' కాల్ ఇచ్చారంటే విమానంలో వ్యవస్థ విఫలమైందని అర్థమన్నారు. "ల్యాండింగ్ గేర్ ఎందుకు కిందకు ఉందో అర్థం కావడం లేదు. విమానం గాల్లోకి లేచిన వెంటనే ల్యాండింగ్ గేర్ లోపలికి వెళ్లిపోతుంది. కూలిన విమానం ల్యాండింగ్ గేర్ కిందకు ఉందంటే ఇంజన్ విఫలమైనట్లు గుర్తించాలి. ప్రమాదానికి ఇలాంటి ఎన్నో అంశాలు కారణమై ఉంటాయి. అయితే ల్యాండింగ్ గేర్ ఎందుకు కిందకు ఉందన్నదే పెద్ద ప్రశ్నగా మారింది. విమానం కూలడానికి కారణం ఏంటన్నది ఇప్పుడే ఎవరూ చెప్పలేరు" అని ఖలీద్ అన్నారు. విమానం శక్తిని కోల్పోయినట్లు కనిపించిందని, దానికి ఇంజన్‌లో లోపం కూడా కారణమై ఉండొచ్చని తెలిపారు. అయితే ఒకేసారి రెండు ఇంజన్లు విఫలమయ్యే అవకాశం ఉండదన్నారు. అంత తక్కువ సమయంలో పక్షి ఢీకొనడం వల్ల ఇంజన్లు ఫెయిలయ్యే చాన్స్ కూడా ఉండదని చెప్పారు. అమెరికా ఏరోస్పేస్ సేఫ్టీ కన్సల్టెంట్ ఆంటోనీ బ్రిక్‌హౌస్ కూడా ఇలాంటి అభిప్రాయాలే వ్యక్తం చేశారు. టేకాఫ్ అయిన విమానానికి ల్యాండింగ్ గేర్ ఆ స్థితిలో ఉండడం అసహజంగా అనిపిస్తోందన్నారు. కూలిపోయే ముందు ఆ విమానాన్ని చూస్తే రన్‌వే వైపు వెళ్తున్నట్లుగా అనిపించిందని చెప్పారు.

స్లాట్‌లు, ఫ్లాప్‌లు సరిగానే ఉన్నాయా?

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై అమెరికా నిపుణులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అసలు విమానం ప్రయాణానికి పూర్తిగా సిద్ధంగా ఉందా? అన్నది కూడా తేలాల్సి ఉందని అంటున్నారు. ఏవియేషన్ సేఫ్టీ కన్సల్టెంట్ జాన్ ఎం కాక్స్ మాట్లాడుతూ.. ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాన్ని ప్రయాణానికి పూర్తిస్థాయిలో సన్నద్ధం చేశారా? అన్నది విచారణ అధికారులు తేల్చాల్సి ఉందని చెప్పారు. విమాన రెక్కలకు ఉండే స్లాట్‌లు, ఫ్లాప్‌లు సరైన స్థితిలోనే ఉన్నాయా? విమానం ఎగిరేందుకు అనువుగా ఉన్నాయా? అన్న అంశంపైనా దర్యాప్తు చేయాలన్నారు. విమానం ఫొటోలు చూస్తుంటే ఈ అనుమానం కలుగుతోందని చెప్పారు. విమానాలను నడపడంలో టేకాఫ్, ల్యాండింగే అత్యంత ప్రమాదకరమైన దశలని మరో నిపుణుడు వ్యాఖ్యానించారు. విమానాలు 200 మీటర్లు లేదా 650 అడుగులకు పైగా ఎత్తుకు చేరుకోలేనప్పుడు పైలట్లు ఆలస్యమైనా సరే టేకాఫ్‌ను ఆపేస్తారని తెలిపారు. కానీ, ఈ ప్రమాద ఘటనలో టేకాఫ్ చివరి దశలో ఉండగా హఠాత్తుగా సమస్య ఉత్పన్నమై ఉంటుందని చెప్పారు.

ఇంజన్ల విఫలం లేదా పక్షి ఢీకొట్టడం..

అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి కారణం ఇంజన్లు విఫలమవడం లేదా పక్షి ఢీకొట్టడం అయి ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. విమానం కూలిన వీడియోలు చూస్తుంటే టేకాఫ్‌కు అవసరమైన శక్తిని అందించడంలో ఇంజన్లు విఫలమైనట్లు కనిపిస్తోందని ముగ్గురు సీనియర్ వైడ్ బాడీ పైలట్లు అభిప్రాయపడ్డారు. ఒక ఇంజన్ విఫలమైనట్లు కనిపించడం లేదని, అలా అయి ఉంటే విమానం ఊగిపోతుందని ఓ పైలట్ పేర్కొన్నారు. కానీ, ఈ ఘటనలో విమానం స్థిరంగానే ఉందన్నారు. అంటే రెండు ఇంజన్లూ విఫలమై ఉంటాయని, రెండు ఇంజన్లలోనూ థ్రస్ట్ కోల్పోయి ఉండొచ్చని మరో కమాండర్ పేర్కొన్నారు. పక్షులు ఢీకొనడం వల్ల కూడా రెండు ఇంజన్లలో మంటలు చెలరేగి ఉండొచ్చని అన్నారు. కాగా, విమానం రెండు ఇంజన్లు శక్తిని కోల్పోయి ఉంటాయని మూడో పైలట్ చెప్పారు. ఒక ఇంజన్ విఫలమై ఉంటుందని, ల్యాండింగ్ గేర్ పైకి రాకపోవడంతో రెండో ఇంజన్ కూడా సరిపడా శక్తిని ఉత్పత్తి చేయలేకపోయి ఉంటుందని తెలిపారు.

ఎమర్జెన్సీలో.. మేడే

ముప్పు ముంగిట ఏటీసీకి పైలట్ పంపే హెచ్చరిక

- సాయం చేయండి అని అర్థం
- కాల్ రాగానే ఎమర్జెన్సీ మోడ్‌లోకి ఏటీసీ
- విమానానికి పూర్తి ట్రాఫిక్ క్లియరెన్స్



న్యూఢిల్లీ, జూన్ 12: విమానంలో అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు పైలట్.. సంబంధిత 'ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్' (ఏటీసీ)కి మేడే కాల్ చేస్తారు. అవతలి వారికి స్పష్టంగా వినిపించటం కోసం 'మేడే, మేడే, మేడే' అంటూ మూడుసార్లు చెబుతారు. ఇంజిన్ ఫెయిల్ కావటం, అగ్నిప్రమాదం సంభవించటం, విమానం మీద నియంత్రణ కోల్పోవటం, పీడనంలో అకస్మాత్తుగా మార్పులు చోటు చేసుకోవటం వంటి సందర్భాల్లో మే డే కాల్ చేస్తుంటారు. మే డే అనేది ఫ్రెంచి పదం 'మెయ్‌డెజ్' నుంచి పుట్టింది. ఈ పదానికి.. 'సాయం చేయండి' అని అర్థం. 1920ల నుంచి మేడే కాల్‌ని అంతర్జాతీయంగా అమలు చేయటం మొదలైంది. ఒక విమాన పైలట్ 'మే డే' కాల్ చేసినప్పుడు.. ఏటీసీ సిబ్బంది ఎమర్జెన్సీ ప్రొటోకాల్స్‌ను అమలు చేస్తారు. ఆ విమానానికి గగనతలంలో ట్రాఫిక్ పరంగా ఎటువంటి ఆటంకాలు లేకుండా చూస్తారు. పైలట్‌తో ప్రత్యక్ష కమ్యూనికేషన్‌లోకి వస్తారు. ఆ విమానం దిగే ఎయిర్‌పోర్ట్ ఎమర్జెన్సీ విభాగంతో సమన్వయం చేసుకుంటారు. అవసరమైతే స్థానిక వైమానిక స్థావరాలను, ఎయిర్‌పోర్టులను అప్రమత్తం చేస్తారు. ఏటీసీ నుంచి సమాచారం అందుకున్న ఎయిర్‌పోర్ట్ ఎమర్జెన్సీ విభాగం.. రన్‌వే వెంబడి అంబులెన్సులను, అగ్నిమాపక దళాల్ని మోహరిస్తుంది. విమానాలు మూడు రకాల ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ఉన్నప్పుడు పైలట్లు హెచ్చరికలు జారీ చేస్తుంటారు. 1. అనిశ్చితి 2. ప్రమాద సంకేతం 3. ముంచుకొచ్చిన విపత్తు. మూడో దశలో మే డే కాల్ చేస్తుంటారు.

విమానాలు ప్రమాదాల బారిన పడటానికి తరచూ పక్షులు కారణమవుతున్నాయి. సాధారణంగా టేకాఫ్, ల్యాండింగ్, తక్కువ ఎత్తులో (3 వేల అడుగుల కంటే తక్కువలో) విమానం ప్రయాణిస్తున్నప్పుడు పక్షులు విమానాన్ని ఢీకొనే ప్రమాదం ఎక్కువ. ఒక పక్షి లేదా కొన్ని పక్షుల గుంపు విమానాన్ని ఢీకొని ఇంజన్‌లో చిక్కుకుపోతే.. ఇంజన్‌లోని బ్లేడ్లు వంగిపోవటం, ఇంజన్ సామర్థ్యం తగ్గిపోవటం వంటి సమస్యలు తలెత్తుతాయి. దీంతో ఇంజన్ నిలిచిపోవటమో, అగ్నిప్రమాదం సంభవించటమో జరుగుతుంది. అహ్మదాబాద్ ఘటనలో ఇదే జరిగి ఉంటుందని వైమానిక నిపుణులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి

పక్షులతో భారీ ముప్పు

తగినట్టుగానే, విమాన ప్రమాద ప్రాంతంలో దాదాపు 50కిపైగా పక్షులు మరణించాయని వార్తలు వెలువడ్డాయి. పక్షులు ఢీకొనటం వల్ల విమానాల్లో విండ్‌షీల్డ్ దెబ్బతిని, పైలట్లకు విమానం ముందున్న మార్గం సరిగా కనిపించకపోవటం, క్యాబిన్‌లో వాయుపీడనం పెరిగిపోవటం వంటి సమస్యలు కూడా తలెత్తిన సందర్భాలున్నాయి. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసీఏఓ) ప్రకారం, పక్షులు ఢీకొనే ఘటనల్లో 92 శాతం పెద్దగా ప్రమాదాలు జరగనప్పటికీ, 8 శాతం ఘటనలు మాత్రం తీవ్రమైన ముప్పుగా పరిణమిస్తున్నాయి. పక్షులు విమానం ఇంజన్‌ను ఢీకొని దాంట్లో కూరుకుపోయిన సందర్భాల్లో మాత్రం తీవ్రమైన ప్రమాదాలు జరుగుతున్నాయి.

రెండుసార్లు గుజరాత్ సీఎంగా

విజయ్ రూపానీ

2016-21 మధ్య సీఎంగా బాధ్యతలు



అహ్మదాబాద్‌లో కుప్పకూలిన ఎయిర్ ఇండియా విమానంలో ఆ రాష్ట్ర మాజీ సీఎం విజయ్ రూపానీ (68) కన్నుమూశారు. ఆయన గుజరాత్‌కు రెండు సార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు.

ఆనందిబెన్ పటేల్ స్థానంలో 2016 ఆగస్టు ఏడో తేదీన తొలిసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన విజయ్ రూపానీ.. 2017లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత రెండోసారి సీఎంగా నియమితులై 2021 సెప్టెంబర్ 11 వరకూ కొనసాగారు. 2014 నవంబర్ - 2016 ఆగస్టు వరకూ రాష్ట్ర మంత్రిగా.. 2016 ఫిబ్రవరి-ఆగస్టు వరకూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రూపానీ సేవలందించారు. ఆయన తొలుత 1988-96 మధ్య రాజ్‌కోట్ నగరపాలక సంస్థ కార్పొరేటర్‌గా.. 1996-97 మధ్య మేయర్‌గా సేవలందించారు. విద్యార్థి దశలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకుడిగా పని చేసిన రూపానీ.. రాజ్‌కోట్‌లోని ధర్మేంద్ర సింగ్‌జీ ఆర్ట్స్ కాలేజీలో బీఏ పట్టా అందుకుని, సౌరాష్ట్ర యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. ఎమర్జెన్సీ సమయంలో 1976లో 11 నెలలు జైలు జీవితం గడిపిన రూపానీ.. జైన్ బనియా సామాజిక వర్గానికి చెందిన వారు. మయన్మార్ (పూర్వ బర్మా)లోని యాంగూన్‌లో రామ్‌నీక్‌లాల్, మాయాబెన్ దంపతులకు 1956 ఆగస్టు రెండో తేదీన జన్మించారు. 1960ల్లో భారత్‌కు వలస వచ్చిన రూపానీ కుటుంబం గుజరాత్‌లో స్థిరపడింది. విజయ్ రూపానీ కొనుగోలు చేసిన యాక్టీవా/ కారు నంబర్ 1206. ఆయన పుట్టిన తేదీ రెండో తేదీ కాగా, విమానంలో సీటు నంబర్ 2. ఏ కీలక పని చేపట్టాలన్నా జూన్ 12నే ప్రారంభిస్తారు విజయ్ రూపానీ. కాగా, ఆయనకు భార్య అంజలి, ఇద్దరు కుమారులు, ఒక కూతురు కాగా, చిన్న కుమారుడు పుజిత్ ప్రమాదంలో మరణించారు. లండన్‌లో ఉన్న భార్య అంజలి, కూతురు రాధిక వద్దకు వెళ్లేందుకు బయలుదేరిన విజయ్ రూపానీ విమాన ప్రమాదంలో మరణించారు.

బ్లాక్ బాక్స్ చెప్పేస్తుంది!

అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయింది. ఈ ప్రమాదానికి కారణం ఏమిటనేదానిపై ఇంతవరకూ అధికారిక ప్రకటన వెలువడలేదు. అది తెలియాలంటే బ్లాక్‌బాక్స్ దొరకాలి. దీనికోసం దర్యాప్తు బృందాలు వెతుకుతున్నాయి. అది దొరికితే.. ఈ ప్రమాదం సాంకేతిక సమస్య వల్ల జరిగిందా.. లేక ఇంజిన్ పనిచేయలేదా.., పక్షులు ఢీకొన్నాయా.., విమానంలో మంటలు చెలరేగాయాగా.. లేదా ఇది మానవ తప్పిదం వల్లే జరిగిందా అనేది కచ్చితంగా నిర్ధారించవచ్చు. టేకాఫ్ తర్వాత క్లిష్టమైన క్షణాల్లో సిబ్బంది 'మేడే కాల్' ద్వారా ప్రమాదంలో ఉన్నాం.. సాయం కావాలని కోరినట్టు తెలిసింది. ఆ వివరాలు బ్లాక్‌బాక్స్‌లో రికార్డవుతాయి. బ్లాక్ బాక్స్ దొరికితే.. దాన్ని డీజీసీఏ లేదా ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ)కి పంపుతారు. అక్కడ దీనిలో రికార్డయిన డేటాను డీకోడ్ చేస్తారు. ఆ డేటాను రాడార్, ఏటీసీ లాగ్స్‌తో అనుసంధానిస్తారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి 24 గంటల నుంచి వారం రోజుల వరకూ పట్టవచ్చు. పరికరానికి ఎంత నష్టం వాటిల్లింది అనే దాన్నిబట్టి ఇది ఆధారపడి ఉంటుంది.



రెండు విభాగాలు..

బ్లాక్ బాక్స్‌లో రెండు ప్రధాన భాగాలు ఉంటాయి. అందులో ఒకటి ఫ్లైట్ డేటా రికార్డర్ (ఎఫ్‌డీఆర్)కాగా, మరొకటి కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్). ఎఫ్‌డీఆర్ విమాన వేగం, ఎంత ఎత్తులో ఎగురుతోంది, ఇంజన్ పనితీరు, నియంత్రణ వంటి టెక్నికల్ డేటాను రికార్డు చేస్తుంది. సీవీఆర్.. కాక్‌పిట్‌లో పైలట్ల సంభాషణ, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)తో వారి కమ్యూనికేషన్, విమానంలో ఇతర శబ్దాలను రికార్డు చేస్తుంది. గత 25 గంటల్లో జరిగిన సంభాషణల సమాచారం వీటిలో నిక్షిప్తమై ఉంటుంది. ఈ రెండింటిలోని డేటాను విశ్లేషించడం ద్వారా ప్రమాదానికి ముందు విమానంలో ఏం జరిగిందో, పైలట్లు ఏం మాట్లాడారో, వ్యవస్థలు ఎలా పనిచేశాయో దర్యాప్తు అధికారులు తెలుసుకుంటారు. ప్రమాదానికి కచ్చితమైన కారణాన్ని గుర్తించి భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా నివారించేందుకు అవసరమైన సమాచారాన్ని బ్లాక్‌బాక్స్ అందిస్తుంది.

సీఏలు ఆర్థిక ప్రణాళికలో భాగస్వాములు

» చిన్న వ్యాపారాల అభివృద్ధికి దోహదపడాలి: భట్టి



హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చార్టెర్డ్ అకౌంటెంట్లు(సీఏలు) ప్రభుత్వ ఆర్థిక ప్రణాళికలో భాగస్వాములు కావాలని, చిన్న వ్యాపారాల ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. నగరంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) ఆధ్వర్యంలో గురువారం శిల్ప కళా వేదికలో జరిగిన సీఏ విద్యార్థుల జాతీయ స్థాయి సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. సీఏలు తమ ప్రతిభను సంపాదనకే కాకుండా సేవకు వినియోగించాలని, సామాజిక తనిఖీలు చేయాలని అన్నారు. సీఏ విద్యార్థులు భవిష్యత్తులో సొంత సంస్థలు స్థాపించే అవకాశాలుంటాయని, ఉద్యోగులుగా కాకుండా ఉద్యోగ దాతలుగా ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ దేశంలోని ఇతర రాష్ట్రాలతో కాకుండా ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతుందని చెప్పారు. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం, రీజనల్ రింగ్ రోడ్డు వంటి భారీ ప్రాజెక్టులు చేపడుతుండడంతో పాటు అనేక పరిశ్రమలకు కేంద్రంగా ఉందని తెలిపారు.

ప్రకృతి వైపరీత్యాల తీవ్రతను తగ్గించాలి

» జిల్లాల్లోనూ విపత్తు నిర్వహణ వ్యవస్థ బలోపేతం: పొంగులేటి

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల తీవ్రతను వీలైనంత మేర తగ్గించేలా అధికారుల ప్రణాళికలు ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. జిల్లాల్లోనూ విపత్తుల నిర్వహణ విభాగాన్ని బలోపేతం చేయడానికి హైడ్రా కమిషనర్, కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్, అగ్నిమాపక. నీటిపారుదల, ఆర్ అండ్ బీ, ఆరోగ్య శాఖ అధికారులతో ఉన్నత స్థాయి కమిటీ వేశామని తెలిపారు. వారం రోజుల్లో ఆ నివేదిక వస్తుందని, దాని ప్రకారం చర్యలు చేపడతామని పేర్కొన్నారు. విపత్తుల నిర్వహణ, వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై పలు జిల్లాల కలెక్టర్లు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో సచివాలయంలో గురువారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది వానాకాలం 15 రోజులు ముందే వచ్చిందని, కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఉన్నతంగా విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దాలి

» విద్యార్థుల ఖాతాల్లో కాస్మాటిక్ చార్జీలు జమ: పొన్నం

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆరోగ్యకర ఆహారం, వసతులు కల్పించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని బీసీ సంక్షేమశాఖ అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. వేసవి సెలవుల తర్వాత బీసీ గురుకులాలు, హాస్టళ్లు ప్రారంభమైన నేపథ్యంలో గురువారం బీసీ సంక్షేమశాఖ అధికారులతో మంత్రి పొన్నం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పేద, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యనందించడంతోపాటు రాష్ట్రం, దేశం గర్వ పడేలా ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వార్డెన్లతోపాటు ఉద్యోగులంతా క్షేత్రస్థాయిలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. ఈ ఏడాది నుంచి విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లోనే కాస్మొటిక్ చార్జీల జమ చేసేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

దేవుడి భూములు కబ్జా చేస్తే పీడీ యాక్ట్: సురేఖ

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దేవుడి భూముల్ని కబ్జా చేసే వారిపై పీడీ యాక్టులు పెడతామని మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. మేడ్చల్ జిల్లాలోని చెంగిచెర్ల వద్ద దేవాదాయ శాఖకు చెందిన భూమి అన్యాక్రాంతమవుతోందన్న ఫిర్యాదు మేరకు రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి గురువారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెంగిచెర్ల రెవెన్యూ పరిధిలో ఉన్న 30.28 ఎకరాల భూమి 1976 నుంచి దేవాదాయ శాఖ పరిధిలో ఉందని, దీనిని కబ్జా చేసే ప్రయత్నం జరుగుతోందని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. దేవాదాయ భూములు కబ్జాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

కాళేశ్వరంపై సీబీఐ విచారణ కోరాలి: డీకే అరుణ

» రైతులను ముంచిన కాంగ్రెస్ సర్కార్: పాయల

రాంనగర్/హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై రాష్ట్ర సర్కారు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి సీబీఐ విచారణ కోరాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. బీజేపీ 11 ఏళ్ల పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సీఎం కుర్చీలో ఎన్ని రోజులు ఉంటారో తెలియదని, ఉన్నప్పుడే కాళేశ్వరం అవినీతిలో సూత్రధారులు, పాత్రధారుల పేర్లను వెల్లడించి విశ్వసనీయతను చాటుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని బీజేఎల్పీ ఉప నేత పాయల శంకర్ మండిపడ్డారు. రూ.2 లక్షలకు పైగా లోన్ ఉన్న రైతులకు రుణమాఫీ విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదని విమర్శించారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి వల్ల బ్యాంకర్లు రైతులకు కొత్తగా రుణాలు ఇచ్చేందుకు తిరస్కరిస్తున్నారని చెప్పారు.

రేవంతే రాష్ట్రానికి అసలు శత్రువు: ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): 'ప్రాణాలకు తెగించి ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణను సాధించి పెట్టింది కేసీఆరే.. ఇప్పుడు ఉద్యమ ద్రోహులు అధికారంలోకి వచ్చి ఈ రాష్ట్రానికి కేసీఆర్ కుటుంబం శత్రువని చెప్పడం దుర్మార్గం. ఇక్కడి నీళ్లను ఏపీకి అక్రమంగా తరలించుకొనిపోతుంటే.. ప్రశ్నించకపోగా.. వారికి సహకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డే.. తెలంగాణకు అసలు శత్రువు' అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్, కిషన్‌రెడ్డి ఒక్కటే అని ఢిల్లీలో సీఎం చెప్పినమాట శుద్ధ అబద్ధమన్నారు. రేవంత్‌రెడ్డి, బీజేపీ దోస్తాన్ చాలాసార్లు బయట పడిందని చెప్పారు.

రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం: ఆర్ఎస్ ప్రవీణ్

తెలంగాణలో రేవంత్ రెడ్డి పాలనలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తమైందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖను తనవద్దే ఉంచుకున్న సీఎం ఈ రంగాన్ని నాశనం చేస్తున్నారని చెప్పారు. స్కూళ్లలో కంప్యూటర్లు, ఇంటర్‌నెట్ లేకుండా విద్యార్థులు ఏఐ ఎలా నేర్చుకుంటారని ప్రశ్నించారు. సర్దుబాటు పేరుతో ప్రభుత్వ స్కూళ్లను మూసేయడం తగదన్నారు.

ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆటో చార్జీలు పెంచడం, కార్మికుల సంక్షేమబోర్డు ఏర్పాటు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేనిసాంబశివరావు చెప్పారు. జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలో కొత్తగా 60 వేల ఆటోలను అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఆటో కార్మికులు సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో కూనంనేనిని సన్మానించారు. తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్ల సంఘం ఐకాస కన్వీనర్ వెంకటేశం మాట్లాడు తూ ఓలా, ఉబర్ తదితర సంస్థల నుంచి డ్రైవర్లను రక్షించడానికి ప్రభుత్వ మే ఒక యాప్ రూపొందించేలా రవాణాశాఖ మంత్రితో చర్చించాలని కోరారు.

విద్యాసంస్థల వాహనాలపై రవాణా శాఖ కేసులు

» ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోతే కఠిన చర్యలు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాలలు పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యాసంస్థల వాహనాల ఫిట్‌నెస్‌పై రవాణా శాఖ అధికారులు దృష్టి సారించారు. సరైన పత్రాలు, ఫిట్‌నెస్ లేని వాహనాల్లో విద్యార్థుల్ని తరలిస్తున్న విద్యాసంస్థల వాహనాలపై అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఆయా విద్యాసంస్థలకు చెందిన 93 వాహనాలపై కేసులు నమోదు చేశారు. అత్యధికంగా హైదరాబాద్‌లో 31 వాహనాలు, రంగారెడ్డి జిల్లాలో 19 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు రవాణా శాఖ అధికారులు వెల్లడించారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు రోడ్డెక్కితే కేసుల నమోదు చేయడంతో పాటు వాటిని సీజ్ చేస్తామని రవాణా శాఖ హెచ్చరించింది.

ఇన్‌చార్జి మంత్రుల జిల్లాలు మార్పు

» కొత్త మంత్రులకు బాధ్యతలు

» కొండా సురేఖ, ఉత్తమ్, కోమటిరెడ్డిల ఇన్‌చార్జి బాధ్యతలు తొలగింపు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఇన్‌చార్జి మంత్రుల బాధ్యతల్లో మార్పులు చేర్పులు చేసింది. కొత్త మంత్రులకు జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈమేరకు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. గడ్డం వివేక్ వెంకటస్వామికి మెదక్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు నల్గొండ, వాకిటి శ్రీహరికి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి బాధ్యతను ప్రభుత్వం కేటాయించింది. పాత మంత్రుల్లో కొందరికి కేటాయించిన జిల్లాలను మార్చగా.. ముగ్గురిని ఆ బాధ్యతల నుంచి తొలగించింది. ప్రస్తుతం ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మెదక్ జిల్లా ఇన్‌చార్జిగా ఉన్న కొండా సురేఖ, కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జిగా ఉన్న ఉత్తమ్‌లను ఆ బాధ్యతల నుంచి తొలగించింది. ప్రస్తుతం నల్గొండ జిల్లా ఇన్‌చార్జిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావుకు తాజా మార్పుల్లో కరీంనగర్ జిల్లాను, నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా ఉన్న జూపల్లి కృష్ణారావుకు ఆదిలాబాద్, ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జిగా ఉన్న సీతక్కకు నిజామాబాద్ జిల్లాను కేటాయించింది. మొత్తంగా ఉమ్మడి పది జిల్లాలకు ఇన్‌చార్జులుగా పదిమంది మంత్రులకు బాధ్యతలు అప్పగించింది.

జిల్లా ఇన్‌చార్జి మంత్రులు వీరే

ఇన్‌చార్జి మంత్రులు	జిల్లాలు
దామోదర రాజనర్సింహ	మహబూబ్‌నగర్
దుద్దిళ్ల శ్రీధర్‌బాబు	రంగారెడ్డి
పొంగులేటి శ్రీనివాసరెడ్డి	వరంగల్
పొన్నం ప్రభాకర్	హైదరాబాద్
డి.అనసూయ (సీతక్క)	నిజామాబాద్
తుమ్మల నాగేశ్వరరావు	కరీంనగర్
జూపల్లి కృష్ణారావు	ఆదిలాబాద్
గడ్డం వివేక్ వెంకటస్వామి	మెదక్
అడ్లూరి లక్ష్మణ్‌కుమార్	నల్గొండ
వాకిటి శ్రీహరి	ఖమ్మం

భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

(మొదటిపేజీ తరువాయి)

కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు స్పెషల్ సీఎస్‌గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి శశాంక్ గోయల్‌ను తాజాగా తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. సుదీర్ఘకాలంగా రెసిడెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న గౌరవ్ ఉప్పల్‌కు కేంద్ర ప్రాజెక్టులు, సీఎస్ఎస్‌ల సమన్వయ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించింది. రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్‌ను విద్యుత్తు శాఖ ముఖ్యకార్యదర్శిగా నియమించింది. ఫిషరీస్ డైరెక్టర్‌గా అప్రాధాన్య పోస్టులో ఉన్న ప్రియాంక ఆలను కీలకమైన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి బాధ్యతలు అప్పజెప్పింది. వెయిటింగ్‌లో ఉన్న శివశంకర్ లోతేటికి రెవెన్యూ శాఖ సంయుక్త కార్యదర్శిగా, చిట్టెం లక్ష్మికి జీఏడీ సంయుక్త కార్యదర్శిగా పోస్టింగులు ఇచ్చింది. పాఠశాల విద్యా సంచాలకుడు నర్సింహారెడ్డిని బదిలీ చేసినా పోస్టింగ్ ఇవ్వలేదు. పురపాలక శాఖ కమిషనరేట్‌లో అదనపు డైరెక్టర్‌గా ఉన్న జె.శంకరయ్యకు తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఎండీగా పోస్టింగ్ ఇచ్చారు. పి.శ్రీకాంత్‌బాబుకు ఆయుష్ డైరెక్టర్‌గా, టీజీఐఐసీ అధికారి పవన్‌కుమార్‌కు టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది.

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
శశాంక్ గోయల్	ఢిల్లీ తెలంగాణ భవన్ స్పెషల్ సీఎస్	ఢిల్లీ తెలంగాణ భవన్ స్పెషల్ సీఎస్ అండ్ రెసిడెంట్ కమిషనర్
నవీన్ మిత్తల్	రెవెన్యూ ముఖ్యకార్యదర్శి	విద్యుత్తు శాఖ ముఖ్యకార్యదర్శి
ఎస్.శ్రీధర్	ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి	పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి, గనుల శాఖ ముఖ్యకార్యదర్శిగా అదనపు బాధ్యతలు
జ్యోతి బుద్ధా ప్రకాశ్	రిజిస్ట్రేషన్లు, గృహ నిర్మాణ శాఖల కార్యదర్శి	ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి, ప్రణాళిక శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు
లోకేశ్‌కుమార్	అదనపు సీఈవో	రెవెన్యూశాఖ కార్యదర్శి, సీసీఎల్ఏగా అదనపు బాధ్యతలు
గౌరవ్ ఉప్పల్	ఢిల్లీ తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్	తెలంగాణ భవన్‌లో కేంద్ర ప్రాజెక్టులు, సీఎస్ఎస్‌ల సమన్వయ కార్యదర్శి
భారతి లక్‌పతి నాయక్	పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ కార్యదర్శి	సమాచార హక్కు కమిషన్ కార్యదర్శి
హరిచందన దాసరి	రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి	హైదరాబాద్ కలెక్టర్
కిల్లు శివకుమార్ నాయుడు	జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్	నీటి పారుదలశాఖ ఆర్అండ్ ఆర్ కమిషనర్
రాజీవ్‌గాంధీ హన్మంతు	నిజామాబాద్ కలెక్టర్	రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక కార్యదర్శి, రిజిస్ట్రేషన్ల కమిషనర్‌గా అదనపు బాధ్యతలు
టి.వినయ్‌కృష్ణారెడ్డి	ఆర్ అండ్ ఆర్ కమిషనర్	నిజామాబాద్ కలెక్టర్
జి.శ్రీజన	పంచాయతీరాజ్ డైరెక్టర్	మహిళాశిశు సంక్షేమ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు
శివశంకర్ లోతేటి	వెయిటింగ్, ఎస్ఎల్‌బీసీ రెస్క్యూ ఆపరేషన్స్ ఇన్‌చార్జి	రెవెన్యూశాఖ సంయుక్త కార్యదర్శిగా అదనపు బాధ్యతలు
చిట్టెం లక్ష్మి	వెయిటింగ్	జీఏడీ సంయుక్త కార్యదర్శి
కె.హైమావతి	ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ పీడీ	సిద్దిపేట కలెక్టర్
వాసం వెంకటేశ్వర్‌రెడ్డి	యూత్ సర్వీసెస్ డైరెక్టర్	ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ పీడీ, ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు
గౌతమ్	గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి	గృహనిర్మాణ శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు
గౌతమ్ పోట్రు	మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్	సింగరేణి (పీ అండ్ ఏ) డైరెక్టర్
కె.నిఖిల	టీజీఐఆర్‌డీ సీఈవో	ఫిషరీస్ డైరెక్టర్, టీజీఐఆర్‌డీ సీఈవోగా అదనపు బాధ్యతలు
వల్లూరు క్రాంతి	సంగారెడ్డి కలెక్టర్	పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ
పి.ఉదయ్‌కుమార్	వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి	ఆరోగ్యశ్రీ సీఈవో, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా అదనపు బాధ్యతలు
ప్రియాంక ఆల	ఫిషరీస్ డైరెక్టర్	తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి
పి.ప్రావీణ్య	హనుమకొండ కలెక్టర్	సంగారెడ్డి కలెక్టర్
నిర్మలా క్రాంతి వెస్లీ	మహిళా సంక్షేమ డైరెక్టర్	తెలంగాణ మానవ హక్కుల కమిషన్ కార్యదర్శి, సీఈవో, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీగా అదనపు బాధ్యతలు
మిక్కిలినేని మను చౌదరి	సిద్దిపేట కలెక్టర్	మేడ్చల్ కలెక్టర్
ముజమ్మిల్ ఖాన్	ఖమ్మం కలెక్టర్	పౌర సరఫరాల డైరెక్టర్, జాయింట్ సెక్రటరీగా, చీఫ్ రేషనింగ్ ఆఫీసర్
స్నేహ శబరీష్	జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్	హనుమకొండ కలెక్టర్
అనుదీప్ దురిశెట్టి	హైదరాబాద్ కలెక్టర్	ఖమ్మం కలెక్టర్
నవీన్ నికోలస్	టీజీపీఎస్సీ కార్యదర్శి	పాఠశాల విద్యా డైరెక్టర్, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు
ప్రియాంక	పురపాలక శాఖ డిప్యూటీ కార్యదర్శి	సమాచార, పౌర సంబంధాల స్పెషల్ కమిషనర్
చాహత్ బాజ్‌పాయ్	కరీంనగర్ మునిసిపల్ కమిషనర్	గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కమిషనర్
అశ్వినీ తానాజీ వాకడే	గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్	కరీంనగర్ అదనపు కలెక్టర్
ప్రఫుల్ దేశాయ్	కరీంనగర్ అదనపు కలెక్టర్	కరీంనగర్ మున్సిపల్ కమిషనర్
బి.షఫియుల్లా	గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ కమిషనర్	మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి, మైనారిటీ వెల్ఫేర్ డైరెక్టర్‌గా దనపు బాధ్యతలు
పీఎస్ఎన్‌వీ ప్రసాద్	పౌర సరఫరాల డైరెక్టర్	హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్
నిఖిల్ చక్రవర్తి	టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్	పరిశ్రమల శాఖ డైరెక్టర్

ఏడేళ్లలో రూ.2,148.45 కోట్లు

» బతుకమ్మ చీరల పథకానికి గత ప్రభుత్వ ఖర్చు ఇది

» సహ చట్టం కింద వివరాలు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో 2017-18 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24వరకు బతుకమ్మ చీరల పథకం కోసం ప్రభుత్వం రూ.2,148.45కోట్లు ఖర్చు చేసినట్లు చేనేత, జౌళి శాఖ కమిషనర్ కార్యాలయం వెల్లడించింది. ఈ పథకం కోసం ఎక్కడ చీరలు కొన్నారు? టెండర్లలో పేర్కొన్న ధరలు, సరఫరా చేసిన సంస్థల వివరాలను యూత్‌ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ అధ్యక్షుడు పల్నాటి రాజేంద్ర సమాచార హక్కు చట్టం కింద కోరగా.. ప్రభుత్వం ఏడేళ్లలో ఈ పథకం కోసం చేసిన ఖర్చు వివరాలను తెలియజేసింది. బతుకమ్మ చీరల పథకం కింద ప్రభుత్వం 2017-18లో రూ.222.48 కోట్లు, 2018-19లో రూ.280 కోట్లు, 2019-20లో రూ.303.50 కోట్లు, 2020-21లో రూ.317.81 కోట్లు, 2021-22లో రూ.333.14కోట్లు, 2022-23లో రూ.340కోట్లు, 2023-24లో రూ.351.52 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొంది.

మాదక ద్రవ్యాలకు ఉమ్మడి నిఘాతో చెక్

» అధికారులకు డీజీపీ జితేందర్ సూచన

హైదరాబాద్, జూన్12 (ఆంధ్రజ్యోతి): దేశంలో మాదక ద్రవ్యాల రవాణ, వినియోగాన్ని అడ్డుకునేందుకు దర్యాప్తు సంస్థలన్నీ సరఫరాదారుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఇచ్చిపుచ్చుకోవాలని, ఉమ్మడి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని డీజీపీ జితేందర్ అన్నారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన మాదకద్రవ్యాల నియంత్రణ విభాగాల అధికారుల తొలి సమావేశాన్ని గురువారం హైదరాబాద్ లోని పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ తెలంగాణలో మాదకద్రవ్యాల కట్టడికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. మాదక ద్రవ్య వ్యాపారుల నెట్‌వర్క్ వివిధ రాష్ట్రాల్లో విస్తరించిన నేపథ్యంలో సంబంధింత విభాగాలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని టీజీనాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య కోరారు. సమావేశంలో గోవా, కేరళ, మహారాష్ట్ర, ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, కస్టమ్స్, బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్, ఈడీ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఓఎంసీ కేసులో శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్ విడుదల

సైదాబాద్, జూన్12(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కంపెనీ కేసులో చంచల్‌గూడ జైలులో శిక్ష అనుభవిస్తున్న బీవీ శ్రీనివాస్‌రెడ్డి, వీడీ రాజగోపాల్ గురువారం బెయిల్‌పై విడుదలయ్యారు. చంచల్‌గూడ జైలులో శిక్ష అనుభవిస్తున్న వీరికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. బెయిల్ ఉత్తర్వులు బుధవారం సాయంత్రం ఆలస్యంగా జైలు అధికారులకు చేరడంతో శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్ గురువారం ఉదయం విడుదలయ్యారు.

కేటీఆర్, కౌశిక్‌రెడ్డిలపై సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు

గన్‌పార్క్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై గురువారం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నేతృత్వంలో బషీర్‌బాగ్‌లోని సైబర్ క్రైమ్ ఏసీపీ, ఎస్‌హెచ్ఓ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వెంకట్ మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్, కౌశిక్‌రెడ్డిలు సీఎం హోదాను విస్మరించి రేవంత్ రెడ్డిపైనే అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. గతంలో కేసీఆర్ అనేకసార్లు ప్రతిపక్షాలను ఉద్దేశించి సీఎం పదవికి గౌరవం ఇవ్వాలనే వారని కేటీఆర్, కౌశిక్‌రెడ్డిలకు కనీసం సోయిలేకుండా రేవంత్‌రెడ్డిపై మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు.

మోహన్‌బాబు దాడి కేసుపై స్థాయీ నివేదిక ఇవ్వండి: హైకోర్టు

హైదరాబాద్, జూన్12 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుపై సినీనటుడు మంచు మోహన్‌బాబు దాడి చేశారంటూ పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన క్రిమినల్ కేసు దర్యాప్తు ఏదశలో ఉందో తెలుపుతూ స్థాయీ నివేదిక ఇవ్వాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. మోహన్‌బాబు ఇంట్లో తలెత్తిన సమస్యపై కవరేజీకి వెళ్లిన జర్నలిస్టు రంజిత్‌కుమార్‌పై దాడి చేశారంటూ కేసు నమోదైంది. దీన్ని కొట్టివేయాలని కోరుతూ ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారించింది. రంజిత్‌కు ఇంకా నోటీసులు అందలేదని ఆయన తరఫు న్యాయవాదులు తెలిపారు. నోటీసు అందజేయాలని ఆదేశించిన ధర్మాసనం తదుపరి విచారణను ఈనెల24కు వాయిదావేసింది.

అంతర్రాష్ట్ర గజదొంగ సలీమ్ ఖురేషి అరెస్టు

ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో 200కుపైగా దొంగతనాలు

» మహారాష్ట్రలో అరెస్టు చేసిన విశాఖ పోలీసులు

మహారాణిపేట(విశాఖపట్నం), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో 200కుపైగా దొంగతనాలకు పాల్పడిన హైదరాబాద్ వాసి మహ్మద్ సలీమ్ ఖురేషి (51)ని విశాఖపట్నం పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను విశాఖ నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సలీమ్ ఖురేషి తన గ్యాంగ్ తో కలిసి ఏపీలో 5 (విశాఖలో 3, గుంటూరులో 2), తెలంగాణలో 65, మహారాష్ట్రలో 35, రాజస్థాన్, గుజరాత్‌లలో ఒక్కొక్కటి, కర్ణాటకలో ఆరు సహా 200కుపైగా దొంగతనాలకు పాల్పడినట్టు సీపీ తెలిపారు. 2001లో ముంబైలో గ్యాంగ్‌స్టర్ చోటారాజన్ ఇంట్లో పది కోట్ల విలువైన బంగారు వస్తువులు, వజ్రాలను దొంగిలించాడన్నారు. మహారాష్టకు చెందిన మయూర్ జాదవ్ అలియాస్ వసీం అబ్దుల్ షేక్, పఠాన్ అనే మరో ఇద్దరితో కలిసి గత 3 నెలల వ్యవధిలో విశాఖలోని పాండురంగపురంలో రెండిళ్లలో, వాల్తేర్ అప్‌ల్యాండ్స్‌లోని ఒక ఇంటిలో దొంగతనానికి పాల్పడ్డాడన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని, డీసీపీ, ఏసీపీ, ఏడీసీపీ క్రైమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు ప్రారంభించి, సీసీ ఫుటేజి ఆధారంగా నిందితుడి ఫొటోను దేశంలోని అన్ని ప్రాంతాలకు పంపినట్టు తెలిపారు. తద్వారా అతను అంతరాష్ట్ర నేరస్థుడు సలీం ఖురేషీగా గుర్తించామన్నారు. అతని కుటుంబ సభ్యులకు సంబంధించిన 20 సెల్‌ఫోన్ల డేటా రికార్డుల ఆధారంగా నిందితుడు మహారాష్ట్రలో ఉన్నట్టు గుర్తించి, అక్కడకు వెళ్లి అరెస్టు చేసినట్టు తెలిపారు. అతడి నుంచి సుమారు రూ.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. మయూర్ జాదవ్, పఠాన్ తప్పించుకున్నారని, వారి కోసం గాలిస్తున్నామని తెలిపారు.

ఏఐతో నియామక పరీక్షల్లో వివాదాలు తగ్గించొచ్చు

» యూపీఎస్సీ చైర్మన్ అజయ్ కుమార్



యూపీఎస్సీ చైర్మన్ అజయ్ కుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న శ్రీధర్ బాబు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్వహించే పరీక్షల్లో వివాదాలను కృత్రిమ మేధ (ఏఐ)తో తగ్గించవచ్చని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) చైర్మన్ అజయ్ కుమార్ అన్నారు. యూపీఎస్సీ పరీక్షల్లో ఏఐని ఇప్పటికే వినియోగిస్తున్నామని తెలిపారు. రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లలో వివాదాలు, కోర్టు సమస్యలు, ఇతర అంశాలపై చర్చించేందుకు రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం నల్సార్ యూనివర్సిటీలో ప్రారంభమైంది. టీజీపీఎస్సీ, నల్సార్ వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సులో 18 రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కార్యదర్శులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తులు లక్షల్లో వస్తున్నందున వివాదరహితంగా, కోర్టు కేసులులేకుండా నిర్వహించడం కత్తిమీద సాములా మారిందని, దీనికి సాంకేతిక పరిజ్ఞానం పరిష్కారమన్నారు. పరీక్షలు పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకూ ఏఐ, లార్జ్ లాంగ్వేజ్ మాడ్యూల్స్ (ఎల్ఎల్ఎం) వినియోగించాలని సూచించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు డిజిటలైజేషన్‌కు అత్యంత ప్రాధాన్యమివ్వాలన్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఏఐ వినియోగంలో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో వచ్చినప్పటి నుంచి టీజీపీఎస్సీలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని, వివాదాలు లేకుండా నియామక పరీక్షలు జరుగుతున్నాయన్నారు. టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. నోటిఫికేషన్ ఇచ్చిన ప్రతి పరీక్షను పూర్తి పారదర్శకతతో నిర్వహిస్తున్నామన్నారు. తాము నిర్వహించే ప్రతి పరీక్షకు, ప్రతి అభ్యర్థికి పూర్తి జవాబుదారీగా ఉంటున్నామన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.